సామాజిక, ఆర్థిక, రాజకీయ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

వార్త న్యూస్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి
DOWNLOAD
App Store Play Store

epaper.vaartha.com WWW.VAARTHA.COM
కరీంనగర్ : fb.com/vaartha Digital
Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
24-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 204 పేజీలు: 8+16 వెల: 8.00

# కోటాపై మంత్రుల సలహా కమిటీ

## 26లోగా నివేదిక ఇవ్వాలని పిఏసిలో నిర్ణయం



శనివారం గాంధీభవన్‌లో మీడియాతో డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు23:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు కాంగ్రెస్ సన్నద్ధమైంది. శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. బిసి రిజర్వేషన్లు అంశంపై మంత్రులతో న్యాయ సలహా సంప్రదింపుల కమిటీని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో చర్చించి కమిటీని ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క లతో మంత్రుల కమిటీని ప్రకటించారు. దేశంలో నిష్ణాతులైన న్యాయ కోవిధులు, రాజ్యాంగ నిపుణులతో సంప్రదించి మంత్రుల కమిటీ 26వ తేదీ లోగా స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు అమలు అంశాలపై నివేదిక ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఇదే సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈనెల 28 వ తేదీ లోపు నివేదిక ఇచ్చేలా లీగల్ ఎక్స్పర్ట్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. సాధారణ ఎన్నికల ముందు మా

### స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై న్యాయనిపుణుల కమిటీ

### 28లోగా నివేదిక ఇచ్చేలా దిశానిర్దేశం

### మీడియాతో డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్

ప్రియతమ నేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి రాగానే కుల సర్వే నిర్వహించాం. ఓబీసీలకు 42 రిజర్వేషన్ కల్పించేందుకు సర్వే ద్వారా వచ్చిన వివరాలను శాసనసభలో ప్రవేశపెట్టి రెండు బిల్లులు పాస్ చేశామని చెప్పారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్, విద్య ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లులు ఆమోదింప చేశామన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ దాటకూడదు అంటూ టిఆర్ఎస్ హయాంలో నాటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన క్యాప్ జీవోను తొలగించేందుకు ఆర్డినెన్స్ సైతం తీసుకువచ్చామన్నారు. బీసీల రిజర్వేషన్ బిల్లు గవర్నర్ నుంచి రాష్ట్రపతి వద్దకు వెళ్ళింది. రాష్ట్రపతి దగ్గర కావాలనే ఆలస్యం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 31 లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది. 42 శాతం రిజర్వేషన్ కు సంబంధించి రాష్ట్రపతి నుంచి బిల్లు ఆమోదం పొంది రావాలి, లేదంటే పార్టీ నుంచి 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి, బీసీలకు న్యాయం జరగాలనదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్, సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేయడం ఈ విషయాలన్నిటిపైన లీగల్ ఎక్స్పర్ట్స్ కమిటీ ఏర్పాటు చేసి ఈనెల 28లోపు నివేదిక తెప్పించుకోవాలని పిఏసి నిర్ణయించిందని తెలిపారు. లీగల్‌ఎక్స్‌పర్ట్‌కమిటీలో సభ్యులు ఇతర వివరాలను పిసిసి అధ్యక్షుడు మహేష్ ప్రకటిస్తారని చెప్పారు.

**జస్టిస్ సుదర్శన్‌రెడ్డి బరిలోకి దింపడంపై ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ హర్షం**

ప్రగతిశీల భావాలు కలిగిన ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి విజయానికి తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పక్షాలు, ఓటు హక్కు కలిగిన ప్రజాప్రతినిధులు సహకరించాలి. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలంగాణ రైతు కుటుంబం నుంచి వచ్చిన తెలుగు వ్యక్తి, ఈ గొప్ప వ్యక్తిని ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో దించడంపై ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నుంచి హర్షం వ్యక్తం చేశామని చెప్పారు.. సుదర్శన్ రెడ్డి హైకోర్టు >>2



శనివారం గాంధీభవన్‌లో పిఏసి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

# ఏది ఏమైనా బిసిలకు మేలు జరగాల్సిందే

### బిల్లులపై విడిగా 'సుప్రీం'కు వెళ్తే లిస్ట్‌కు సమయం పడుతుంది..

### యూరియా కొరతపై బిఆర్ఎస్, బిజెపి డ్రామాలు

### పిఏసి సమావేశంలో మాట్లాడిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తెచ్చారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ అడ్డంకిని తొలగించడానికి ఆర్డినెన్స్ తెచ్చామని శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాహుల్ గాంధీ,పార్టీ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో కులగణన చేపట్టామని, బీసీలకు విద్యా,ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు మంత్రి >>2

# హైదరాబాద్‌లో 'డబుల్ ఓట్లు' ఎక్కువే

### సవరణ జరిగితే నాలుగు లక్షల ఓట్లు తరుగు

### గ్రామాల్లో బిజెపికి పెరిగిన ఓటు బ్యాంకు

### పాదయాత్ర ఎందుకో తెలీని రాహుల్

### మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



శనివారం హైదరాబాద్‌లో మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** బీహార్ ఎలక్షన్‌లో బిజెపికి మంచి వాతావరణం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బేగంపేట లోని హరితప్లాజాలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అసలు ఒక ఎజెండా లేదని, రాహుల్ గాంధీ ఎందుకు పాదయాత్ర చేస్తున్నాడో కాంగ్రెస్ నేతలకే తెలియదన్నారు. ఓట్లు లేవని, డబుల్ ఓట్లు ఉన్నాయని ఆయన విమర్శలు చేస్తున్నారు. ఓట్లు లేకుంటే ఓట్లు నమోదు చేసుకోవాలి రెండు ఓట్లు ఉంటే తొలగిస్తారన్నారు. తనకు తాను ఏదో ఆటంబాంబు పేల్చానని రాహుల్ ఫీల్ అవుతున్నాడు. బీహార్‌లో గతం కంటే ఇప్పుడు ఇంకా మెజారిటీ పెరుగుతుందన్నారు. మా సీట్ షేరింగ్‌పై కూడా ఒక కొలిక్కి వచ్చామన్నారు. కాంగ్రెస్, ఆర్‌జెడికి ఒక ఏజెండా అంటూ ఏమీలేదన్నారు. రాహుల్‌గాంధీ ఏమి మాట్లాడుతున్నారో ఆయనకు తెలియదన్నారు. బీహార్‌లో ఇల్లీగల్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, హైదరాబాద్‌లో కూడా చాలామందికి రెండు ఓట్లు ఉన్నాయి, వారు ఏదో ఒకచోట ఉంచుకోవాలన్నారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న సమసనయ అన్నారు. హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. దొంగ ఓట్లతోనా? అంటూ ప్రశ్నించారు.అవినీతికి భయపడే వారు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఇన్ సైడ్‌గా అంతా సెట్ చేసుకుంటున్నాం. కాళేశ్వరం అంశంపై అధికార దుర్వినియోగం జరిగిందన్నారు. సిఎం తప్పు చేస్తున్నారని అనేక డిబేట్లలో పలువురు రిటైర్ ఇంజినీర్లు చెప్పారు.ప్రాజెక్టులో లోపాలను మాత్రమే డ్యామ్ సేఫ్టీ అధికారులు చెబుతారు అంతేకానీ అవినీతి గురించి వారు చెప్పరు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విచారణ సిబిఐకి ఇవ్వాలని లేఖ రాసింది,ఇప్పుడు స్టాండ్ మార్చుకుందన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరపాలన్నారు. గువ్వల బాలరాజు అయిన సొంత నిర్ణయం, బిజెపిలోకి రమ్మన్ని ఆయన్ను మేము అడగలేదు, ఆహ్వానించలేదు.ఆది అయిన సొంత నిర్ణయం అన్నారు. బిజెపి పార్టీలో ఎవరైనా రావాలనుకుంటే రాజీనామా చేసి రావాలి, అలా చేస్తేనే మేము పార్టీలో చేర్చుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ తీవ్రవాదనికి బాధిత పార్టీ. ఎమ్మెల్యేలు, ఎంపిలు, నాయకులు ఎంతో మంది బలయ్యారు.అయినా కాంగ్రెస్ పార్టీకి సిగ్గు రావడం లేదన్నారు. మేము గెలిచిన 8 ఎంపి సీట్లు చేరికల వల్ల గెలవలేదు. వేరే పార్టీల నుండి వచ్చిన వాళ్ళ వల్లగెలిచాం అనడం సబబుకాదు.గ్రామాల్లో బిజెపికి ఓటుబ్యాంకు పెరిగిందన్నారు. యూరియా సరఫరా విషయంలో మంత్రి తుమ్మనాగేశ్వరరావు నాతో మాట్లాడారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. రాష్ట్రానికి మరో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరినట్లు చెప్పారు. రావాల్సిన వాటా తప్పకుండా పంపిస్తామని చెప్పారు. >>2



## 12 మంది సిఎంలపై క్రిమినల్ కేసులు!

### తెలంగాణ సిఎం రేవంత్‌పై 89, తమిళనాడు సిఎం స్టాలిన్‌పై 47, చంద్రబాబుపై 19, సిద్ధరామయ్యపై 13 కేసులు

### -ఎడిఆర్ నేవేదిక

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** దేశ రాజకీయాల్లో ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దేశ వ్యాప్తంగా వున్న 30 మంది ముఖ్యమంత్రుల్లో 12 మందిపై క్రిమినల్ కేసులున్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిపోర్ట్స్ (ఏడిఆర్) అనే సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధికంగా 89 కేసులుండగా తమిళనాడు సిఎం స్టాలిన్‌పై 47 కేసులున్నాయి. వీరి తరువాత ఎపి సిఎం చంద్రబాబు నాయుడుపై 19 కేసులు, >>2

# మూసీ ప్రక్షాళనే ప్రభుత్వ లక్ష్యం

### ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికలే పునాది

### ఐటిపిఐ సౌత్ జోన్ కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబు



శనివారం ఐటిపిఐ సౌత్ జోన్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** మంచి పని చేసేటప్పుడు కొందరూ కావాలనే అడ్డుపడుతుంటారని, మూసి ప్రక్షాళన విషయంలోనూ ఇదే జరుగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. భావి తరాల కోసం ప్రక్షాళన చేసి తీరుతామని, వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్‌గా నిలుపుతామని మంత్రి స్పష్టం చేశారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా(ఐటిపిఐ) తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని ఒక హోటల్‌లో పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టూవార్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం అనే అంశంపై ఏర్పాటుచేసిన సౌత్‌జోన్ కాన్ఫరెన్స్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమన్నారు. ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది అని నొక్కి చెప్పారు. మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్-న్యూట్రల్ గ్రోత్, జలసంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి >>2

# 500 ఎకరాలను రక్షించాం

### కబ్జాల చెర నుంచి ప్రభుత్వ స్థలాలు వెనక్కి

### మరో వందేళ్లు ఉపయోగపడేలా కార్యాచరణ

### ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం

### మీట్‌దిప్రెస్‌లో హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్



శనివారం హైదరాబాద్‌లో మీట్‌ది ప్రెస్‌లో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** హైడ్రా నేడు తీసుకునే చర్యలతో భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరగుతుందని ..తమ కార్యాచరణ మరోవందేళ్లపాటు చెరవులు, కుంటలు, నాలాలు రక్షించబడేలా ఉంటాయని, అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమణలపై హైడ్రా తీసుకునే చర్యల విషయంలో చట్టం అందరికి ఒకటేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, అక్బరుద్దీన్ ఓవైసీకి వేరుగా ఉండవని..టైమ్ రాగానే చట్టం అందరికి ఒక్కటే అవుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయా ఆక్రమణలపై వివరాలు సేకరిస్తున్నామని.. విచారణ చేసి నోటీస్‌లు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఈమేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో రంగనాథ్ మాట్లాడారు. హైడ్రా రాజకీయాలకు అతీతంగా నడుస్తోందని.. రాజకీయ కక్షతో నోటీసులు ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. ముందస్తు చర్యలు లేకుండా నిర్మాణాలు కూల్చితే కోర్టులో ఇబ్బంది అవుతుందని అందువల్లే క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరో విమర్శ చేశారని రాజకీయ కక్ష ద్వారా హైడ్రా చర్య ఉండబోదని స్పష్టం చేశారు. ఫాతిమా కాలేజీ, >>2




గమనిక
ఆదివారం అనుబంధం బదులుగా నేటి సంచికతో **'వినాయక వ్రతకల్పం'** ఉచితంగా అందుకోండి
-సర్క్యులేషన్ మేనేజర్

## నేడు, రేపు ఢిల్లీలో స్పీకర్ల సదస్సు

### హాజరవుతున్న గడ్డం ప్రసాద్ కుమార్ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు23:** ఆది, సోమవారాల్లో ఢిల్లీ అసెంబ్లీ భవనంలో రెండు రోజుల పాటు ఆల్ ఇండియా స్పీకర్స్ సదస్సు జరుగనుంది. ఈ రెండు రోజుల సదస్సును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. సోమవారం ముగింపు కార్యక్రమానికి లోక్ >>2

# యూరియా కేక.. రాజకీయ కాక



యూరియా కేంద్రాల వద్ద రైతులు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ నేతలు

### ఎరువుల కోసం రోడ్డెక్కుతున్న రైతులు

### యూరియా సరఫరా కేంద్రాల వద్ద క్యూ కడుతున్న వైనం

### బిజెపి, బిఆర్ఎస్ నేతల ఆరోపణలతో ఇరుకున పడుతున్న కాంగ్రెస్ సర్కార్

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త.:** ప్రజా సమస్యలపై పోరాడి గద్దెనెక్కిన ప్రజా ప్రభుత్వంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతున్నారు.మెట్ట పంటలతో పాటు, వరి ఎక్కువగా పండే ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిత్యం యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతున్న సందర్భాలు కనబడుతున్నాయి.యూరియా సరఫరా కేంద్రాల వద్ద ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరి చెప్పులు ఉంచిన దృశ్యాలు, సహకార కేంద్రాల వద్ద తోపులాటలు, యూరియా అందలేదని రాస్తారోకోలు..ఇటు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అటు ఉమ్మడి ఆదిలాబాద్ సరిహద్దు వరకు చాలా జిల్లాలలో పరిపాటిగా మారాయి.యూరియా కొరత సమస్య రైతుల ఇబ్బందులకే పరిమితం కాలేదు. రాజకీయంగానూ తెలంగాణలో మూడు ప్రధాన పార్టీల మధ్య కాక రేపింది.ఈ పరిస్థితులతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ నేతల ఆరోపణలతో రాజకీయంగా తెలంగాణ వేడెక్కింది.ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతు రుణమాఫీ చేసి,సకాలంలో రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమచేసిన ఘనత కాంగ్రెస్ కి ఉన్న ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట మసక్కబారుతోందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చర్చ జరుగుతోంది.రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం..వ్యవసాయ శాఖ అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత వానాకాలం 1.32 కోట్ల ఎకరాల్లో సాగులో ఉన్న పత్తి, వరి పంటలకు యూరియా అవసరం ఉంది.ఈ వానాకాలం 2025 సీజన్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో అన్ని రకాల పంటలూ సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా.ఇందులో ఆహార ధాన్యాలు 76.14 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయని >>2




## ఎస్‌బిఐలో 'భారీ' టోపీ

### చెన్నూరు బ్రాంచిలో ఘటన

### రూ.12.60 కోట్ల బంగారం, రూ.1.10 కోట్ల నగదుతో మేనేజర్, క్యాషియర్ పరార్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బిఐ బ్యాంకులో భారీ గోల్‌మాల్ వెలుగు చూసింది. బ్యాంకు మేనేజర్, క్యాషియర్‌లు కలిసి ప్రజలు దాచిన 12.60 కోట్ల రూపాయల విలువచేసే బంగారు నగలు, కోటి పది లక్షల రూపాయల నగదుతో ఉడాయించారు. దీ నిపై బ్యాంకు ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. ఎస్‌బిఐలో క్యాషియర్‌గా పనిచేస్తున్న రవీం దర్ కొంతకాలంగా బెట్టింగ్‌లకు అలవాటు పడి స్థానికంగా అనేక మందికి బాకీ పడ్డాడు. ఈ క్రమంలో బ్యాంకులో ప్రజలు దాచిన బంగారు నగలను ఇదే ప్రాంతంలోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద తనఖా పెట్టి >>2



భారీవర్షాల అనంతరం ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లా థరాలి వద్ద శనివారం సహాయక చర్యల్లో పాల్గొన్న ఆర్మీ సిబ్బంది

## 'డబుల్ ఓట్లు' ఎక్కువే

>> సాంకేతిక కారణాలతో రామగుండంలో యూరియా ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయాలని కమిషన్ నివేదికపై ఏం చర్యలు తీసుకుంటారో చూస్తామన్నారు. మొయినాబాద్ ఫాం హౌస్ కేసుతో బిజెపికి సంబంధం లేదన్నారు. పార్టీలు మారడం సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. హైదరాబాద్ మెట్రో నష్టాల్లో నడుస్తోందని కొత్త లైన్ వేసేందుకు ఎల్‌అండ్‌టి సుముఖంగా లేదన్నారు. మెట్రో రెండోదశకు సహకరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటర్ లిస్ట్ సవరణ జరగాలన్నారు. సవరణ జరిగితే హైదరాబాద్‌లో 4 లక్షల ఓట్లు తొలగించాలన్నారు. హైదరాబాద్‌లో డబుల్ ఓట్లు ఎక్కువ ఉన్నాయన్నారు. మేం ఓట్ల చోరీ చేస్తే మా ఎంపి సీట్లు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు.

## క్రిమినల్ కేసులు!

>> కర్ణాటక సిఎం సిద్ధరామయ్యపై 13 కేసులె, ఝార్కండ్ సిఎం హేమంత్ సోరెన్‌పై ఐదు, మహారా ష్ట్ర సిఎం దేవేంద్ర పడ్నవిస్, హిమాచల్ ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్ సింగ్‌లపై నాలుగేసి కేసులున్నాయి. కేరళ సిఎం పినరాయి విజయన్‌పై రెండు, ప ంజాబ్ సిఎం భగవంత్ మాన్‌పై ఒక కేసు నమోదయ్యింది. కాగా కేసుల సంఖ్యతో పాటు కొన్నింటిలో వాటి తీవ్రత కూడా ఎక్కువగా వుందని ఏడి ఆర్ సంస్థ తెలిపింది. ఇందులో పది మంది సిఎంలపై హత్యాయత్నం, కిడ్నాపింగ్, అవినీతి ఆరోపణలు వున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. ప్రస్తు త పరిస్థితుల్లో ఈ నివేదికకు రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. ఐదేళ్ల కం టే ఎక్కువ శిక్ష పడే కేసుల్లో అరెస్టయి 30 రోజుల పాటు జైల్లో వుం టే ప్రధానితో పాటు ముఖ్యమంత్రులు, మంత్రులను పదవుల నుంచి తొలగించేలా కేంద్రం ఒక బిల్లును తీసుకువస్తున్న తరుణంలో ఈ వివరాలు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కాగా ఆయా ముఖ్యమంత్రులు తమ ఎన్నికల అఫిడవిట్లలో పొందుపరిచిన సమాచారం ఆధారంగానే తాము ఈ నివేదికను రూపొందించినట్లు ఏడిఆర్ వెల్లడించింది.

## 500 ఎకరాలను రక్షించాం

>> మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి కాలేజీల కంటే పేదలు ఉండే అంబేద్కర్ కాలనీ ముఖ్యమని..ముందు అలాంటివాటికి సరైన సౌకర్యాలు ఉండేలా, వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న చెరువుల్లో రాజకీయ నాయకుల ఫామ్ హౌస్ లు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయని.. చెరువుల ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఫామ్ హౌస్ లకు, అక్రమ కట్టడాలకు నోటీసులు ఇస్తాం అని తెలిపారు. హైడ్రాతో ఏం చేయాలో మొదట్లో తమకు కూడా పూర్తిగా క్లారిటీ లేదని.. ఇప్పుడిప్పుడే కొంత క్లారిటీ వస్తోందని తెలిపారు. హైడ్రాతో ఇప్పటి వరకు కబ్జాకు గురైన భూమిలో 500 ఎకరాలు ప్రభుత్వం వెనక్కి తీసుని వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను పరిరక్షి ంచామని తెలిపారు. అనేక కాలనీలలో ఆక్రమణలను తొలగించి రోడ్ల సమస్యలను పరిష్కరించామన్నారు. చెరువుల పునరుద్ధరణ పనులు పీపీటీ పద్ధతిలో చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని.. 130 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ అయ్యాయని..కానీ అధికారిక నోటిఫికేషన్ ఇవ్వలేదని తెలిపారు. మొదటి విడతగా చేపట్టిన ఆరు చెరువుల పునరుద్ధరణలో భాగంగా అంబర్పేటలోని బతుకమ్మ కుంట.. కూకట్ పల్లి నల్లచెరువు దాదాపు సిద్ధమవ్వగా.. మరి కొన్ని రోజుల్లోమిగతా 4 చెరువులు (బమృత్‌దౌలా చెరువు, ఉప్పల్ నల్లచెరు వు, తమ్మిడికుంట, సున్నంచెరువు) కూడా సిద్ధమవుతాయని.. తర్వాత మరో 13 చెరువుల అభివృద్ధిని చేపడతామని తెలిపారు. హుస్సేన్ సాగర్ ను శుద్ధి చేయాలంటే భారీ బడ్జెట్ కావాలని, ప్రస్తుతం హుస్సేన్ సాగర్ చుట్టూ కబ్జా అగిపోయిందన్నారు. జీహెచ్ఎంసీ 435 యాక్ట్ ప్రకారం అక్రమ నిర్మాణం అయితే నోటీసులు లేకున్నా కూల్చవచ్చు అని వెల్లడించారు. కొన్ని లీగల్ సమస్యల వల్ల హైడ్రా పోలీస్ స్టేషన్ వర్క్ కావడం లేదని వచ్చే నెల రోజుల్లో హైడ్రా పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు కాబోతోందని తెలిపారు.

## మంత్రుల సలహా కమిటీ

>> జడ్జిగా అస్సాం చీఫ్ జస్టిస్ గా, సుప్రీంకోర్టు జడ్జిగా ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని కాపాడేలా తీర్పులు వెలువరించారని గుర్తు చేశారు. దేశ ప్రజల హక్కులు కాపాడేందుకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి చారిత్రాత్మక తీర్పులు వెలువరించారని చెప్పారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా బీహార్లో దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా ఈనెల 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సహచరులు, పిసిసి అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేతలు బీహార్ కు వెళ్లాలని పీఏసీలో నిర్ణయం జరిగిందన్నారు. దేశంలో ఓటు చోరీకి గురవుతుంది తద్వారా బిజెపి లబ్ధి పొందుతుంది, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ వారికి సంబంధించిన వ్యక్తులు ఎన్నికల కమిషన్‌ను ప్రభావితం చేస్తున్నారు అని ఉదాహరణలతో కూడిన వీడియోను ఈ దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశ ప్రజలందరికీ వివరించారని పేర్కొన్నారు.

**సురవరం సుధాకర్‌రెడ్డికి కాంగ్రెస్ పిఏసీ నివాళి**

విద్యార్థి దశ నుంచి అంతిమ దశ వరకు వామపక్ష భావజాలంతో పనిచేసిన సురవరం సుధాకర్ రెడ్డి మన మధ్య లేకపోవడం పై పిఎసి దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. వారి ఆత్మకు శాంతి కలగాలని తీర్మానం చేసిందని చెప్పారు.. విద్యార్థి నాయకుని దశ నుంచి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన దేశానికి చేసిన సేవలను పిఎసి కొనియాడింది. ఆదివారం ఉదయం మగ్దూం భవన్‌లో సుధాకర్ రెడ్డి పార్థివ దేహానికి సీఎం రేవంత్ రెడ్డి తో పాటు క్యాబినెట్ సహచరులు నివాళులు అర్పించనున్నారని తెలిపారు.

## మాటిమాటికి ఓట్లేయాలంటే జనానికి విసుగు
### జమిలి ఎన్నికలే జవాబు: కేంద్ర మంత్రి పీయూష్

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** జమిలి ఎన్నికలపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజలు మాటిమాటికీ వచ్చే ఎన్నికలతో విసుగెత్తి పోయారని, అందుకే ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సరైన నిర్ణయమని గోయల్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో శనివారం నిర్వహించిన ఆంత్రప్రెన్యూర్స్ అండ్ ట్రేడర్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పలుమార్లు ఎన్నికలు జరగడం వల్ల గవర్నెన్స్‌తోపాటు పలు కార్యక్రమాలకు సమస్యలు తలెత్తుతాయని గోయల్ చెప్పారు. 'ప్రజలకు ఓటర్ ఫాటిగ్ (ఓటర్ల అలసట) వచ్చేస్తుంది. మాటిమాటికీ ఓట్లు వేయడానికి ప్రజలకు విసుగొస్తుంది' అని అన్నారు.

## ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి
# ప్రచారం షురూ
### రేపు, ఎల్లుండి పలు రాష్ట్రాల్లో పర్యటన

**హైదరాబాద్,ఆగస్టు 23,ప్రభాతవార్త:** ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ఆది,సోమవారాలలో, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం తన అభ్యర్థిత్వంకు మద్దతు తెలుపాలని ప్రచారంచేసుకోనున్నారు. ఆదివారం చెన్నై, సోమవారం లక్నో జస్టిస్ సుదర్శన్ రెడ్డి వెళ్ళుతారు.జస్టిస్ సుదర్శన్ రెడ్డి వెంట కాంగ్రెస్ ఎంపీలు డా. మల్లురవి, డా. సయ్యద్ నజీర్ హుస్సేన్ ఉంటారు. చెన్నై పర్యటనలో సీఎం ఎం.కె. స్టాలిన్ ఆధ్వర్యంలో డీఎంకే ఎంపీలతో సమావేశం అవుతారు. రానున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు కోరుతారు. లక్నో పర్యటనలో సమాజవాది పార్టీ ఎంపీలు, ఇతర ప్రతిపక్ష నేతలతో సమావేశం ఉంటుంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతు కోసం కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం మొదలు పెట్టింది.

## ఎస్‌బిఐలో 'భారీ' టోపీ

>> డబ్బులు తీసుకుని, వాటిని కూడా పందాలు కాసి నిండా మునిగాడు. ఇదే సమయంలో బ్యాంకులోని కోటి పది లక్షల రూపాయల నగదు కూడా ఇతను సొంత అవసరాలకు వాడుకున్నాడు. అయితే బ్యాంకులో రోజువారి తనిఖీలో ఈ విషయాలు బయటపడకుండా వుండేందుకు తనకు తెలిసిన ఖాతాదారుల నుంచి వడ్డీకి డబ్బులు, బంగారు నగలు తీసుకుని లాకర్లలో వుంచేవాడు. అయితే వారం రోజుల క్రితం రవీందర్ నాలుగు రోజుల సెలవుపై వెళ్లి తిరిగి రాలేదు. ఇదే సమయంలో ఉన్నతాధికారుల తనిఖీలో బ్యాంకులో జరిగిన గోల్‌మాల్ బట్టబయలయ్యింది. సరిగ్గా ఈ సమయంలోనే బ్యాంకు మేనేజర్ మనోహార్ రెడ్డి కూడా కనిపించకుండా పోవడంతో ఉన్నతాధికా రులు ఈ గోల్‌మాల్‌లో ఇద్దరి ప్రమేయం వుందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై చెన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచా రణ చేస్తున్నారు. ఈ బ్యాంకులో వెయ్యి మంది వరకు ఖాతాదారులుండగా 500 మందికి పైగా ఖాతాదారుల నగలు, నగదు మాయం అయినట్లు అనుమానిస్తున్నారు. పరారీలో వున్న మేనేజర్, క్యాషియర్ కోసం గాలిస్తున్నారు.

### వారం - వర్జ్యం

24-08-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
శు.పాడ్యమి ఉ.11.51
పూర్వఫల్గుణి రా.2.07
వర్జ్యం : ఉ.9.50-11.33
దు.సా.4.43-5.53
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం :** కొత్త పెట్టుబడులకు తగిన లాభం పొందుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**వృషభం:** వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

**మిథునం:** తనఖాలో ఉన్న వస్తువులను విడిపించుకుంటారు. ఇంటాబయటా ప్రోత్సాహం.

**కర్కాటకం :** శ్రమకు తగిన ప్రతిఫలాలు అందుకుంటారు. ఆర్థికంగా ఎటువంటి ఒడిదుడుకులు ఉండవు.

**సింహం:** కుటుంబ పురోభివృద్ధి బాగుంటుంది. విదేశీయాన వ్యవహారాలు సానుకూలమవుతాయి.

**కన్య :** సంఘంలో పేరుప్రఖ్యాతులు ఇనుమడిస్తాయి. ఆహారపు అలవాట్లలో కొద్దిపాటి మార్పుచేస్తాయి.

**తుల :** అహంభావ ధోరణి విడనాడడం వలన లాభపడతారు. కొనుగోలు వ్యవహారాలలో లాభపడతారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయంలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. వస్తు లాభం.

**ధనుస్సు:** బంధువు నుండి వస్తులాభం పొందుతారు. కోర్టు కేసుల నుండి బయటపడతారు.

**మకరం:** దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కుంభం:** భూముల విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. వాహనయోగం.

**మీనం :** కళారంగాలవారికి సన్మాన, సత్కారాలు పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# యూరియా కేక.. రాజకీయ కాక

>> తెలంగాణ వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా 62.47 లక్షల ఎకరాల్లో వరి, 48.93 లక్షల ఎకరాల్లో పత్తి, 6.69 లక్షల ఎకరాల్లో కంది, 5.21 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలున్నాయి. మిగిలిన విస్తీర్ణంలో ఇతర ఆహార, వాణిజ్య పంటలున్నాయి.యూరియా కొరతకు కారణమేంటి...? 2021లో రామగుండంలో ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభించారు.ఏటా 12 లక్షల టన్నుల యూరియా సామర్థంలో ప్లాంటును పునరుద్ధరించింది కేంద్ర ప్రభుత్వం.ఈ ఏడాది షట్ డౌన్ రోజులు ఎక్కువగా ఉండటంతో రాష్ట్రానికి రావాల్సి న వాటా నిలిచిపోయింది. ఈసారి ఎరువుల కొరత రావడానికి ప్రధాన కారణంగా రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ఎక్కువ రోజులు షట్ డౌన్‌కు గురికావడం కూడా కనిపిస్తోంది.ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 145 పని దినాలు (వర్కింగ్ డేస్) ఉంటే 78 రోజులు ఉత్పత్తి నిలిచిపోయిందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. రామగుండం ఎరువుల ఉత్పత్తి కర్మాగారంలో సాంకేతిక కారణాలు, అమ్మోనియం లీకేజీతో ఉత్పత్తి నిలిచిందని ఫ్యాక్టరీ యాజమాన్యం చెబుతున్న మాట.ఈ ప్రభావం తెలంగాణ రాష్ట్ర రైతాంగం పై పడుతోంది.రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తయ్యే యూరియాలో 11శాతం వాటా రాష్ట్రానికి ఉంటుంది.మూడు పార్టీల మాటల తూటాలు...కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతులు ఎరువుల కోసం సరఫరా కేంద్రాల ముందు బారులు తీరాల్సి వస్తుందని ముందే చెప్పామనే బీఆర్ఎస్ నేతల విమర్శలను కాంగ్రెస్ ప్రభుత్వం తిప్పికొట్టలేకపోతోంది.అయితే ఎరువుల కొరతకు కేంద్రం నుంచి తగినంత సరఫరా లేకపోవడమే కారణమని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుంటే... కేంద్రం నుంచి అవసరమైన సరఫరా జరుగుతోందని బీజేపీ అంటోంది.ఈ మూడు పార్టీల మాటల తూటాలతో రైతులకి కావాల్సినంత యూరియా సరఫరా దక్కుతుందేమో చూడాలి. యూరియా సరఫరా కేంద్రాల వద్ద క్యూ కడుతున్న రైతులు. యూరియా కోసం ఉదయాన్నే వెళ్తే ఒక్క బస్తా ఇచ్చి పంపించారని చెప్పారు. తమ గ్రామానికి 400 బస్తాల యూరియా వస్తే,కేవలం గంటలోనే పంపిణీ పూర్తైందని తోలం సమ్మయ్య చెబుతున్నారు.భద్రాద్రికొత్తగూడెం జిల్లా మొదలుకొని ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలలో ఇదే పరిస్థితి అని రైతులు అంటున్నారు.అక్కడ యూరియా సరఫరా అయిన గంటన్నరలోనే అయిపోయిందని రైతులు చెబుతున్నారు.తెలంగాణకు రావాల్సి న యూరియా ఎంత...?వచ్చిన యూరియా ఎంత...?తెలంగాణకు ఈ వానాకాలం సీజన్లో సుమారు 9.80 లక్షల టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసినట్టు సమాచారం.ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి యూరియా అవసరం మొదలవుతుంది. మరుసటి వ్యవసాయ సీజన్‌కు తగ్గట్టుగా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచుకోవాల్సి న బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుంది.అయితే, 2022 నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ వార్షిక ప్రణాళిక విడుదల చేయడంలేదని రైతు సంఘం నాయకులు అంటున్నారు. పంటల వారీగా వ్యవసాయ ప్రణాళిక వేయాలని, దాన్నిబట్టి ఎరువులను డిమాండుకు తగ్గట్టుగా ఏర్పాటు చేసుకునే వీలుంటుంది. కానీ అది జరగడం లేదు.

**కేంద్రం నుంచి కేటాయింపుల్లో కోత: మంత్రి తుమ్మల**

నెలవారీ కేటాయింపుల్లో కోత అంటున్న ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం, తెలంగాణలో ఏప్రిల్ నాటికి 1.92 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఇది కాకుండా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం కేంద్రం నుంచి వచ్చే నెలవారీ యూరియా కోటాలోనూ కోత పడిందని చెబుతోంది.ఏప్రిల్ నుంచి ఆగస్టు నాటికి కేంద్రం నుంచి 8.30 లక్షల టన్నులకుగాను 5.12 లక్షల టన్నుల యూరియానే వచ్చినట్లుగా తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఇది కాకుండా ఏప్రిల్ నాటికి ఉన్న నిల్వలు కలుపుకొంటే 7.04 లక్షల టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కేంద్రం నుంచి రావాల్సి న కేటాయింపుల్లో కోత కారణంగా మొత్తంగా 2.76 లక్షల టన్నుల కొరత ఏర్పడిందని మంత్రి వివరించారు. రామగుండం యూరియా ఫ్యాక్టరీతోనూ నిరంతర సంప్రదింపులు జరుపుతున్నారు. సాంకేతిక సమస్య కారణంగా రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఉత్పత్తి ప్రారంభం అయితే యూరియా సమస్య కొంతైనా తీరే అవకాశం ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.




శనివారం గాంధీభవన్‌లో 'ఓటు చోరీ' ప్రచార లోగోను ఆవిష్కరించిన సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ తదితరులు

## ప్రజాచైతన్యంతో బిజెపి ఓటుచోరీ కట్టడి
### గత లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై ప్రజా ఉద్యమం
### పిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్
### ఓటుచోరీ ప్రచార లోగో ఆవిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 23,ప్రభాతవార్త:** ప్రజా చైతన్యంతో బిజెపి ఓటు చోరి దందాను కట్టడి చేయడానికి సాధ్యమౌతుందని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం పిఎసి సమావేశం ప్రారంభంలోనే ఓట్ చోరీ కి సంబంధించిన ప్రచార లోగో ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొమటిరెడ్డి వెంకటరెడ్డి పిఎసి సభ్యులు పాల్గొన్నారు.ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తెలంగాణ కు చెందిన ప్రజాస్వామ్య వాదీ, రాజ్యాంగ నిపుణులు జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇండియా కూటమి తరపున అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల పిఎసి సమావేశం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో ఓట్ చోరీ పెద్దఎత్తున జరిగిందని ఆరోపించారు బిజెపి ఓట్ చోరీ తోనే మూడో సారి గెలిచింది అని అన్నారు.. రాహుల్ గాంధీ ఈ విషయంలో సమగ్రమైన సమాచారాన్ని ఇచ్చి ప్రజల్లో ఉద్యమాన్ని చేపట్టారు..దీనిపై రాష్ట్రంలో విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు ప్రజల్లో ఓట్ చోరిపై చర్చ జరుగాలని కోరారు..రాష్ట్రంలో ప్రజా పాలన అద్భుతమైన ఫలితాలు ఇస్తుంది.రైతు భరోసా, రుణమాఫీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం లాంటి కార్యక్రమాలు మంచి స్పందన వస్తున్నాయని అన్నారు. టిపిసిసి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర కు ప్రజల్లో మంచి స్పందన వస్తుందని తెలిపారు. ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో మనం ఘన విజయం సాధించేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు.జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల ను కూడా మనం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారురాష్ట్రంలో యూరియా కొరత ఉందని ఒక దుష్ప్రచారం చేస్తూ బిఆర్ ఎస్ రైతుల్లో ఒక భయాందోళనలు సృష్టిస్తూ రాజకీయాలు చేస్తుందని దుయ్యబట్టారు.వీటన్నింటినీ చర్చించి మనం ఒక ప్రణాళికతో ముందుకుపోదామని చెప్పారు.

## నేడు, రేపు ఢిల్లీలో స్పీకర్ల సదస్సు

>> సభ స్పీకర్ ఓం బిర్లా హాజరు కానున్నారు. ఈ కాన్ఫరెన్స్ కు 32 మంది స్పీకర్లు, పలువురు డిప్యూటీ స్పీకర్లు, కౌన్సిల్ చైర్మన్ లు డిప్యూటీ చైర్మన్ లు హాజరుకానున్నారు. ఈ మేరకు శనివారం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ఆధ్వర్యంలోని తెలంగాణ శాసనమండలి బృందం ఢిల్లీకి చేరుకుంది. బృందంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ అదనపు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, మండలి చైర్మన్ ఓఎస్‌డి గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. 1925లో భారతదేశ సెంట్రల్ లేజిస్లేటివ్ అసెంబ్లీకి స్పీకర్‌గా ఎన్నికైన మొదటి భారతీయుడు కీ.శే విఠల్ బాయి పటేల్ బాధ్యతలు స్వీకరించిన వందేళ్ల సందర్భాన్ని పురస్కరించుకుని ఆది,సోమవారాల్లో (24,25 తేదిలలో) జరుగుతున్న ఈ ప్రత్యేక సమావేశంలో పాల్గొనడానికి తెలంగాణ శాసనసభ, శాసనపరిషత్ బృందం ఢిల్లీ వెళ్ళింది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు కంటి శస్త్రచికిత్స జరిగినందువల్ల ఈ సమావేశాలకు హాజరు కావడం లేదు.

## ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు... స్పీకర్ నోటీసులు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ చర్యలు తీసుకునేందుకు రంగంలోకి దిగారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరారంటూ స్పీకర్ తాజాగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదులపై వెంటనే వివరణ ఇవ్వాలని ఆ నోటీసులలో పేర్కొన్నారు. అదేవిధంగా తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు అందినట్లుగా సమాచారం. అయితే, స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు అందుకున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు వచ్చిన నోటీసులకు త్వరలోనే సమాధానమిస్తానని అన్నారు. తాను అసలు పార్టీ మారలేదని.. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లలేదని స్పష్టం చేశారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశానని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.




మమత ప్రభుత్వ విద్యా విధానానికి వ్యతిరేకంగా కోల్‌కతాలో శనివారం నిరసన ప్రదర్శన జరిపిన ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌సేవాదళ్ కార్యకర్తలు

## మేలు జరగాల్సిందే

>> వర్గంలో ఆమోదించి అసెంబ్లీలో బిల్ పాస్ చేసుకున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు విడిగా మరో బిల్ తీసుకొచ్చామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50శాతం మించకుండా కేసీఆర్ చట్టం తెచ్చారు,ఈ అడ్డంకిని తొలగించడానికి ఆర్డినెన్స్ తెచ్చాం, కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించడానికి ఆర్డినెన్సు తెచ్చాం, దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారని పేర్కొన్నారు. బీసీ లకు మేలు జరగాల్సి ందే, రాహుల్ గాంధీ మాట నిలబడాలి అని చెప్పారు.కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం బీసీ లకు ఒక్క శాతం రిజర్వేషన్ కూడా రాదన్నారు. ఎట్టిపరిస్థితుల్లో బీసీలకు మేలు జరగాల్సి ందేనని సీఎం అన్నారు. కాగా, 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశంపైన సుప్రీం కోర్టులో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించామని సీఎం చెప్పారు.అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న మన బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుందని చెప్పారు.విడిగా సుప్రీం కోర్టుకు వెళ్తే కేసు లిస్ట్ కావడానికి చాల సమయం పడుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి యూరియా కొరత పైన డ్రామాలు ఆడుతున్నాయని సీఎం విమర్శించారు. యూరియా ఇచ్చే పార్టీకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తానని కేటిఆర్ అనడంలోనే వాళ్ల తీరు అర్థం అవుతుందని సీఎం ఎద్దేవా చేశారు. యూరియా కోసం నాలుగు సార్లు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అనుప్రియా పటేల్‌ను కలిశానని, యూరియా పంపిణీ పైన క్షేత్రస్థాయిలో మానిటరింగ్‌ను పెంచాలని సీఎం అన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి అభ్యర్థిగా ప్రకటించి నందుకు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ,రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ పరిరక్షణ కోసం,పౌర హక్కులను కాపాడటం కోసం పని చేశారని పేర్కొన్నారు. బీహార్‌లో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ఓట్ చోరీ పాదయాత్రకు ఈ నెల 26 న హాజరవుతున్నట్లు తెలిపారు.

## మూసీ ప్రక్షాళనే ప్రభుత్వ లక్ష్యం

>> చేయవచ్చునని అన్నారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిపిఐ ప్రెసిడెంట్ ఎన్ కె పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కో ఆర్డినేటర్(టెక్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటిపిఐ - తెలంగాణ రీజినల్ ఛాప్టర్ ఛైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మూసీ ప్రక్షాళనకు రూ.375 కోట్లువిడుదల చేసిన ప్రభుత్వం**

మూసీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం తొలి అడుగు పడింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్లో కేటాయించిన రూ.375 కోట్ల నిధులను మంజూరు చేస్తూ శనివారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ నది ప్రక్షాళనను రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలను కొంతమేర తొలగించారు. ప్రస్తుతం మూసీలో పేరుకు పోయిన చెత్తను తొలగించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. తాజాగా నిధుల విడుదలతో ప్రక్షాళన మరింత వేగంగాసాగే అవకాశం కనిపిస్తుంది. మూసీ సుందరీకరణకు రూ.4,100 కోట్ల రుణం ఇచ్చేందుకు ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆమోదం తెలిపింది. మూసీ సుందరీకరణ, ప్రక్షాళన కోసం నియమించిన మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు రాష్ట్రానికి వచ్చిన ఏడిబి టీమ్‌కు మూసీ ప్రక్షాళనతో పాటు చేపట్టబోయే పర్యావరణహిత కార్యక్రమాల గురించి వివరించారు. దీంతో నిధులు విడుదలకు లైన క్లియరైంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నదికి ఇరువైపులా రోడ్లు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. నదిలో వరద నీటితో డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు చేపట్టనున్నారు.

## భూపేశ్ బఘేల్ కుమారుడికి 14 రోజుల రిమాండ్
### లిక్కర్ కుంభకోణం కేసు

**రాయ్‌పూర్, ఆగస్టు 23:** లిక్కర్ కుంభకోణం కేసులో అరెస్టయిన చైతన్య బఘేల్‌కు రాయ్‌పూర్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఐదు రోజుల ఇడి కస్టడీ శనివారంతో ముగియడంతో అతడిని కోర్టులో హాజరుపర్చారు. మరో 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఇవ్వాలని ఇడి తరఫు న్యాయవాది కోర్టును కోరారు. దాంతో కోర్టు అందుకు అనుమతించింది.

వచ్చే నెల 6వ తేదీ వరకు చైతన్య బఘేల్‌కు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కేసు తదుపరి విచారణ వచ్చే నెల 6న జరగనుంది. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కుమారుడైన చైతన్య బఘేల్‌కు లిక్కర్ కుంభకోణంలో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దాంతో ఇడి అతడిని అరెస్టు చేసింది. శనివారంతో అతడి ఐదురోజుల ఇడి కస్టడీ ముగియడంతో అధికారులు రాయ్‌పూర్ కోర్టులో హాజరుపర్చారు. నిందితుడిని రెండు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని కోరారు. దాంతో కోర్టు అందుకు అనుమతి ఇచ్చింది.

## జీవనోపాధి బలోపేతంలో పశు, మత్స్య, పౌల్ట్రీదే కీలక పాత్ర

### కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి బఘేల్

**హైదరాబాద్,ఆగస్టు 23, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధికి సంబంధించి బలోపేతం కావడంలో పశు, మత్స్య, పౌల్ట్రీ పరిశ్రమలు కీలకపాత్ర పోషిస్తున్నాయని కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమలశాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్ వెల్లడించారు. హైదరాబాద్‌లో కాంపౌండ్ లైవ్‌స్టాక్ ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎల్ఎఫ్ఎంఏఐ) వార్షిక సమావేశం, అలాగే 66వ జాతీయ సింపోజియం జరిగింది. ఇందులో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి బఘేల్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ముఖ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆహారభద్రత కల్పించేందుకు ఆయా రంగాలు ఎంతగానో దోహదం చేస్తున్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న వ్యవసాయంలో పాడి పశువులు భవిష్యత్ మార్గంపై దృష్టిసారించాలన్నారు. అనంతరం పౌష్టికాహారం, ఆహారభద్రత అనే అంశంపై నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరై చర్చించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) జాయింట్ సెక్రటరీ ముత్తుకుమారస్వామి, క్లఫ్మా ఆఫ్ ఇండియా చైర్మన్ దివ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రావాల్సిన 62,473 టన్నుల యూరియా సరఫరా చేయండి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్రానికి రామగుండం ఎరువుల కర్మాగారం నుండి రావలసిన యూరియా కోటాలో ఇంకా 62,473 టన్నులు అందలేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి సరఫరా ఆలస్యమవ్వడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రైతుల పంటలపై ప్రతికూల ప్రభావం పడకముందే, రాష్ట్రంలో ప్రస్తుతం 42 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఈ రోజు మరో 6,543 టన్నులు రానున్నదని వెల్లడించారు. అలాగే ఈ నెల చివరి వరకు వివిధ తేదీలలో మరో 37,877 టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. యూరియా సరఫరా కోసం ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కాగా దీనిపై స్పందించిన రామగుండం ఎరువుల కర్మాగారం ఎండి అలోక్ సింఘాల్ తెలంగాణకు కావాల్సిన యూరియాను త్వరలోనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

## సిబిఐ అధికారులమంటూ ఢిల్లీ వ్యాపారి నుంచి రూ.2.3 కోట్లు దోపిడీ

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో సిబిఐ అధికారులమని బెదిరించి ఓ వ్యాపారి కార్యాలయం నుంచి గుర్తు తెలియని దు ండగులు రెండు కోట్ల 30 లక్షల రూపాయలను దోచుకున్న వైనం శనివారం సంచలనం రేపింది. యుపిలోని ఘజియాబాద్‌కు చెందిన వ్యాపారి మన్‌ప్రీత్ సింగ్ ఢిల్లీలోని వివేక్ విహార్‌లో ఒక కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ కార్యాలయంలో ఇతను తన వ్యాపార అవసరాల కోసం రెండు కోట్ల 30 లక్షల రూపాయలను దాచి వుంచాడు. ఇందులో నుంచి కోటి పది లక్షల రూపాయలను తీసుకు రావాలని తన మిత్రుడు రవిశంక ర్‌ను మూడు రోజుల క్రితం కోరాడు. రవిశంకర్ కార్యాలయానికి వెళ్లి అక్కడి సిబ్బందితో మాట్లాడి కోటి పది లక్షల రూపాయలను తీసుకుని సూట్ కేసుతో బయటకు రాగానే ఓ మహిళతో సహా నలుగురు వ్యక్తులు కారులో వచ్చి రెప్పపాటులో రవిశంకర్‌పై దాడిచేసి అతని వద్ద వున్న నగదును దోచుకున్నారు. అనంతరం దుండగులు నేరుగా కార్యాలయంలోకి వెళ్లి అక్కడి సిబ్బందిని కూడా సిబిఐ అధికారుల పేరిట బెదిరించి మిగతా నగదును దోచుకున్నారు. కాగా దీనిపై వ్యాపారి మన్‌ప్రీత్ సింగ్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై వెంటనే రంగంలో దిగిన పోలీసులు ప్ర త్యేక బృందాలను రంగంలో దింపి ఇద్దరు నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరిని అస్సాంకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి పపోరి బరుహా, యు పికి చెందిన దీపక్‌గా గుర్తించారు. వీరి వద్ద నుంచి కోటి ఎనిమిది లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో వున్న మిగతా ముగ్గురి వద్ద మిగతా సొమ్ము వుందని పోలీసులు చెబుతున్నారు. వీరి కోసం గాలిస్తున్నారు.

## హైదరాబాద్‌కు రండి.. ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్‌ని ఆహ్వానించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** చాట్‌జీపీటీ సృష్టికర్త, ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఈ ఏడాది చివర్లో ఇండియాలో తమ మొదటి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వచ్చే నెలలో భారత్‌కి రాబోతున్నట్లు ప్రకటించాడు. ఈ సందర్భంగా శామ్ ఆల్ట్‌మన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెడుతూ ఇండియాలో కృత్రిమ మేధస్సు (ఎఐ) వాడకం అద్భుతంగా ఉందని ప్రశంసించారు. గత సంవత్సరం నుంచి చాట్‌జీపీటీ వినియోగదారుల సంఖ్య ఏకంగా నాలుగు రెట్లు పెరిగిందని తెలిపారు. ఇందులో భాగంగానే ఇండియాలో మరింత పెట్టుబడి పెట్టడానికి మేము మరింత ఉత్సాహంగా ఉన్నట్లు శామ్ రాసుకొచ్చాడు. కాగా, శామ్ పోస్ట్‌పై శనివారం మాజీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికంగా స్పందించాడు. ఇండియాలో తమ మొదటి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్‌కి హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజాపోరాటాలకే సురవరం జీవితం అంకితం

### ఘనంగా నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

### ప్రజల సందర్శనార్థం నేడు మఖ్దూంభవన్‌కు భౌతిక కాయం

### సాయంత్రం గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగింత

### అధికారలాంఛనాలతో అంతిమ యాత్ర



సుధాకర్‌రెడ్డి భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ అగ్రనాయకులు, ప్రముఖులు

**గచ్చిబౌలి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** సిపిఐ అగ్రనేత, మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి పార్థీవదేహానికి సిపిఐ ఆగ్రనేతలు, ప్రముఖులు నివాళులర్పించారు. సురవరం సుధాకర్‌రెడ్డి(83) గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. శేరిలింగంపల్లి పరిధిలోని ఖాజాగూడలో నివాసం ఉంటున్న సుధాకర్‌రెడ్డికి భార్య బివి.విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు నిఖిల్, కపిల్‌లు ఉన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామానికి చెందిన సురవరం సుధాకర్‌రెడ్డి విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులయ్యారు. సుధాకర్‌రెడ్డి స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం నుంచి వచ్చారు. సుధాకర్‌రెడ్డి పెదనాన్న సురవరం ప్రతాపరెడ్డి, తండ్రి వెంకట్రామిరెడ్డిలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, రెండుసార్లు ఎంపిగా ఎన్నికయ్యారు. వ ృద్ధాప్యంతో కొన్నిరోజులుగా రాజకీయాలకు దూరంగా ఉన్న సుధాకర్‌రెడ్డి కుటుంబంతో నగరంలో నివాసం ఉంటున్నారు. కాగా గతకొన్ని రోజుల క్రితం సుధాకర్‌రెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 10.20 గంటలకు సురవరం సుధాకర్‌రెడ్డి తుదిశ్వాస విడిచారు. కాగా సుధాకర్‌రెడ్డి కుమారుడు విదేశాల్లో ఉండడడంతో ఆయన రాకకోసం పార్థీవదేహాన్ని శనివారం ఆసుపత్రిలోనే ఉంచారు. దీంతో శనివారం పలువురు సిపిఐ అగ్రనేతలు, ప్రముఖులు ఆసుపత్రికి చేరుకొని సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, అగ్ర నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్‌తో పాటు తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆసుపత్రికి చేరుకొని సుధాకర్‌రెడ్డి భౌతికఖాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి మ ృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌లు సంతాపం వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన గొప్ప నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సురవరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలిపారు. వీరితో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు సంతాపం తెలిపారు. సురవరంతో తమకు ఉన్న అనుబంధాని ్ని, ఆయన చేసిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు.

**నేడు ముఖ్దూం భవన్‌కు సుధాకర్‌రెడ్డి పార్థీవదేహం:** సురవరం సుధాకర్‌రెడ్డి పార్థీవదేహాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలి కేర్ ఆసుపత్రి నుంచి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ముఖ్దూం భవన్‌కు తరలించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వివిధ పార్టీల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజల సందర్శనార్థం సుధాకర్‌రెడ్డి పార్థీవదేహాన్ని ముఖ్దూం భవన్‌లో ఉంచనున్నట్లు ప్రకటించారు. మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్దూం భవన్ నుంచి సుధాకర్‌రెడ్డి అంతిమయాత్ర ప్రారంభం అవుతుందని, సాయంత్రం 5 గంటలకు సుధాకర్‌రెడ్డి పార్థీవదేహాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు అందజేయనున్నట్లు తెలిపారు. కాగా సురవరం సుధాకర్‌రెడ్డి అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**ప్రభుత్వ లాంఛనాలతో సురవరం అంతిమయాత్ర: కూనంనేని సాంబశివరావు:** సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి శుక్రవారం తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో ప్రభుత్వ లాంఛనాల ప్రకారం అంతిమ యాత్ర నిర్వహించాలని ముఖ్యమంత్రిని కోరిన వెంటనే, స్పందించిన సీఎం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు.

**సురవరం మరణం ప్రజాస్వామ్య హక్కులకు తీరని లోటు: జాన్ వెస్లీ:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యులుగా పనిచేసిన కమ్యూనిస్టు అగ్రనేత సురవరం సుధాకరరెడ్డి మరణం పట్ల సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తుందని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటనలో తెలిపారు. సుధాకరరెడ్డి వామపక్షాల ఐక్యత కోసం కృషి చేసిన నాయకుడని.. రెండుసార్లు పార్లమెంట్ సభ్యులుగా శ్రామికవర్గాల పక్షాన పోరాటం చేశారని గుర్తు చేశారు. విద్యార్థిదశ నుంచే ప్రజల తరపున, ప్రజాస్వామ్య హక్కుల కోసం, వర్గ పోరాటాలను ముందుకు నడిపేందుకు తీవ్రమైన కృషి చేశారన్నారు.

## బ్యాట్ కోసమే బాలికను హత్య చేశాడా?

### టెన్త్‌క్లాస్ హంతకుని కేసులో పలు అనుమానాలు

### సహస్ర తల్లిదండ్రుల రాస్తారోకో, అదుపులోకి తీసుకొన్న పోలీసులు



సహస్ర తల్లిదండ్రులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ఆగస్టు23, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలన రేపిన 10 ఏళ్ల సహస్ర హత్య కేసులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ హత్య కేసులో పదో తరగతి చదువుతున్న విద్యార్థి హంతకుడిగా తేల్చిన పోలీసులు. బ్యాట్ కోసం వెళ్లి ఈ ఘటనకు పాల్పడినట్లు విచారణలో తేల్చారు. అయితే..ఇప్పటికే బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు రేణుక, కృష్ణలు తమకు న్యాయం కావాలంటూ రోడ్డెక్కారు. శనివారం బంధువులు, స్థానికులతో కలిసి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ముందు నిరసనకు దిగారు. సహస్ర ఫొటోతో ఉన్న ఫ్లెక్సీతో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. నా బిడ్డను చంపిన హంతకున్ని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. క్రికెట్ బ్యాట్ కోసమే హత్య జరిగిందంటూ పోలీసులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.తన బిడ్డను దారుణంగా హత్య చేసిన నిందితుడ్ని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. తమకి న్యాయం జరిగేంత వరకు రోడ్డుపైనే ఆందోళన చేస్తామని సహస్ర తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కూకట్‌పల్లి రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు వారిని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు పోలీసులు. ఈ నేపథ్యంలో సహస్ర తల్లిదండ్రులతో పాటు బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**వాడు బ్రతకడానికి వీల్లేదు: సహస్ర తండ్రి**

నా కూతుర్ని పొట్టన పెట్టుకున్న వాడికి తప్పకుండా శిక్ష పడాలని డిమాండ్ చేశారు. మా బాబుతో కలిసి క్రికెట్ ఆడటానికి వచ్చేవాడు..ఇంత క్రిమినల్ మైండ్ ఉందని అస్సలు ఊహించలేదన్నారు.

**నా బిడ్డకు న్యాయం జరగాలి: సహస్ర తల్లి**

తన కూతురికి జరిగినట్టుగా ఆ అబ్బాయికి జరగాలి అని సహస్ర తల్లి డిమాండ్ చేసింది. "కూతురుని కోల్పోయిన మా బాధ ఆఅబ్బాయి తల్లిదండ్రులకు తెలియాలి. మొబైల్ దొంగతనం చేసుకుని వచ్చినప్పుడే మందలించి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చిఉండేది కాదు.. వీడు కేవలం పాప బర్త్‌డేకి మాత్రమే ఇంటికి వచ్చాడు. ఈ బాబు చేసిన కిరాతకాన్ని చూసిన తర్వాత మాబాబు వాణ్ణి చంపేద్దామని అంటు న్నాడు. వాడికి మేము ఏమని సమాధానం చెప్పాలి. నా బిడ్డకు న్యాయం జరగాలి.

**సహస్ర కేసులో ఓ చట్టాన్ని తీసుకురావాలి: కేఏ పాల్**

హత్యకు గురైన సహస్ర కుటుంబాన్ని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ పరామర్శించారు. కూకట్‌పల్లి పోలీసులు వేగం గా విచారణ జరిపి నిందితుడిని పట్టుకోవడం ప్రశంసనీయ విషయం. కానీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా 'సహస్ర చట్టం' రూపంలో కఠినమైన చట్టాన్ని తీసుకురావాలన్నారు.

**జువైనల్ హోమ్‌కు నిందితుడు తరలింపు**

సహస్రను చంపిన నిందితున్ని పోలీసులు శనివారం జడ్జీ ముందు హాజరుపర్చగా జువైనల్ హోమ్‌కు తరలించాల్సిందిగా ఆదేశించారు. దీంతో పోలీసులు నిందితున్ని సత్ప్రవర్తన కోసం జువైనల్ హోమ్‌కు తరలించారు.

## టిజిసిఎస్‌బికి చిక్కిన బడా సైబర్ నేరగాడు

### ఆరు మ్యూల్ ఖాతాలు తెరిచి రూ.255 కోట్ల సైబర్ నేరాల లావాదేవీలు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఏడాదిన్నరకు పైగా పరారీలో వున్న బడా సైబర్ నేరగాడు వడ్డేపల్లి లలిత శరణ్ కుమార్ (30)ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు అరెస్టు చేశారు. 2024మార్చిలో పాతబస్తీలోని షంషీర్‌గంజ్ ఎస్‌బిఐలో వెలుగు చూపిన సైబ ర్ నేరాల కేసుకు అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ బ్యాంకు నుంచి సైబర్ నేరగాళ్లు కోట్లాది రూపాయల సైబర్ నేరాల లావాదేవీలు జరిపినట్లు తేలింది. దీనికి సంబంధించి వాంటెడ్ నేరగాడుగా వున్న శరణ్ కుమార్‌ను భారత్..నేపాల్ సరిహద్దుల్లో పట్టుకున్నారు. ఈ నేరగాడు ఇదే బ్యాంకులో ఆరు మ్యూల్ ఖాతాల ద్వారా 255.22 కోట్ల రూపాయల సైబర్ నేరాల లావాదేవీలు నిర్వహించినట్లు తేలింది. దీనికి సంబంధించిన వి వరాలను టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ శనివారం మీడియాకు వెల్లడించారు. విజయవాడకు చెందిన శరణ్ కుమార్ ఓ బడా సైబర్ నేరగాడు. త రచూ దుబాయ్ వెళుతూ అక్కడే కొంతకాలం వుంటూ భారత్‌లో సైబర్ నేరాలు చేయడం ఇతని ప్రత్యేకత. దినసరి కూలీలతో పాటు గ్రామీణ ప్రాం తాలలో కమీషన్ కోసం బ్యాంకు ఖాతాలు ఇచ్చే వారిని తనకు అనుకూలంగా మలచుకుని వారి చేత కరెంటు ఖాతాలు తెరిపిస్తాడు. ఇదే సమయం లో తన పేరిట పలు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి వాటిని సైబర్ నేరాలా లావాదేవీలకు వాడుతుంటాడు. 2024 మార్చి ఏప్రిల్ నెలల మధ్య షంషీర్‌గంజ్‌లో గల ఎస్‌బిఐ శాఖలో ఇతను ఆటో డ్రైవర్లతో తెరిపించిన ఆరు మ్యూల్ ఖాతాల ద్వారా 255.22 కోట్ల సైబర్ నేరాలకు సంబంధించిన లా వాదేవీలు జరిగాయి. జాతీయ సైబర్ నేరాల పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) ఈ విషయాన్ని మొదట గుర్తించింది. ఒక సాధారణ వ్యాపారిగా చెప్పుకున్న శరణ్ కుమార్ రెండు నెలల కాలంలో తనకు పరిచయం వున్న వారుగా చెప్పుకున్న వారి ఖాతాల ద్వారా ఇంత భారీ మొత్తంలో లావాదేవీలు జరపడంతో ఈ విషయాన్ని ఎన్‌సిఆర్‌పి తీవ్రంగా పరిగణించి శరణ్ కుమార్ కోసం గాలించగా అతను పరారయ్యాడు. కాగా షంషీర్‌గంజ్ ఎస్‌బిఐలో జరిగిన సై బర్ నేరాల లావాదేవీలకు సంబంధించి ఇద్దరు బ్యాంకు ఉద్యోగులతో పాటు ఆరుగురు అప్పట్లో అరెస్టవగా శరణ్ కుమార్ పారిపోయాడు. ఇతని కో సం లుకవుట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా అన్ని విమానాశ్రయాలలో అప్రమత్తం చేశారు. అయితే ఇతను ఈ నెల 22వ తేదీ న నేపాల్ నుంచి భారత్‌కు రోడ్డు మార్గంలో వస్తుండగా గోరక్‌పుర్ణ్ చెక్‌పోస్టు వద్ద సరిహద్దు భద్రతా విభాగం పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని వెంటనే టిజిసిఎస్‌బి పోలీసులకు అప్పగించగా వారు అతన్ని శనివారం హైదరాబాద్‌కు తరలించిరిమాండుకు పంపారు. నిందితుడి వద్ద సైబర్ నేరాలకు వాడిన రెండు సెల్‌ఫోన్లుస్వాధీనం చేసుకున్నారు. ఈ తరహా నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖాగోయల్ తెలిపారు.

# డిక్లరేషన్ ఇస్తేనే స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు!

### ఈ యేడాది నుంచి అమలు

### జిల్లాలతోపాటు మండలస్థాయిలోనూ ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 23:** తెలంగాణ రాష్ట్రంలో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుకి దరఖాస్తు చేసుకున్న వారు గతంలో తనకి అవార్డు రాలేదని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా డిక్లరేషన్ ఇచ్చిన వారిని మాత్రమే స్టేట్ బెస్ట్ టీచర్‌గా ఎంపిక చేయనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్య శాఖ తయారు చేస్తున్నట్టు తెలిసింది. ఒక్కరికే రెండు సార్లు బెస్ట్ టీచర్ అవార్డు ఇవ్వొద్దనే ఉద్దేశంతోనే ముందుగానే డిక్లరేషన్‌ను కోరుతున్నట్టు పాఠశాల విద్య శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు కోసం ఉపాధ్యాయుల నుంచి మండలస్థాయిలోని పాఠశాలల నుంచి మండల విద్యాధికారి(ఎంఈవో) దరఖాస్తులను స్వీకరిస్తారు. మండలస్థాయిలోని ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను రాష్ట్రస్థాయి అవార్డు కోసం రూపొందించిన ప్రొఫార్మా ప్రకారం భర్తీ చేసినట్టయితేనే వాటిని జిల్లా విద్యాశాఖాధికారి(డిఈవో)కి పంపిస్తారు. తమకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన డిఈవోలు వాటిల్లో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుకి అర్హత ఉన్నవాటిని గుర్తించి వాటిని పాఠశాల విద్య శాఖకి పంపిస్తారు. అలా రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో బెస్ట్ స్టేట్ టీచర్ అవార్డుకి అర్హులైన వారిని బెస్ట్ టీచర్ అవార్డుల ఎంపిక కమిటీ నిర్ణయిస్తుంది. అయితే స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డును ఒక్కరికి ఒక్కసారి మాత్రమే ఇవ్వాలని భావిస్తున్న పాఠశాల విద్య శాఖ అధికారులు.. ఇకపై స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు కోసం వచ్చిన దరఖాస్తుల్లో గతంలో తనకి బెస్ట్ టీచర్ అవార్డు రాలేదని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అలా డిక్లరేషన్ ఇచ్చిన వారికి మాత్రమే ఈ ఏడాది నుంచి స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుకి ఎంపిక చేయనున్నారు.

**మండలస్థాయిలోనూ ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.** సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఈఏడాది నుంచి జిల్లా, మండల స్థాయిల్లోనూ ఘనంగా నిర్వహించాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించింది. ఈఏడాది రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహించే రవీంద్రభారతిలో కాకుండా మాదాపూర్‌లోని శిల్పాకళా వేదికలో ఘనంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అలాగే జిల్లా స్థాయిలోనూ.. మండల స్థాయిలో కూడా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో నిర్వహించడానికి రూ. 15000 మం డలస్థాయిలో నిర్వహణకి రూ.5000నిధులను కేటాయించనున్నట్టు తెలుస్తోంది.

## రాజ్యాంగంపై గౌరవం ఉంటే సుదర్శన్ రెడ్డికే ఓటు వేయాలి

### చంద్రబాబు. నితీష్ ఆలోచించుకోవాలి:ఎంపీ మల్లు రవి

**హైదరాబాద్,ఆగస్టు 23,ప్రభాతవార్త:** రాజ్యాంగంపై గౌరవం ఉంటే ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికే ఓటు వేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి పిలుపునిచ్చారు. బిజెపి నిరంకుశ పాలనను కట్టడి చేసే సందర్భం ఇదేనని స్పష్టం చేశారు.శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి ఎన్నికలు రెగ్యులర్‌గా జరిగేవి కావు. జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరుగుతోంది. బీహార్‌లో ఓట్ల గురించి దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయని మల్లు రవి వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి నక్సలైట్లకు సపోర్ట్ అని హోంమంత్రి అమిత్ షా స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయొచ్చా,దీని ద్వారా కూడా లబ్ధిపొందాలని చూస్తున్నారు. చంద్రబాబు, నితీష్ కుమార్ బిజెపికి సపోర్ట్ చేస్తున్నారు కానీ ఏకపక్షంగావ్యవహరించే బిజెపికి గుణపాఠం చెప్పేసమయం ఇదే వారు ఆలోచించుకోవాలన్నారు.

## నిజామాబాద్ జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసుల సోదాలు

### సెటిల్మెంట్లు చేసుకోవాలని వ్యాపారులపై ఒత్తిడి?

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం తెల్లవారుజాము నుంచి వడ్డీ వ్యాపారులతో పాటు కొందరు వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి, భారీగా నగదు,డబ్బులు స్వాధీనం చేసుకోవడం సంచలనం రేపింది. అ యితే ఇదే సమయంలో ఈ దాడుల సందర్భంగా కొందరుపోలీసులు చేతవాటం ప్రదర్శించినట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. వడ్డీ వ్యాపారుల ఇళ్లలో కోటిరూపాయల నుంచి మూడు కోట్ల రూపాయల వరకు నగదు లభిస్తే అందులో సగం మాత్రమే రాస్తూ మిగతా సొమ్ము విషయంలో సెటి ల్మెంట్లకు కొందరు పోలీసులు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి.

## స్కూల్‌లో నిద్రపోయిన చిన్నారి

### ఒడిశాలో దారుణం

### తాళం వేసి వెళ్లిన సిబ్బంది

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:**ఒడిషాలో పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం ఓ చిన్నారి ప్రాణాల మీదకు తెచ్చింది. పాఠశాల గదిలో రెండవ తర గతి చదువుతున్న చిన్నారి నిద్ర పోతుండగా ఈ విషయాన్ని గమనించని సిబ్బంది గదికి తాళం వేసి వెళ్లిపోయారు. అయితే నిద్ర నుంచి లేచిన బా లిక బయటకు వచ్చేందుకు కిటికీ ఊచల మధ్య తలను పెట్టి అందులో ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో ఆ చిన్నారి రాత్రంగా నరకయాతన అనుభవించింది. కియోంఝర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఈ ఘటన జరిగింది.

## ఉద్యోగావకాశాలు, యువతకు నైపుణ్యాభివృద్ధిపై మంత్రి వివేక్‌వెంకటస్వామి సమీక్ష

**హైదరాబాద్,ఆగస్టు 23 ప్రభాత వార్త:** రాష్ట్రంలో ఉద్యోగావకా శాల విస్తరణ, యువతకు నైపుణ్యాభివృద్ధి మంత్రి వివేక్‌వెంకటస్వామి సమీక్షించారు. శనివారం సచివాల యంలో లేబర్, ఎంప్లాయి మెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ అధికారులతో టామ్‌కాంపై సమీక్ష నిర్వహిం చారు.

## 2024లో రూ.12 వేల కోట్ల చలాన్లు జారీ

### రూ.3 వేల కోట్లు వసూలు

### మిగతా పెండింగ్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** గత ఏడాది అంటే 2024లో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు ట్రాఫిక్ ఉల్లంఘనులకు ఎనిమిది వేల కోట్ల చలాన్లను విధించాయి. ఈ చలాన్ల ద్వారా 12 వేల కోట్ల రూపాయలు వసూలు కావాల్సి వుండగా కేవలం మూడు వేల కోట్ల రూపాయలు మాత్రమే వసూలయ్యాయి. మిగతా 12 వేల కోట్ల రూపాయలు ఇంకా వసూలు కావాల్సి వుంది. ఈ మేరకు జాతీయ మీడియాలో శనివారం వార్తలు వెలు వడ్డాయి.

## కోదండరామునికి వేదోక్తంగా సహస్రకలశాభిషేకం



**తిరుపతి,ఆగస్టు23 ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని కోదండరామాలయంలో అమావాస్య సందర్భంగా సహస్రకళశాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం అమావాస్య ఘడియలతో ఉదయం ప్రత్యేక సహస్రకళశాభిషేకం సేవ జరిపించారు. 500 రూపాయలు చెల్లించి పాల్గొన్న గృహస్థభక్తులకు ఉత్తరీయం, ఒక లడ్డూ, ఒక వడ బహుమానంగా అందజేశారు. అనంతరం సాయంత్రం కోదండరామస్వామి ఉత్సవమూర్తి సర్వాలంకారభూషితుడై తనకెంతో ప్రీతిపాత్రమైన హనుమంతవాహనాన్ని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. రామభక్తుడైన హనుమంత వాహనసేవను భక్తులు తిలకించి గోవింద...రామా...జైశ్రీరామ్ నామస్మరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ రవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేశ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవాణి బ్రేక్ ఆఫ్‌లైన్ కోసం భక్తుల అవస్థలు



**తిరుమల,ఆగస్టు23 ప్రభాతవార్తప్రతినిధి:** రోజువారీగా శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాలకు ఒక్కో భక్తుడు 10,500 రూపాయలు చెల్లించి అందుకుంటున్న (ప్రోటోకాల్‌తో సమానమైన )దర్శన టిక్కెట్లకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో ఆన్‌లైన్ చేయాలనే ఆలోచనలో టిటిడి పెద్దలు, అధికారులు ఉన్నారు.ఇప్పటికే తిరుమలలో ఆఫ్‌లైన్ విధానంలో ప్రత్యేక కౌంటర్‌లో 800 టిక్కెట్లు, రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లజారీ చేస్తున్నారు. సాధారణరోజుల్లోనే 1,500మంది వరకు భక్తులు ఈ దర్శనానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఇక వారాంతం ,రద్దీ విపరీతంగా పెరిగే సందర్భాల్లో 3వేలమంది వరకు భక్తులు ఇక్కడ బారులుతీరి నిలబడుతున్నారు. సాధారణంగా నిర్ణీసమయం ఉదయం 10గంటలకు జారీచేయాల్సిన ఈ దర్శన టిక్కెట్లను టిటిడి అధికారులు ఇష్టానుసారంగా భక్తుల రద్దీతో సమయం సందర్భం లేకుండా అర్ధరాత్రి 2గంటలకు, వేకువజామున 3,4గంటలకు ఇలా టిక్కెట్లు జారీ చేస్తుండటంతో గందరగోళం పరిస్థితులు ఉన్నాయి.భక్తులు కూడా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇదేగాక ఈ దర్శనాలకు కనీసం గదులు కూడా ఇవ్వకుండా భక్తులు అవస్థలు పడుతున్నారు. ఏరోజుకారోజు శ్రీవాణి దర్శనాలు చేయడంతో భక్తుల నుండి మరింతగా స్పందన కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు కూడా పూర్తిగా ఆన్‌లైన్ చేయడమే మంచిదనే ఆలోచనతో టిటిడి అధికారులు కార్యాచరణ సిద్దంచేసుకొంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 500 టిక్కెట్లు రోజువారీగా మూడునెలల ముందే ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్న విషయం విదితమే.. ఆఫ్‌లైన్‌లో వెయ్యి టిక్కెట్లు ఇస్తున్నా డిమాండ్ పెరగడం, భక్తులకు వసతి కల్పించలేని ఇబ్బందులు ఉండటంతో ఆన్‌లైన్ చేయడంపైనే దృష్టి సారిస్తున్నారు. అయితే రోజురోజుకూ శ్రీవాణి బ్రేక్ దర్శనాలకు డిమాండ్ మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు. మరీ ఆఫ్‌లైన్‌లోనే టిక్కెట్లు పెంచాలా?ఉన్నవి ఆన్‌లైన్ చేసేస్తారా అనేది త్వరలోనే తేలనుంది. ఈ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులకు సాయంత్రం 4.30గంటలకు ఆలయంలోపల కులశేఖరపడివద్ద మొదటిగడప నుండి శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రశాంతంగా, కళ్లారా మరీ దగ్గరగా దర్శనం చేసుకునే భాగ్యం ఉండటంతో చాలావరకు భక్తులు ఈ దర్శనాలపై ఆధారపడుతున్నారు. మరీ టిటిడి అధికారులు భక్తుల అవసరానికి ఎలా స్పందిస్తారనేది చూడాల్సిందే.

## వారాంతంలో మోస్తరుగా భక్తులు

**తిరుమల,ఆగస్టు23 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం ఆపై శనివారం రోజు తిరుమలలో భక్తులు మోస్తరుగా ఉన్నారు. గత వారంవరుససెలవులతో కిటకిటలాడిన ఏడుకొండలు శనివారం ఉదయం నుండి భక్తులతో మోస్తరుగా వైకుంఠమ్ కంపార్టు మెంట్లు నిండాయి. ఎలాంటి దర్శన టిక్కె ట్లు, టోకెన్లు లేకుండా ఉన్న భక్తులు సర్వ దర్శనం కోసం వైకుంఠమ్ 2 క్యూలైన్ల నుండి ప్రవేశిస్తున్నారు. సాయంత్రానికి ఈ రద్దీ మోస్తరుగా పెరిగింది. సాదారణసర్వదర్శనానికి భక్తులు 10గంటలు నిరీక్షిస్తున్నారు. తిరుమలలో వున్నభక్తులకు వైకుంఠం,నారాయణగిరి ఉద్యానవనాల్లో క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు, టీ,మజ్జిగ ,పాలు ,తాగునీరు శ్రీవారిసేవకులు నిరంతరాయంగా పంపిణీచేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సత్వర దర్శనం అయ్యేలా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ అధికారులకు సూచనలు చేశారు. సాయంత్రంవరకు 41వేలమంది భక్తులు శ్రీవారిని మహాలఘులో దర్శనం చేసుకున్నారు.

# ఉచిత బస్సుతో మహిళల సందడి

స్త్రీ శక్తి కేవలం జిల్లాల స్థాయిలోనే పథకాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా సీఎం చంద్రబాబు మాత్రం రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెలుసులుబాటు ఇవ్వాలని ఆదేశించారు. పేద, మధ్య తరగతి, సామాన్య మహిళకు దూర ప్రయాణా ఖర్చులు తగ్గించాలనే ఉద్దేశంతో ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ అమలుకు పచ్చజెండా ఊపారు. పంద్రా ఆగస్టున ఉండవల్లిలో స్త్రీ శక్తిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో కలిసి ప్రారంభించారు. అక్కడ నుంచి మెట్రో సర్వీసు బస్సులో మహిళలతో కలిసి ప్రయాణిస్తూ వారు విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు



చేరుకున్నారు. ఇక్కడ స్త్రీ శక్తి పథకానికి నిర్దేశించిన బస్సులను ప్రారంభించారు. తొలి రోజున అనుహ్యాం మహిళా ప్రయాణికులు ఈ బస్సులో ప్రయాణించారు. మొదటి అయిదు రోజులో 45 లక్షలకు పైగా మహిళలు ఈ బస్సులో ప్రయాణించారు. అదే ఒరవడి ఇప్పటికి కొనసాగుతుంది., భారీగానే మహిళలు ఈ సర్వీస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ప్రారంభ దశలో కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ మొత్తం మీద బస్సులలో ఉచిత ప్రయాణం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**విజయకుమార్ ఘంటా**

ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం పేరుతో ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళల కోసం అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే క్రమంలో ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని అమలులోకి తీసుకుని వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి అపూర్వ స్పందన లభిస్తోంది. నిత్యం లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. 'స్త్రీశక్తి' ఉచిత బస్సు పరిధిలో వినియోగపరిధిలో అయిదు కేటగిరిల బస్సులలో మహిళలను ప్రయాణానికి అనుమతిస్తున్నారు. ఈ సర్వీసులు సాధారణంగా ప్రయాణికులు ఆసక్తి చూపేవి కావడం మహిళల నుంచి ఆదరణ లభిస్తోంది, దీంతో అన్ని ఏసీ, ఇతర కేటగిరిలు అందుబాటులో లేకున్నా మహిళలు ఈ విషయంలోసర్దుబాటు చేసుకుంటున్నారు. ఉచిత మహిళా బస్సులు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణాల్లో ఉన్నాయి. నూతనంగా అందుబాటులోకి వచ్చిన బస్సు సర్వీసుల్లో మహిళలు సీట్ల కోసం ఆరంభంలో తోపులాటలు, జగడాలకు దిగినట్లు సమాచారం ఉంది. అయితే అక్కడ ఈ పరిస్థితులు ఇప్పుడులేవు, ముందస్తు అవగాన కల్పించడం, స్త్రీ శక్తి పరిధిలో ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకుని రావడంతో ఏపీలో అక్కడక్కడ తప్పించి మహిళలకు ఇబ్బంది కలుగలేదు. కేవలం 10రోజుల వ్యవధిలో ఏపీలో 75 లక్షల వరకు మహిళలు ఈ బస్సు సర్వీసులను వినియోగించుకుంటున్నారు. ఈ పథకం వలన ఆర్టీసీకి లాభాలు పెరుగుతాయనేది నిపుణుల అంచనా. ప్రభుత్వం ఈ పథకం పరిధిలో ఏటా ఆర్థికంగా రెండు వేల కోట్ల రూపాయల వరకు వ్యయం అవుతుందని ప్రకటించింది. అయితే ఈ బస్సులో జీరో ఫెయిర్ టిక్కెట్టులపై స్త్రీలను అనుమతించడంతో అనుహ్యంగా ఈ మొత్తాలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంది. దీని వలనే ఆర్టీసీకి లాభాలు పెరుగుతాయి. ఇది ఆర్టీసీ అభివృద్ధికి సహకరించడంతో పాటు ఇంధన ఖర్చు తగ్గింపులో భాగంగా రమారమీ రెండు వేల ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకుని వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పల్లెవెలుగు సర్వీసులకు కూడా ఏసీ బస్సులనే ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ రాష్ట్రంలో కొత్తగా మరో 1,150 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేస్తున్నామని సంస్థ ఎండి ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. ఆయా డిపోలో ఎలక్ట్రికల్ బస్సులను సమర్థవంతంగా నిర్వహించేందుకు కావాల్సిన మౌలిక వసతుల్ని కూడా సిద్ధం చేస్తునట్లు తెలి



పారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి భద్రాచలానికి అంతరాష్ట్ర సర్వీసులుగా నడుస్తున్న మరో తొమ్మిదింటికి స్త్రీ శక్తి పథకం వర్తించేలా ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. రాజమహేంద్రవరం, గోకవరం డిపోల నుంచి మారేడుమిల్లి మీదుగా భద్రాచలం నడిచే ఏడు సర్వీసులను ఎటపాక వరకుపొడిగించారు. రాజమహేంద్రవరం డిపో నుంచి కుక్కునూరు మీదుగా భద్రాచలం వెళ్లే మరో తొమ్మిది ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఈ పథకం అమలు చేయనున్నారు. దీంతో ఇక్కడ నుంచి అటు భద్రాచలంతోపాటు ముంపు మండలాలకు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే మహిళా ప్రయాణికులకు ప్రయోజనం చేకూరింది. ప్రస్తుతం భద్రాచలానికి రాజమహేంద్రవరం డిపో నుంచి ప్రతి రోజూ పది,గోకవరం డిపో నుంచి ఆరు చొప్పున సర్వీసులు నడుపుతున్నారు. వీటి అన్నింటికీ స్త్రీశక్తి వర్తిస్తుంది. ఈ పథకం కోసం దాదాపుగా 1942 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుంది. స్త్రీ శక్తి పథకాన్ని వినియోగించుకోవాలంటే ప్రయాణికులు రాష్ట్రవాసులై ఉండాలి. ఓటర్ ఐడీ, ఆధార్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డులను కండక్టర్లకు చూపి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉంది. నాన్‌స్టాప్‌లు, సూపర్ లగ్జరీలు, ఏసీ బస్సులు, ఘాట్ రూట్లలో తిరిగే సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. రాష్ట్రంలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్,మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చు. ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంది. ఆధార్, ఓటరు, రేషన్ కార్డు చూపించి బస్సులో ప్రయాణించొచ్చు. స్త్రీ శక్తి పథకం ద్వారా 2.62 కోట్లమంది మహిళలు లబ్ధి పొందనుండగా, పథకం అమలు వల్ల ప్రభుత్వంపై ఏటా 1,942 కోట్ల భారంపడనుంది. ఉచిత బస్సు ప్రయాణాన్ని ట్రాన్స్ జెండర్లకూ వర్తింపు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ పరిధిలో మొత్తంగా 11,449 బస్సులుంటే అందులో 74 శాతం అంటే 8,458 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ పథకాన్ని ట్రాన్స్ జెండర్లకు కూడా వర్తింపజేస్తున్నారు. ప్రభుత్వ అంచనా ప్రకారం మహిళలు వివిధ బస్సుల్లో వారానికి 4సార్లు సరాసరిన ప్రయాణిస్తారు. రోజూ కార్యాలయాలకు వెళ్లొచ్చే మహిళా ఉద్యోగులకైతే నెలకు ఒక్కో మహిళకు బస్సుల్లో ప్రయాణానికి దాదాపు వెయ్యి నుంచి 3వేల వరకు ఖర్చవుతుంది. సరాసరిన ఒక్కో కుటుంబానికి 4వేలవరకూ రవాణా ఖర్చులుంటాయి. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయి.

ప్రభుత్వ అంచనా ప్రకారం మహిళలు వివిధ బస్సుల్లో వారానికి నాలుగు సార్లు సరాసరి ప్రయాణిస్తారు. ఇక ఉద్యోగాలు చేసే మహిళలైతే రోజువారీ ప్రయాణిస్తారు. దీని నిమిత్తం నెలకు ఒక్కో మహిళకు సుమారుగా రూ.1000 నుంచి రూ.3000 వరకు ఖర్చు అవుతుంది. ముందుగా కేవలం సిటీ, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా.. బస్సులో ప్రయాణించే ప్రతి పేద, మధ్య తరగతి, సామాన్య మహిళకు ప్రయాణ ఖర్చు తగ్గించాలి, దూర ప్రయాణాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకంకోసం సుమారుగా రూ. 1942 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఈ మొత్తం భరించడం కష్టమే అయినామహిళలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్గించేలా ఉంటుందని ప్రభుత్వం ఈ పథకం అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిద్వారా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన హామీని నెరవేర్చినట్టు అయింది. ప్రయాణికులు రాష్ట్ర వాసులు అయ్యుండాలి. ఓటర్ ఐడీ, ఆధార్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ సహా ఇలాంటివి కండక్టర్లకు చూపించి ఉచిత ప్రయాణం చెయ్యవచ్చు. నాన్‌స్టాప్‌లు,సూపర్ లగ్జరీలు, ఏసీ బస్సులు, ఘాట్ రూట్లలో తిరిగే సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తిం చదు. బస్సుల్లో ప్రయాణించే మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్లు ఇవ్వడానికి అవసరమైన సాఫ్ట్ వేర్ కూడా సిద్ధం చేసింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు మహిళలకు ప్రభుత్వం కల్పించింది. ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్రంలోని సుమారు 2.62 కోట్ల మంది మహిళలు వినియోగించుకోవచ్చు. తిరుపతి, అన్నవరం, శ్రీశైలం, సింహాచలం, ద్వారకాతిరుమల, శ్రీకాళహస్తి. విజయవాడ కనకదుర్గమ్మ వంటి ప్రధాన ఆలయాలకు వెళ్లాలనుకున్నా బస్‌ఛార్జీల భారం కారణంగా వెళ్లలేనివారే అధికం. ఇకపై ఇటువంటి కుటుంబాల్లో మహిళలకు బస్ ఛార్జీల భారం లేకపోవడంతో తక్కువ ఖర్చుతో ఆలయాలకు వెళ్లి వచ్చేందుకు అవకాశం కలగనుంది.

# కొత్త 'సింగ' మేనా!

తమిళనాడు

కొత్త నీరు వస్తే పాత నీరు పక్కకు పోవడం సహజం. అయితే కొత్త, పాత నీళ్ల కలగలిసి పారుతూంటాయి. అదీ సహజమే. కొంత కాలం తర్వాత కొత్త నీరు కూడా పాతదవుతుంది. రాజకీయాల్లో కనిపించే దృశ్యాలు కూడా అటువంటివే. ప్రముఖ తమిళ నటుడు విజయ్ కొత్త పార్టీని స్థాపించిన తర్వాత రెండో భారీ సమావేశం గత గురువారం ( 21, ఆగస్టు ) మదురై సమీపంలో నిర్వహించారు. తమిళ చలనచిత్ర రంగంలో దూసుకుపోతున్న 'స్టార్'గా విజయ్‌కి ఒక ప్రత్యేక స్థానమే ఉంది. చాలా విజయవంతమైన చిత్రాలే ఆయన ఖాతాలో ఉన్నాయి. 'సూపర్ స్టార్' గా పేరున్న రజనీకాంత్‌కు గట్టి పోటీని ఇచ్చే యువ నటునిగా విజయ్ ఎదుగుతున్నాడనే పేరు కూడా వచ్చింది. రజనీకాంత్ కూడా గతంలో రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం జరిగింది. జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆమెకు పోటీగారజనీకాంత్ రంగప్రవేశం చేస్తారనే కథనాలు అప్పట్లో వెల్లువెత్తాయి. కానీ ఎందుకో ఆయన ముందుకు దూకలేకపోయారు. అది వేరే విషయం. ఆ తర్వాత మరో ప్రముఖ నటుడు కమల్ హాసన్ మరో కొత్త పార్టీతో ముందుకు దూకారు కానీ రాజకీయాలలో తగిన ప్రభావం చూపలేకపోయారు. ఆ తర్వాత డిఎంకె పంచన చేరి రాజ్యసభలోకి అడుగు పెట్టగలిగారు. కమల్‌కు ముందు, తర్వాత తమిళ రాజకీయాల్లో రాణించిన 'అగ్ర తారలు' చాలామందేఉన్నారు. జాగ్రత్తగా పరిశీలిస్తే తమిళరాజకీయాల్లో'రాజ్యం' చేసిన వారంతా ఏదోవిధంగా చలన చిత్రరంగంతో సంబంధం ఉన్నవారే అనిపిస్తుంది. నాటి అన్నాదురై నుంచి నేటి విజయ్ దాకా సినిమా రంగంలో రాణించి రాజకీయరంగంలో నిలదొక్కుకున్నవారే. వారిలో ముఖ్యమంత్రులైన వారు కూడా చాలామందే ఉన్నారు. డిఎంకె వ్యవస్థాపకుడైన అన్నాదురై,తర్వాత కరుణానిధి, ఎమ్జీఆర్, జయలలిత, ముఖ్యమంత్రి పీఠాన్ని కూడా అధిష్టించారు. శివాజీ గణేశన్, విజయ్ కాంత్ వంటి అగ్రనటులు రాజకీయా ల్లోకి వచ్చి ప్రయత్నించారుకానీ ముఖ్యమంత్రి పీఠం అందుకోలేకపోయారు. అయినా వారిద్దరు కూడా తమిళ రాజకీయాల్లో విశేషమైన ప్రభావాన్నే

**ఎ.వి.వి ప్రసాద్**

చూపారు. ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు అయిన సినీ నటులు పెద్దసంఖ్యలోనే కనిపిస్తారు. తమిళ రంగంలో సినీనటులు రాజకీయాల్లో రాణించడంతో ఆప్రభావం తర్వాత దక్షిణాదిలో తెలుగు, కన్నడ, మలయాళ రంగాలపై కూడా బాగానే పడింది. అయితే తమిళ రాజకీయాల్లో కరుణా నిధి, ఎమ్జీఆర్, జయలలిత బలమైన ముద్ర వేశారు. రజనీకాంత్ రాజకీయ ప్రవేశం చేసి ఉంటే మళ్లీ అంతటి బల మైన ముద్రవేయగలరనీ, సిఎం అవుతారనీ గతం లో రాజకీయవిశ్లేషకులు భావించారు కానీ ఆయన మనసు మార్చుకొని దూరంగా ఉండిపోయారు. కొన్ని సందర్భాల్లోడిఎంకె, అన్నాడిఎంకెలకు మద్దతు ఇవ్వడం వరకే ఆయన 'రాజకీయం'ఆగిపోయింది.



విజయ్

కమల్ తర్వాత రాజ కీయాల్లోకి వచ్చిన అగ్ర నటునిగా విజయ్‌పార్టీని స్థాపించినప్పటి నుంచి ప్రభావంచూపుతున్నారనే చెప్పాలి. 'తమిళగ వెట్రి కజగం ( టివికె) అనే పార్టీని గతసంవత్సరం స్థాపించినప్పుడు' కమల్ కంటె గొప్పవాడా అనే వ్యాఖ్యలు వినిపించా యి. కానీ గత గురువారం నిర్వహించిన రెండో మహాసభ తర్వాత తమిళనాట నిజంగానే 'కొత్త గాలి' వీస్తోందనే మాటలు వినిపిస్తున్నాయి. ఆ సభకు లక్షల్లో అభిమానులు తరలివచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఆ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒకరుమరణించినట్లు సమాచారం. అంటే పోలీసులు అదుపుచేయలేనంతగా అభిమానుల వెల్లువ ముంచెత్తింది. ఆ ఉత్సాహంతో విజయ్ కీలకమైన ప్రకటనలే కొన్నిచేశారు. తమ సైద్ధాం తిక శత్రువు బిజెపి, ఏకైక రాజకీయ శత్రువు డిఎంకె అని ప్రకటించారు. వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికల్లో తమకు అధికారం ఖాయమనే ఆశాభావం వ్యక్తం చేశారు. డిఎంకె, బిజెపిని తరిమికొట్టడమే తమ లక్ష్యమన్నారు. తనను ఆయన 'సింగం'తో పోల్చుకున్నారు. 'సింహానికి గుంపులో ఎలా జీవించాలో తెలుసు. ఒంటరిగా ఎలా జీవించాలో కూడా తెలుసు. సింహం వేటాడేందుకే వస్తుంది, వినోదం కోసం కాదు. అది ఎప్పుడూ బతికున్న జంతువునే వేటాడి ఆహారంగా తీసుకుంటుంది. అలాగే నేనూ రాజకీయాల్లోతాడో పేడో తెల్చుకొనేందుకే వచ్చా'నంటూ ప్రకటించారు. ఆయన ఈ మాటలంటుంటే అభిమాన గణం ఉత్సాహంతో చిందులు తొక్కింది. ఆ సభను, జనం ఉద్రూతలను గమనించిన వారికి 'కాబోయే సీఎం విజయ్' అనే అభిప్రాయమే కలిగింది. అయితే ద్రవిడ రాజకీయాలతో పెనవేసుకుపోయిన తమిళనాట విజయ్ ' సింహనాదం' ఎటు వంటి ప్రభావం చూపుతుందనేది వేచి చూడవలసి ఉంది. డిఎంకెను ఢీ కొట్ట గలిగింది గతంలో అన్నాడిఎంకె మాత్రమే. కానీ జయలలిత అనంతరం ఆపార్టీ బాగా బలహీనపడింది. ఆ కారణంగానే డిఎంకె మళ్లీ జూలు దులిపింది. ప్రస్తుతానికి డిఎంకె పరిస్థితి చాలా 'స్ట్రాంగ్' గానే ఉన్నదని పరిశీలకుల అభిప్రాయం. ఇప్పుడు విజయ్ అనే కొత్త 'సింగం' కూడా జూలు విదుల్చుతోంది. బిజెపి, కాంగ్రెస్, అన్నా డిఎంకెలో స్టాలిన్‌కు సరిపోయే ప్రత్యర్థులు లేరనే మాట వాస్తవమే అయినా విజయ్ పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి రావడంతో వచ్చే ఎన్నికలు రసవత్తరంగా ఉంటాయనడంలో సందేహం లేదు. కొన్ని దశాబ్దాలుగా ప్రజలతో మమేకమైన పార్టీ డిఎంకె కాగా,కొత్తగా ఆవిర్భవించిన పార్టీ టివికె. ఈ కొత్తపార్టీప్రజల్లో బలమైన ప్రభావం చూపాలంటే నాయకుడైన విజయ్ కదలికలను బట్టే అంచనా వేయవలసి ఉంటుంది. ఎవరితోనూ పొత్తు ఉండదనీ,సింహం సింగిల్ గానే పోరాడుతుందనీ విజయ్ అంటున్నారు. ఆ ధైర్యం, ఆ సాహసం వల్లే ఆయన బరిలోకి దిగుతున్నా రనిపిస్తుంది. ముందు

# ట్రంపరితనం !

అమెరికా

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచిన రోజున భారతీయులు ఎంత సంతోషించారో, ఈనాడు ఆయన భారతదేశం మీద విషం కక్కడం చూస్తే అంతగా వాపోతున్నారు. వివిధ ప్రపంచ దేశాలతో అనుసరిస్తున్న తీరు సుంకాల విధింపు పేరిట ఆయా దేశాలను భయభ్రాంతులను చేయడం చూస్తే, ఆయన లక్ష్యమేమిటో అర్థం కాదు. ఆయన గెలువగానే 'అమెరికాయే ఫస్ట్' అనే లక్ష్యంతో సాగుతున్నారనే ఉద్దేశ్యంతో బాగా మెచ్చుకున్న వారు కూడా ఇప్పుడు పునరాలోచించుకుంటున్నారు. ఏమయితేనేం ట్రంప్ మాట్లాడిన మాటలకు అర్థాలే వేరనే పరిస్థితి ఎదురయ్యింది. తాజాగా తాను ఏడు యుద్ధాలను ఆపగలిగినా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం విషయం తనకు కొరుకుడు పడటం లేదని ఒప్పుకొన్నారు. ఇలా ఎందుకు జరిగిందో సమీక్ష చేసుకోవడంలో ఆయన విఫలమవుతున్నందున ఇలాంటి వ్యాఖ్యానాలు వెగటు వ్యాఖ్యలు చేస్తున్నారు. పుతిన్ జెలెన్‌స్కీల మధ్య వ్యవహారం తనకందుబాటులో లేనందున ఆయనకు కోపం రావడం సహజం. అందుకే తన వద్ద ఉన్న వ్యవహారం చర్చల పరిశీలనలో ఉండగానే ఆ రెండు దేశాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారంటూ, ఇతర వ్యక్తులను అనరాని మాటలంటున్నారు. పుతిన్, జెలెన్‌స్కీలను ఏకంగా 'స్టుపిడ్ ఫెల్లోస్' అనేశారు. సాటి దేశాధినేతలను ఈ రకంగా వ్యాఖ్యానించడం ఏ సంప్రదాయం కిందవస్తుందో ఎవరికీ తెలియదు. ఇప్పటికే ట్రంప్ వాణిజ్య విధానాలు, సుంకాల పేరిట బెదరింపులను చేస్తున్న వ్యవహారాన్ని ట్రంప్ మాజీ సలహాదారుడు జాన్ బోల్టన్ ఇటీవల దుయ్యబడుతూ చేసిన వ్యాఖ్యల పర్యవసానంగా ఇప్పుడాయనపై ఎఫ్‌బిఐ దాడులు చేసింది. బోల్టన్ విమర్శల్లో తప్పేముంది అనే వారే ఎక్కువ. వైట్‌హౌజ్ ప్రధాన సలహాదారుగా పని చేసిన బోల్టన్‌కు ట్రంప్ సన్నిహితునిగా పేరుండేది. ట్రంప్ గురించి మాట్లాడుతూ 'దారి తప్పిన అధ్యక్షుడు' అని వ్యాఖ్యానించడమే బోల్టన్ చేసిన తప్పిదంలా ఉంది. భారత్‌పై అదే పనిగా సుంకాలు వేయడం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందున అని చెప్పారు. తీరా పుతిన్ తనతో సమావేశమయ్యే సరికి తూచ్ భారత్

**గన్ని మోహన్**

మీద అదనపు సుంకాల గురించి ఆలోచించే పనిలో పడ్డారు. జెలెన్‌స్కీ సమావేశానికి పుతిన్ షరతులు విధించడంతో తన మాట కాదన్న పుతిన్ పేరిట భారత్‌కు మళ్లీ సుంకాలు వడ్డిస్తానని ట్రంప్ చెప్పడం ప్రపంచ ప్రజలందరికీ తెలిసిపోయిన వ్యవహారం. భారత్‌పై సుంకాలు విధించడానికి, బెదరించడానికి ఏమాత్రం బెసగని ట్రంప్ చైనా జోలికి వెళ్లకపోవడంపై కూడా విమర్శలకు గురవుతున్నారు. మరో వాణిజ్య సలహాదారు పీటర్ నవారో రష్యాను 'బట్టలు ఉతికి పెట్టే వాషింగ్ మెషిన్'గా వ్యాఖ్యానించారు. ఇవన్నీ భారత్‌కు అమెరికాకు మధ్య సంబంధాలు బెడిసికొట్టేవే. అవి దీర్ఘకాలానికైనా, స్వల్పకాలానికైనా ఇరుదేశాల మధ్య అవినాభావ సంబంధాలకు మంగళం పాడినట్లే కాగలవు. ఇప్పుడు రష్యాతోభారత్ సంబంధాలు భారత్‌తో అమెరికా సంబంధాలు, అమెరికాతో చైనా సంబంధాలు... వీటిన్నిటి గురించి ఎన్ని చెప్పుకున్నా చివరాఖరికి అమెరికా సుంకాల బెదరింపుల ప్రస్తావన వరకే చేరతాయి. అన్ని దేశాలు తమ శత్రుదేశాల కన్నా అమెరికాకే ఎక్కువ భయపడుతున్నాయి. కలవరపడుతున్నాయి. ట్రంప్ ఈ మధ్యనే పుతిన్‌తోనూ, మరో సందర్భంలో జెలెన్‌స్కీతో సమావేశమయ్యాక మరోసారి కలయిక అంటూ జరిగితే త్రైపాక్షిక సమావేశం ద్వారా యుద్ధానికి ముగింపు పలకవచ్చుననే సంకేతాలు బయటపడ్డాయి. కానీ ఆ తర్వాత వారి త్రైపాక్షిక సమావేశానికి తేదీ, వివరాలు, చర్చించదగిన అంశాలు కనపడటంలేదు, వినపడడం లేదు. అసలు రష్యాతో కయ్యానికి దిగడంలో ఉక్రెయిన్‌కు గతంలో యూరప్ దేశాలే సహకరించాయనే అపప్రధ



డొనాల్డ్ ట్రంప్

ఉంది. దాన్ని రూపుమాపుకోవడం జరిగే పని కాదు. ఉక్రెయిన్‌కు 'నాటో' లో చేరకుండా కట్టడి చేయాలని రష్యా కోరడం ఒకటైతే, రష్యా ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాలను మళ్లీ తమకివ్వాలని జెలెన్‌స్కీ పట్టు. ఎవరు ముందు తగ్గినా మరోకరు వెనువెంటనే తగ్గుతారన్నగ్యారంటీ ఏమీలేదు. అందుకే తాజాగా ద్వైపాక్షికమో! త్రైపాక్షికమో? ఎటూ తేలడం లేదు. అలా రష్యా మౌనంపై కూడా భారత్‌ను నిందించే స్థాయికి ట్రంప్ దిగిపోయాడు. తాజాగా రష్యా దారికి రాకుంటే భారత్ మీద మరికొంత సుంకాలు విధిస్తామంటూట్రంప్ నోరుజారారు. అదేదో నోరుజారడం కాదు బెదరింపే! ఇలా భారత్ వంటి ఆప్తమిత్ర దేశాలను ట్రంప్ దూరం చేసుకుంటున్నాడన్న ఆవేదన అమెరికా దౌత్యవేత్త జాన్‌కెర్రీ వంటి వారు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ ట్రంప్ తీరు మారెదెన్నడో! మారేదెప్పుడో! పుతిన్, తాను ట్రంప్‌ల మధ్య జరిగే త్రైపాక్షిక చర్చలతో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుందనుకున్న జెలెన్‌స్కీ గొంతులో వెలక్కాయపడింది. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే విషయమై తానూ ఉన్నానంటూ పదేపదే చొరబడుతున్న ట్రంప్‌కు ఎక్కడా దారిదొరకడం లేదు. పాక్‌తో ద్వైపాక్షిక చర్చల్లో మూడో దేశం జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఇదే విషయంలో ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్ 2025 సదస్సులో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ట్రంప్ మధ్యవర్తిత్వంపై కానీ ఏ ఇతర దేశం మధ్యవర్తిత్వంపై కానీ గత యాభై ఏళ్లుగా భారత్ ఏకాభిప్రాయాన్నే కలిగి ఉందని వివరించారు. కొన్ని వివాదాల్లో ట్రంప్ కలుగచేసుకోవాలని చూసినా ఆయన జోక్యాన్ని ఎవరూ నమ్మడం లేదు. భారత్ అయితే అసలు వద్దనే అనుకుంటోంది. 'యుద్ధ విరమణ' అంశాల్లో విజయం సాధించి నోబెల్ శాంతి బహుమతి అందుకోవాలన్న ట్రంప్ ఆకాంక్షలకు ఆయన ట్రంపరితనమే అడ్డుపడ్తోంది.

# బతుకునిచ్చే ప్రభుత్వాలు కావాలి!

**మన్నారం నాగరాజు**

ఒక ప్రక్కన 'బగ్గతాగు ఊగు సావు' అన్నట్టుగా ఉంది పాలకుల విధానాలు చూస్తే మద్యం రూపంలో ఆదాయం. తెలంగాణ రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయింది. ప్రజల అభిలాషలకు అనుగుణంగా పాలన సాగుతుందో లేదో అన్నప్రశ్న ఇప్పటికే తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాష్ట్ర ఆదాయ వనరుల పేరుతో ప్రభుత్వం చూపుతున్న మద్యం ప్రేమ ఇప్పుడు తీవ్ర విమర్శలకు గురవుతోంది. మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ధర్మపోరాటం పేరిట ఉద్యమాలు చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం విక్రయాలను రెట్టింపు చేసింది. ప్రభుత్వానికి ఆదాయం అవసరం. కానీ ఆ ఆదాయాన్ని ప్రజల ఆరోగ్యం, జీవితం, కుటుంబాలపై ముడిపెట్టి సంపాదించాలంటే మాత్రం అది ప్రజాప్రతినిధులకు తగిన నైతిక వైఖరి కాదన్నది స్పష్టమైన వాదన. మద్యం విక్రయాలు - రెట్టింపు వేగంతో2024 25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 45,000 కోట్ల మద్యం ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించిందన్న వార్తలు అధికారిక వర్గాల నుంచే వెలువడాయి. రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2025-26) రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత బడ్జెట్లో 20శాతం (రూ.60 వేల కోట్లు) ఆదాయం మద్యం ద్వారా రాబట్టాలని సర్కార్ నిర్ణయించింది. గతేడాది ఈ రూపంలో రూ.39.500 కోట్ల ఆదాయం సమకూరగా ఈ సారి మరో రూ.20వేలకోట్ల వరకు ఆదనంగా లిక్కర్‌ద్వారా సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవలఅబ్కారీ శాఖపై సమీక్ష నిర్వహించిన ఆ శాఖమంత్రి ఆదాయమార్గాల పెంపుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధరల నిర్ణయ కమిటీ సిఫారసులను పరిగణనలోకి తీసుకున్న ఆ శాఖ మూడు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించింది. ధరల పెంపు, కొత్త కంపెనీలకు అనుమతి, సాధారణ బార్లతో పాటు ఎలైట్ బార్లు, వైన్స్ సంఖ్య పెంచాలని ప్రతిపాదించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,620 మద్యం దుకాణాలు, వెయ్యికి పైగా బార్లు, క్లబ్బులు, టూరిజం హోటళ్లు ఉన్నాయి. 12,769 గ్రామ పంచాయతీలుండగా, ఒక్కో గ్రామంలో అనధికారికంగా 5 నుంచి 10వరకు బెల్ట్ షాపులున్నాయి. మొత్తంగా చూస్తే తెలంగాణ వ్యాప్తంగా దాదాపు లక్షకు పైగా బెల్ట్ షాపులుంటాయని గణాంకాలు చెబుతున్నాయి. వీటి ద్వారా ఖజానాకు అన్ని శాఖలకంటే ఎక్కువ మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. గతపదేండ్లలో దాదాపు రూ.2.5లక్షల కోట్లకు పైగా ఆదాయం ఈ విభాగం నుంచే సర్కారుకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని అబ్కారీ శాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆదాయం పెంపుపై గత రెండు నెలలుగా కసరత్తు చేసిన అధికారులు ధరలతో పాటు వైన్స్, బార్ల సంఖ్యను పెంచడం, కొత్త కంపెనీలకు అనుమతులివ్వాలనే మూడు ప్రతిపాదనలను సర్కార్ ముందుచ్చారు. ధరల నిర్ణయ కమిటీ సిఫారసులను పరిగణంలోకి తీసుకుని గత నెలలో బీర్లపై 15శాతం ధరలను అబ్కారీశాఖ పెంచింది. 5 శాతం పన్నులతో కలుపుకుని 19 శాతం వరకు బీర్లపై అదనపు ఆదాయం రానుంది. అలాగే లిక్కర్‌పై 20 నుంచి 25 శాతం పెంచాలని ప్రతిపాదించినప్పటికీ సర్కార్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కొత్త కంపెనీల అనుమతికి సంబం ధించి ఆచితూచి అడుగేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది అక్టోబర్లో సోమ్ డిస్టలరీకి అనుమతిచ్చినట్టు ప్రచారం జరిగింది. అయితే ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఎలా అనుమతిస్తారని ప్రతిపక్షాలతో పాటు స్వపక్షం నుంచి విమర్శలు రావడంతో సర్కార్ వెనుకడుగు వేసింది. ఈ క్రమంలో గత నెలలో తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) కొత్త లిక్కర్ బ్రాండ్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో ఉన్న 2,620మద్యం దుకాణాలు, వెయ్యికి పైగా బార్లసంఖ్యను 25 శాతం వరకు పెంచాలని



ప్రతిపాదించారు. అలాగే గుడుంబా, గంజాయి నియంత్రణను పకడ్బందిగా అమలు చేయాలని అధికారులు సర్కారు నివేదించారు. వీటిని అరికడితే గ్రామీణ ప్రాంతాల్లో చీఫ్ లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతాయని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా అబ్కారీ శాఖ అధికారులకు ప్రతి నెలా నిర్ణయించిన టార్గెట్లను చేరుకునేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ప్రతిపాదించారు. ఈ ఏడాది ఎలాగైనా మద్యం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.60 వేల కోట్లు సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణ భారతదేశంలో మద్యం విక్రయాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ (ఎస్ఐపీఎఫ్పీ) ప్రకారం రాష్ట్రంలో గతేడాది ఒక్కోవ్యక్తి సగటున మద్యం కోసం రూ. 1,623 ఖర్చు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ పరిస్థితిని మార్చుతామని ఎన్నికల ముందు ఆ పార్టీ నేతలు అనేక సభల్లో చెప్పారు. 18నెలల పాలనలో రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. పైగా రాష్ట్ర వ్యాప్తంగా బెల్ట్ షాపులసంఖ్య కూడా పెరిగిందని చెబుతు న్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని ఆశిస్తున్నదే తప్ప ప్రజల ఆరోగ్యాన్ని, వారి ఆర్థిక స్థితిగతులను చూడడం లేదనే విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. ఒక వైపు మద్యం తీసుకోవద్దనీ, ఆరోగ్యాలు కాపాడుకోవాలని అడ్వర్టైజ్మెంట్ల ద్వారా ప్రచారం చేస్తూ మరో వైపున దాని వినియోగాన్ని పెంచుతుండటం గమనార్హం. రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ద్వంద విధానం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఇప్పటివరకూ రాష్ట్రంలో లిక్కర్ షాపులు, బార్‌లు, అబ్కారీ పాలసీ అనుసారంగా విస్తరిస్తున్నాయి. ఓవైపు మద్య నిషేధం గురించి మాట్లాడే నాయకులు, మరోవైపు అధికా రంలోకి రాగానే మద్యం ద్వారావేల కోట్ల ఆదాయం లక్ష్యం గా పెట్టుకోవడం ప్రజాస్వామ్య విధానాలపై నమ్మకాన్ని తగ్గించేదిగా మారుతోంది. తెలంగాణ సమాజంలో మైనారిటీలు పెద్ద సంఖ్యలో గ్రామీణ, పట్టణ పేద వర్గాలుగా ఉన్నాయి. వీరి జీవితాల్లో మద్యం ప్రభావం మరింత తీవ్రమవుతోంది. రోజుకూలీలు, ఆటో డ్రైవర్లు, చిన్న ఉద్యోగులు వీరే మద్యం వలయంలో బలయ్యే వర్గాలు. ఆదాయానికి తగిన వృద్ధి లేకపోయినా, మద్యం ఖర్చు మాత్రం పెరిగిపోవడం వల్ల కుటుంబ జీవన విధానం దెబ్బతింటోంది. చివరికి భార్యా,పిల్లలు క్షుద్రంగా బతకాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమైనా తనకు అవసరమైన ఆదాయాన్ని పన్నుల రూపంలో లేదా ఇతర అభివృద్ధి ప్రాధాన్యతల ద్వారా సంపాదించాలి. కానీ, తెలంగాణలో మద్యం ద్వారా అధిక ఆదాయం సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకోవడం చూసినపుడు ఇది సంక్షేమం కాదు, వ్యాధి రూపంలో అభివృద్ధి అని చెప్పక తప్పదు. ప్రభుత్వ ఆదాయం మద్యం మీద ఆధారపడడం అంటే ప్రజల నాశనాన్ని అధికారికంగా అంగీకరించడమే. ఇతర రంగాల్లో ప్రభుత్వం స్పష్టమైన దిశలో పనిచేస్తుందో లేదో అనేది ప్రశ్నార్థకంగా ఉంది. కానీ మద్యం షాపుల నిర్వహణలో మాత్రం స్పష్టత ఉంది. ఉద్యోగ నోటిఫికేషన్లు తారాస్థాయిలో విడుదలకాలేదు. పింఛన్లు, పథకాల అమలు ఆలస్యం అవుతోంది. కానీ మద్యం షాపుల విస్తరణ మాత్రం వేగంగా కొనసాగుతోంది. ఇది బహుజన వర్గాలకు నష్టమే కాకుండా, రాజకీయంగా అనైతిక చర్యగా భావించాల్సిన పరిస్థితి. డ్రగ్స్, గంజాయి, పేకాట వంటి వ్యసనాలు కూడా మద్యం వెంబడి వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా నగర పరిధిలో, విద్యార్థుల మధ్య గంజాయి వినియోగం పెరుగుతున్నదన్న సంగతి అధికారికంగా గుర్తించబడిన అంశం. ఉద్యోగ అవకాశాల లేమి, నిరుద్యోగ భయం, నిరాశ ఇవన్నీ కలగలిపి యువతను మార్గం తప్పేలా చేస్తున్నాయి. మద్యం, గంజాయి, ఇతర వ్యసనాలు ఇవన్నీ జీవితాన్ని జోగులా మారుస్తున్నాయి. మద్యం వల్ల కుటుంబాలు తుడిచిపెట్టిపోతున్నాయి. మహిళలపై హింస, పిల్లలపై నిర్లక్ష్యం, విద్యా మానివేతలు ఇవన్నీ నిత్యకృత్యాలుగా మారిపోయాయి. ఇది ఒక వ్యక్తిగత సమస్య కాదు ఇది సమాజాన్ని వ్యవస్థాపితంగా విచ్ఛిన్నం చేసే ప్రమాద కర పరిస్థితి. ప్రభుత్వానికి ఆదాయం అందించే ప్రధాన వినియోగదారులు ఎవరంటే మధ్య తరగతి పేదవర్గాలే. వీరు బహుజనవర్గాలే. ఆవర్గాలపై మద్యం పేరుతో ఉక్కుపాదం మోపడం అంటే ప్రభుత్వమేవారిని జీవచ్ఛేలా గావించడమే. విద్యావేత్తలు, సమాజ హితసాధకులు ప్రభుత్వ విధానాలను గట్టిగా ప్రశ్నించాలి. ఆదాయానికి మార్గాలెన్నో ఉన్నాయి.

# ట్రంప్ విధానాలతో యుఎస్ కర్షకుల కన్నీళ్లు!



## అమెరికా టారిఫ్‌లతో ప్రత్యామ్నాయాలు వెదుకుతున్న దేశాలు

### భారత్-చైనా-రష్యా స్నేహబంధం శాపమైందా?

**న్యూయార్క్, ఆగస్టు 23:** అగ్రరాజ్యం అమెరికా అనుసరిస్తున్న సుంకాల విధానం ఇప్పుడు అదే దేశానికి ఆర్థికంగా నష్టాన్ని కలిగిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ వాణిజ్యంపై తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి అమెరికా విధించిన టారిఫ్‌లు, ఇతర దేశాలను తమకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవడానికి ప్రేరేపించాయి. ఫలితంగా అమెరికా క్రమంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఒంటరిగా మిగిలిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఓవైపు యూరోపియన్ దేశాలు తమ రక్షణ సామర్థ్యాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తుండగా.. మరోవైపు బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలు అమెరికాపై ఆధారపడకుండా పరస్పర వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసుకుంటున్నాయి.

**సోయాబీన్ వ్యాపారం.. అమెరికన్ రైతులు ఆవేదన**

ఈ అంతర్జాతీయ వాణిజ్య మార్పులకు సోయాబీన్ వ్యాపారం ఒక చక్కని ఉదాహరణగా నిలిచింది. అమెరికా ప్రపంచంలో రెండో అతిపెద్ద సోయాబీన్ ఉత్పత్తిదారు కాగా, చైనా అతిపెద్ద కొనుగోలుదారు. గతంలో చైనా అమెరికా నుంచి భారీగా సోయాబీన్ కొనుగోలు చేసేది. కానీ అమెరికా టారిఫ్ యుద్ధం ప్రారంభించిన తర్వాత.. చైనా తన కొనుగోలు విధానాన్ని మార్చుకుంది. ఇటీవల నివేదికల ప్రకారం.. చైనా సెప్టెంబరు–అక్టోబరు నెలల కోసం అమెరికా నుంచి ఒక్క టన్ను సోయాబీన్‌నుకూడా కొనుగోలు చేయడానికి ఒప్పందం చేసుకోలేదు. జూలైలో కూడా చైనా దిగుమతులు చాలా తక్కువగా ఉన్నాయి. తమపంట అమ్ముడుపోక అమెరికాలోని సోయాబీన్ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి స్వయంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు లేఖరాసి, చైనా వంటి అతిపెద్ద కొనుగోలుదారుని కోల్పోతే బతకడం కష్టమని హెచ్చరించారు.

**బ్రిక్స్ కూటమి ప్రభావం..**

బ్రిక్స్ దేశాలు ఇప్పుడు ఆర్థిక సహకారాన్ని పెంచుకుటూ అమెరికాపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. భారత్‌లోని చైనా రాయబారి షూ ఫెయ్‌హాంగ్ మాట్లాడుతూ.. అమెరికా బెదరింపు ధోరణిని అనుసరిస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో చైనా భారత్‌కు అండగా ఉంటుందని అన్నారు. అదేవిధంగా.. రష్యా డిప్యూటీరాయబారి రోమన్ బాబుష్కిన్ మాట్లాడుతూ.. భారతదేశానికి అమెరికా మార్కెట్‌లో సమస్యలు ఎదురైతే.. రష్యా మార్కెట్ సిద్ధంగా ఉందని, భారత ఎగుమతులను స్వాగతిస్తామని తెలిపారు.

**బ్రెజిల్‌కు లాభం..**

చైనా ఇప్పుడు అమెరికాకు బదులుగా బ్రిక్స్ దేశమైన బ్రెజిల్ నుంచి సోయాబీన్ దిగుమతులు భారీగా పెంచుకుంది. గత నెలలో చైనా మొత్తం సోయాబీన్ దిగుమతుల్లో దాదాపు 90 శాతం బ్రెజిల్ నుంచి జరిగింది.

**భారత్-చైనా-రష్యా సంబంధాలు మెరుగుపడుతున్నాయా?**

అమెరికా విధానాల నేపథ్యంలో భారత్ కూడా తన వాణిజ్య సంబంధాలను విస్తరించుకుంటోంది. రష్యా నేతృత్వంలోని 'యూరేషియన్ ఎకనామిక్ యూనియన్'తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా, భారత్–చైనా మధ్య గతంలో ఉన్న సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించుకుని, వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకోవడానికి అడుగులు పడుతున్నాయి.

చైనా అరుదైన ఖనిజాలు, ఎరువులు వంటి వ్యూహాత్మక వస్తువులను సరఫరా చేయానికి ముందుకు వచ్చింది. భారత ప్రభుత్వం కూడా చైనా వ్యాపార నిపుణులకు వీసా ఆంక్షలను సడలించే అవకాశం ఉంది. ఈ పరిణామాలు భారత్, రష్యా, చైనా మధ్య వాణిజ్య కూటమి బలపడుతోందనే సంకేతాలు ఇస్తున్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త శక్తిగా ఉద్భవిస్తున్నట్లు సూచిస్తుంది.



## భారత్‌లో అమెరికా రాయబారిగా సెర్గియో గోర్?

### ఈయన ట్రంప్‌కు సన్నిహితుడు!

**వాషింగ్టన్, ఆగస్టు 23:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. తన సన్నిహిత సహాయకుడు, విధేయుడు అయిన సెర్గియో గోర్‌ను భారత్‌కు అమెరికా రాయబారిగా నియమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ముఖ్యంగా భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 50 శాతం సుంకాలను విధించాలన్న అమెరికా నిర్ణయం మరో నాలుగు రోజుల్లో అమల్లోకి రానుండగా.. ఈ ప్రకటన వెలువడంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. సెర్గియో గోర్ ఒక దశాబ్దానికి పైగా డొనాల్డ్ ట్రంప్‌కు విధేయుడిగా పని చేస్తున్నారు. ట్రంప్ 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనూ, ఆ తర్వాత ఆయన పరిపాలనలోనూ గోర్ కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం కూడా ఆయన వైట్‌హౌస్‌లో ప్రెసిడెన్షియల్ పర్సనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ పదవిలో భాగంగానే దేశవ్యాప్తంగా ప్రభుత్వ విభాగాల్లో ట్రంప్ ఆలోచనలకు అనుగుణంగా 'అమెరికా ఫస్ట్' సిద్ధాంతాన్ని సమర్థించే దాదాపు 4,000 మందిని రికార్డు సమయంలో నియమించారు. ఫలితంగా ఫెడరల్ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల్లోని 95 శాతం ఉద్యోగాలను భర్తీ చేశారు. అలాగే ట్రంప్‌నకు సంబంధించిన పుస్తకాలను ప్రచురించడం, ఆయన తరపున ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం వంటి పనులను కూడా గోర్ పర్యవేక్షించారు. గోర్ పట్ల తనకున్న నమ్మకాన్ని ట్రంప్ స్వయంగా ఒక ప్రకటనలో వెల్లడించారు. 'ప్రపంచంలో అత్యధిక జనాభాఉన్న ప్రాంతంలో నా అజెండాను అమలు చేయగల వ్యక్తి నాకు కావాలి.

నేను పూర్తిగా విశ్వసించగలిగే వ్యక్తిగా సెర్గియో గోర్‌ను నియమిస్తున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇది చూస్తుంటేనే ఆయన ట్రంప్‌నకు ఎంత నమ్మకస్తుడో అర్థం అవుతోంది. అయితే అలాంటి నమ్మకమైన వ్యక్తినే తాజాగా ట్రంప్ భారత్‌కు అమెరికా రాయబారిగా ప్రకటించారు.



## ధర్మస్థల కేసులో తప్పుదోవ పట్టించేవారిపై కఠిన చర్యలు

### కర్ణాటక డి.సిఎం శివకుమార్

**బెంగళూరు, ఆగస్టు 23:** కర్ణాటకలోని పుణ్యక్షేత్రమైన ధర్మస్థలంలో వందలమృతదేహాలను తానే పూడ్చి పెట్టానని ప్రకటించుకున్న పారిశుధ్య కార్మికుడు భీమాను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ స్పందించారు. రెండు దశాబ్దాలుగా 'హత్యలు, అత్యాచారాలు, ఖననాలు' జరిగినట్లు తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ సిఎం వెల్లడించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన విషయంపై ప్రశ్నించగా తను మాట్లాడిన తర్వాతే బిజెపి నేతలు ఈవిషయంపై మాట్లాడుతున్నారని అన్నారు. ధర్మస్థల దేవాలయం, సంస్థలకు నాయకత్వం వహిస్తున్న కుటుంబం సిఎం సిద్ధరామయ్యను కలిసి దర్యాప్తును స్వాగతించినట్లు తెలిపిన విషయాన్ని చెప్పారు. ఈ కేసులో తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సిఎం, హోంమంత్రి తెలిపిన విషయాన్నితెలిపారు. తమ ప్రభుత్వం న్యాయం పక్షాన నిలబడుతుందని వ్యాఖ్యానించారు. మత రాజకీయాలు చేయాలనుకోవడం లేదని శివకుమార్ అన్నారు. ధర్మస్థల ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర జరిగిందని, దర్యాప్తులో నిజానిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

## మరో 50 రోజుల్లో సుంకాలపై ట్రంప్ కీలక ప్రకటన

**వాషింగ్టన్, ఆగస్టు 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ బెదరింపులకు పాల్పడుతూనేఉన్నారు. ఫర్నిచర్‌దిగుమతులపై సుంకాలు విధిస్తామని తాజాగా హెచ్చరించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా పోస్టుపెట్టారు. 'అమెరికాలోకి వచ్చే ఫర్నిచర్‌పై మే భారీస్థాయిలో టారిఫ్ ఇన్వెస్టిగేషన్ నిర్వహిస్తున్నాం. 50 రోజుల్లో ఆ విచారణ పూర్తవుతుంది'అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అయితే ఎంతమేరకు సుంకం విధిస్తారనే దానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. నార్త్‌కరోలినా, సౌత్ కరోలినా, మిషిగన్‌కు తిరిగి ఫర్నిచర్ పరిశ్రమను తీసుకురావడానికే ఈ చర్యలని పేర్కొన్నారు. యుఎస్‌లో ఫర్నిచర్, సంబంధిత పరిశ్రమలో జూలై నాటికి 3,40,000 మంది ఉపాధి పొందుతున్నారు. 2000సంవత్సరంలో పోల్చుకుంటే సగం మందే ఇప్పుడు ఆ రంగంలో పనిచేస్తున్నారు. ఇక, అగ్రరాజ్యానికి ఫర్నిచర్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా, వియత్నాం ముందువరసలో ఉన్నాయి. 2024లో 25.5 బిలియన్ డాలర్ల విలువైన సామగ్రిని అమెరికా దిగుమతి చేసుకుందని గణాంకాలు వెల్లడించాయి.

ఇప్పటికే స్టీల్, అల్యూమినియం, ఆటో, ఇతర రంగాలపై ట్రంప్ సుంకాలు వేశారు. ఫార్మా, చిప్స్, క్రిటికల్ మినరల్స్ దిగుమతులపై పలు విచారణలు జరుగుతున్నాయి. ఇక భారత్‌పై రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు అదనపు సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఈ నెల 27 నుంచి 50 శాతం సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో.. వీటి గడువును ట్రంప్ పొడిగిస్తారని తాను ఆశించడం లేదని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నరావో ఇప్పటికే పేర్కొన్నారు. గతంలో ట్రంప్ ప్రకటించినట్లుగా వచ్చే వారం కొత్త టారిఫ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

## నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనకండి

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలపై జైశంకర్ కౌంటర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలుచేశారు. దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేశారు. భారత్‌తో ఏదైనా సమస్య ఉంటే ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. రష్యా చమురు కొనుగోలు చేయడంవల్ల భారత్‌పై వస్తోన్న విమర్శల అంశాన్ని ప్రస్తావించారు. భారత్, అమెరికా వాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి. అయితే మాకంటూ కొన్ని ప్రయోజనాలున్నాయి. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. మా రైతులు, చిన్న ఉత్పత్తిదారుల ప్రయోజనాలను రక్షించడమే మాకు ప్రధానం. దీనిపై మేం రాజీపడే ప్రసక్తేలేదు. వ్యాపార అజెండాతో సాగుతున్న అమెరికా యంత్రాంగానికి మద్దతిస్తున్న కొన్ని దేశాలు ఇతరులపై నిందలు వేసే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం నిజంగా మీకు భారత్‌తో సమస్య ఉంటే మా చమురును, శుద్ధిచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయకండి అని జైశంకర్ అన్నారు. అంతేగాక ట్రంప్ అదనపు సుంకాలు ప్రకటించడానికి ముందే రష్యా చమురు అంశం గురించి అమెరికాతో తాము ఎలాంటి చర్చలు జరపలేదని వెల్లడించారు.

దేశ ప్రయోజనాలతో పాటు ప్రపంచ అవసరాలను దృష్టిలో ఉంచుకునే తాము మాస్కో నుంచి చమురును కొనుగోలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. 2022లో చమురు ధరలు భగ్గుమన్నాయి. దీంతో అంతర్జాతీయంగా ఆందోళన నెలకొంది. అప్పుడు రష్యా చమురును భారత్ కొనాలనుకుంటే అందులో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రపంచవ్యాప్తంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే దానివల్లే చమురు ధరలు స్థిరీకరిస్తాయని అందరికీ తెలుసు అని జైశంకర్ వివరించారు. మాస్కోతో తాము వాణిజ్యం పెంచుకోవాలని అనుకుంటున్నట్లు విదేశాంగమంత్రి తెలిపారు. అయితే ఉక్రెయిన్, రష్యా యుద్ధంపై ఇప్పటికే తమ వైఖరి స్పష్టంగా తెలియజేశామని, ఆ దేశాల ఉద్రిక్తతలు త్వరగా చల్లారాలని ఆకాంక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ విదేశాంగ విధానం గురించి జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడిలా విదేశాంగ విధానం విధానాన్ని ఇంత బహిరంగంగా నిర్వహించిన ఏ అధ్యక్షుడిని గతంలో మనం చూడలేదు. ఒక్క భారత్ విషంలోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలతో ఆయన డీల్ చేస్తున్న విధానం అనాదిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులకు చాలా దూరంగా ఉంది. ఇక, వాణిజ్య అంశాలతో పాటు వాణిజ్యేతర వ్యవహారాలకు టారిఫ్‌లను వినియోగించడం కాస్త కొత్తగా అనిపిస్తోంది అని కేంద్రం మంత్రి అన్నారు.

## యేడాదికి 50 రాకెట్లు ప్రయోగించగలమా?



### శాస్త్రవేత్తలకు ప్రధాని మోడీ ప్రశ్న!

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** అంతరిక్షరంగంలో వరుస విజయాలు భారత్‌కు అలవాటుగా మారాయని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. రేండేళ్ల క్రితం చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలు మోపిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు. 2040లో భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతకాన్ని ఎగురవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని మోడీ పునరుద్ఘాటించారు. భవిష్యత్‌లో ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించే స్థితికి మనం చేరుకోగలమా అని ఆయన అంతరిక్ష శాస్త్రవేత్తలను ప్రశ్నించారు. భవిష్యత్తులో ఆ విధంగా చర్యలు తీసుకోవడానికి ప్రణాళికలు రచించాలని కోరారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మోడీ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మానవాళి భవిష్యత్తును ప్రకాశవంతం చేసే రహస్యాలను చేధించడానికి మరింత లోతైన అంతరిక్ష పరిశోధనలకు సిద్ధం కావాలని భారత శాస్త్రవేత్తలకు ప్రధాని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న అంతరిక్ష పరిశోధనల కోసం, భవిష్యత్ మిషన్ల కోసం మరింతమంది వ్యోమగాములను తయారు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో యువత కూడా భాగం కావాలని పిలుపునిచ్చారు. ఏదీ మనకు చివరి సరిహద్దు కాదనే విషయాన్ని అంతులేని విశ్వం తెలియచేస్తోందని అదేవిధంగా భారత్ ఎటువంటి హద్దులు లేని విధంగా అంతరిక్ష రంగంలో ముందుకు వెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషితో త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించనున్నామని మరి కొన్నేళ్లలో సొంత స్పేస్‌స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేసుకుంటామని ప్రధాని పేర్కొన్నారు. అంతరిక్ష రంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రైవేట్ రంగం ముందుకు రావాలని కోరారు. 2040 నాటికి చంద్రుడిపై తొలిసారిగా భారత వ్యోమగామిని దించుతామని సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథన్ ఇటీవల వెల్లడించారు.

రోదసి యాత్రలకోసం నలుగురు వ్యోమగామి అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. వీరంతా భారత వైమానిక దళానికి చెందిన టెస్ట్ పైలట్లు అని వివరించారు. గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా రోదసి అన్వేషణలో తదుపరి అంకాన్ని ఇస్రో చేపట్టనుందని తెలిపారు. దీనికింద ఇద్దరు లేదా ముగ్గురు భారత వ్యోమగాములను దిగువ భూకక్ష్యలోకి పంపుతామన్నారు. మూడు రోజుల తర్వాత వారు భూమికి తిరిగొస్తారని చెప్పారు. వీరు ప్రస్తుతం బెంగళూరులోని వ్యోమగామి శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందుతున్నారని తెలిపారు. శుక్రుడి కక్ష్యలోకి ఉపగ్రహాన్ని, అంగారకుడి పైకి ల్యాండర్‌ను ప్రయోగించడానికి చర్యలు తీసుకోవాలని మోడీ సూచించారని పేర్కొన్నారు.

## ఉత్తరాఖండ్‌లో మళ్లీ క్లౌడ్ బరస్ట్‌తో భారీ వర్షాలు





### పలువురు గల్లంతు

**చమోలీ, ఆగస్టు 23:** ఉత్తరాఖండ్‌ను మళ్లీ భారీ వర్షాలు చుట్టుముట్టాయి. తాజాగా చమోలీ జిల్లాలో థరలీలో కురిసిన భారీ వర్షం కారణంగా వరదలు సంభవించాయి. ఫలితంగా అనేక నివాస ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. లెక్కలేనన్ని వాహనాలు బురదలో కూరుకుపోయాయి. విద్యాసంస్థలు మూసివేశారు. వరదల కారణంగా పలువురు గల్లంతైనట్లు సమాచారం. ఈ విపత్తుపై సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తక్షణం వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకొని సహాయక చర్యలు మొదలుపెట్టాయి. వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్ ధామి ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'చమోలీ జిల్లాలోని థరాలి ప్రాంతంలో క్లౌడ్‌బరస్ట్ సంభవించింది. జిల్లా యంత్రాంగం, ఎస్‌డిఆర్ఎఫ్, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపడుతున్నారు. తాను స్థానిక పరిపాలన అధికారులతో నిరంతం సంప్రదిస్తూ పరిస్థితి పర్యవేక్షిస్తున్నాను. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నానని' అన్నారు.

ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వర్షాల కారణంగా సంభవించిన విపత్తుకు చాలామంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది ఇళ్ల ధ్వంసమయ్యాయి. అనేక అనుసంధాన రహదారులు మూసుకుపోవడంతో ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంతలో ఈ నెల 22 నుంచి 25 వరకు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో రెడ్ అలర్ట్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. పిథోరగఢ్, బాగేశ్వర్ జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. భారత వాతావరణశాఖ తెలిపిన సమాచారం ప్రకారం అతి స్వల్ప సమయంలో భారీ వర్షాలకు దారితీయడాన్నే క్లౌడ్‌బరస్ట్ అని అంటారు.

ఉత్తరాఖండ్‌లో ఇటీవల కూడా వరదలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఒక్కసారిగా విరుచుకుపడ్డ ఆకస్మిక వరదలతో ఉత్తర కాశీ అల్లకల్లోలమైంది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ఉన్న థరాలీ గ్రామం సగభాగం తుడిచిపెట్టుకుపోయింది. అక్కడి ఇళ్లు, కార్లు, చెట్లు వరదల్లో కొట్టుకుపోయాయి. ఈ నెల మొదటి వారంలో ఖీర్ గంగానదీ పరీవాహక ప్రాంతంలో మేఘ విస్ఫోటంతో ఒక్కసారిగా విరుచుకుపడిన బురదతో కూడిన వరద.. అతివేగంగా థరాలీ గ్రామంలోకి దూసుకొచ్చింది. దీంతో 3, 4 అంతస్తుల భవనాలు కూడా పేకమేడల్లా కుప్పకూలి వరదలో కొట్టుకుపోయాయి.

## పార్లమెంట్‌లో 'నంబర్ 1' చెట్టు.. భద్రతకు అడ్డు!



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** పార్లమెంట్‌లో ఓ చెట్టు వివిఐపిల భద్రతకు సవాల్‌గా మారింది. గజ ద్వారం వద్ద ఉన్న ఆ వృక్షంతో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఆ చెట్టును మరో చోటుకు మార్చేందుకు భద్రతా సిబ్బంది సన్నాహాలు ప్రారంభించారు. కొత్త పార్లమెంట్ భవనం లోని ఆరు ప్రవేశ మార్గాల్లో గజద్వారంఒకటి. ప్రధాని నరేంద్రమోడీ తరచూ ఈమార్గంనుంచే సభకు వెళుతుంటారు. ఈ గేటువద్ద ఓ పసుపు పూల చెట్టు ఉంది. నంబర్ 1గా పేర్కొనే ఈ చెట్టు విపరీతంగా పెరిగి ఈ ప్రాంతంలో భద్రతకు అడ్డంకిగా మారింది. వివిఐపిలు వెళ్లే మార్గంలో ఈ చెట్టువల్ల భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతుండడంతో దీన్ని ఇక్కడి నుంచి మార్చాలని స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ భావించింది. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కు వివరించింది. అయితే, ఈ చెట్టును తొలగించాలంటే ఢిల్లీ అటవీ శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. దీంతో ఆ భద్రతా సిబ్బంది ఆ ప్రక్రియను ప్రారంభించారు. ఇందుకోసం ఇప్పటికే అటవీశాఖ వద్ద రూ.57వేల సెక్యూరిటీ డిపాజిట్‌ను జమచేశారు. వచ్చేవారం పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణ స్థల్ వద్దకు దీన్ని మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చెట్టును తరలిస్తున్నందుకు పరిహారంగా సిపిడబ్ల్యూడి పార్లమెంట్ ప్రాంగణంలోనే మరో 10 మొక్కలు నాటాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు వెల్లడించారు. కాగా శుక్రవారం ఉదయం పార్లమెంట్ వద్ద భద్రతా ఉల్లంఘన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రెడ్‌క్రాస్ రోడ్డులోని ఐజి–2 గేటు వద్ద ఉన్న చెట్టు ఎక్కి ఓ వ్యక్తి పార్లమెంట్ ప్రాంగణంలోకి చొరబడ్డాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అరెస్టుచేశారు. నిందితుడి మానసిక పరిస్థితి సరిగా లేదని ప్రాథమికంగా నిర్ధారించారు.

# సంక్షిప్తంగా..

## ట్రంప్ దెబ్బతో తగ్గిన వలసలు



**వాషింగ్టన్, ఆగస్టు 23:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలు.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యతును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునేవారి సంఖ్య తగ్గిపోతోంది. ఇదే విషయాన్ని ప్యూ రీసెర్చ్ సెంటర్ నివేదిక వెల్లడించింది. ఈ యేడాది జనవరి నుంచి జూన్ మధ్య వలస జనాభా 15 లక్షలు తగ్గింది. దాంతో ఇమిగ్రెంట్స్ సంఖ్య 53.3 మిలియన్ల నుంచి 51.9 మిలియన్లకు పడిపోయింది. 1960 తర్వాత ఇలా వలసదారుల సంఖ్య క్షీణించడం ఇదే తొలిసారి కావడం గమనర్హాం. ఇది అనుహ్య మార్పును సూచిస్తోందని ప్యూ రీసెర్చ్ సెంటర్ డెమోగ్రాఫర్ జెఫ్రె పస్సెల్ మీడియాకు వెల్లడించారు. ఈ క్షీణత లేబర్ మార్కెట్‌పై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'అమెరికా జనాభాలో పనిచేసే వయసున్న వ్యక్తుల సంఖ్య పెరగడం లేదు. అలాంటప్పుడు ఆ దేశానికి వలసల నుంచే శ్రామికశక్తి లభిస్తుంది. ఈ శ్రామికశక్తి పెరగపోతే.. ఆర్థిక వ్యవస్థకు కష్టమే' అని జెఫ్రె అభిప్రాయపడ్డారు. సరిహద్దుల నుంచి అక్రమంగా దేశంలోకి ప్రవేశించి వారి సంఖ్యను కట్టడి చేసేందుకు బైడెన్ హయాంలో చర్యలు తీసుకోవడంతో 2024 నుంచే ఈ మార్పు కనిపిస్తున్నప్పటికీ.. ట్రంప్ కఠిన వైఖరితో అది భారీగా పెరిగింది. అనధికారిక వలసల సంఖ్య కూడా తగ్గిందని నివేదిక పేర్కొంది. మాస్ డిపోర్టేషన్లు, బహిష్కరణను తప్పించేందుకు ఉన్న రక్షణలు తొలగించడమూ ఈ సంఖ్య తగ్గడానికి కారణమని వెల్లడించింది.

## అనిల్ అంబానీ కంపెనీల్లో సిబిఐ సోదాలు

**ముంబై, ఆగస్టు 23:** ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీకి మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్యాంక్ మోసం కేసులో రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్‌కు సంబంధించిన కంపెనీలు, ఇతర ప్రాంతాల్లో సిబిఐ శనివారం సోదాలు చేపట్టిందని సంబంధిత అధికారులు మీడియాకు వెల్లడించారు. అనిల్ గ్రూప్ కంపెనీలు పలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అవకతవకలకు పాల్పడ్డాయనే ఆరోపణలపై ఆయనపై కేసు నమోదైంది. దాంతో ఇప్పటికే ఆయన కార్యాలయాల్లో ఇడి సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండు వారాల క్రితం ఆయనను 10 గంటలపాటు ప్రశ్నించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ. 2 వేల కోట్ల మేర మోసం కేసులో తాజాగా సిబిఐ సోదాలు నిర్వహించింది. నష్టాల్లో చిక్కుకున్న టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని కొన్ని నెలల క్రితం మోసపూరిత చర్య అని ఎస్‌బిఐ నిర్ణయించింది. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం.. ఏదైనా ఒక బ్యాంకు, ఒక ఖాతాను 'మోసపూరితమైంద'ని వర్గీకరించాక, ఆ విషయాన్ని 21 రోజుల్లోగా ఆర్‌బిఐకి తెలిపాలి. కేసును సిబిఐ లేదా పోలీసులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే సిబిఐ కేసు నమోదు చేసింది.

## అమెరికాకు తాత్కాలికంగా పోస్టల్ సేవలు నిలిపివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** అమెరికా ప్రభుత్వ కొత్త ఆదేశాల నేపథ్యంలో భారత్ నుంచి అమెరికాకు వెళ్లే పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని భారత డాక్ శాఖ నిర్ణయించింది. అమెరికా ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ నంబర్–14324 ప్రకారం, ఈనెల 29వ తేదీ నుంచి 800 డాలర్లవరకు ఉన్న వస్తువులపై ఉన్న డ్యూటీఫ్రీ సదుపాయాన్ని రద్దు చేశారు. దీంతో ఇకపై అమెరికాకుపంపే ప్రతి సరకుపైనా కస్టమ్స్‌డ్యూటీ విధించబడుతుంది. అయితే 100 డాలర్ల లోపు గిఫ్ట్‌ఐటమ్స్, లేఖలు, డాక్యుమెంట్లు మాత్రం మునుపటిలాగే ఉంటాయని తెలిపారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఇప్పటికే కొన్నిమార్గదర్శకాలు విడుదలచేసింది. కానీ కస్టమ్స్ డ్యూటీ వసూలు విధానం, టెక్నికల్ ప్రాసెస్ ఇంకా స్పష్టంగా లేవు.

## సహజీవనం చేస్తున్న వ్యక్తిని హత్య చేసిన మహిళ

**జైపూర్, ఆగస్టు 23:** సహజీవనం చేస్తున్న వ్యక్తి మద్యానికి బానిస అయ్యాడు. అతడి తాగుడు అలవాటును ఆమె భరించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తిని తాడుతో కట్టేసింది. గొంతు నొక్కి హత్య చేసింది. రాజస్థాన్‌లోని ఝలావర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. హారక్‌చంద్ లోధా (32) తనభార్య, పిల్లలనువదిలేశాడు. రేఖ (30)తో కలిసి ఆరునెలలుగా సహజీవనం చేస్తున్నాడు. కాగా, హారక్‌చంద్ నిత్యం మద్యం సేవించి వచ్చి రేఖతో గొడవపడేవాడు. అయితే అతడి తాగుడును ఆమె భరించలేకపోయింది. ఈ నెల 21న రాత్రి వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో మద్యంమత్తులో ఉన్న హారక్‌చంద్ చేతులు, కాళ్లను తాడుతో రేఖ కట్టేసింది. ఆ తర్వాత గొంతునొక్కి అతడ్ని హత్య చేసింది.

# సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## యుఎస్‌పిసి మహాధర్నాలో వక్తల డిమాండ్



శనివారం ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకో వాలని యుఎస్‌పీసీ మహాధర్నాలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ నాగేశ్వర్, ఏ.నర్సి రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, అరుణోదయ విమలక్క, పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు ఎల్.అరుణమ్మ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశించారని, కానీ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచిపోతున్నా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం జాప్యాన్ని ప్రదర్శిస్తోందని ఆరోపించారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను సైతం అమలుపరచటం లేదని విమర్శించారు. విద్యాశాఖలో ఎన్జీవోల జోక్యాన్ని నివారించాలని, నూతన జిల్లాలకు డిఈఓలను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటి ఈఓను, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూపీఎస్పీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, సిహెచ్ అనిల్‌కుమార్, ఎం.సోమయ్యలు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సమస్యలు పరిష్కారం కాలేదని, అందుచేతనే ఉద్యమ కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం భవిష్యత్తులో ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు.

# సుదర్శన్‌రెడ్డిపై ఆరోపణలు తగదు: మాజీమంత్రి జీవన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** నక్సల్ సానుభూతి పరుడిగా సుదర్శన్ రెడ్డిపై బిజెపి నేతల ఆరోపణలు చేయడం తగదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు.గాంధీ భవన్ మీడియా సమావేశం శనివారం మాట్లాడుతూ ఇండి కూటమి అభ్యర్థికి వస్తున్న ఆదరణ చూసి బీజేపీ నేతలు బెంబేలెత్తి పోతున్నారనిచెప్పారు. రాజ్యాంగ ఉప రాష్ట్రపతి ఉప ఎన్నికల్లో ఇండి కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి రోజురోజుకు పార్టీలకు అతీతంగా ఆదరణ మద్దతు పెరుగుతుండటంతో తట్టుకోలేక బీజేపి నేతల అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. హింసకు హింస సమాధానం కాదని సుదర్శన్‌రెడ్డి భావిస్తారన్నారు. రాజ్యాంగ విలువలు ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి ఉన్న వ్యక్తి సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం పట్ల హర్షం వ్యక్తం చేయాల్సింది పోయి ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. సుదర్శన్ రెడ్డి సోషలిస్టు భావాలు గల వ్యక్తి అని, ఆయన అభ్యర్థిత్వం పట్ల ఆత్మ ప్రబోధానికి అనుగుణంగా మద్దతివ్వాలని కోరారు. తీవ్రవాదాన్ని వ్యతిరేకించే పార్టీల్లో కాంగ్రెస్ ప్రథమస్థానంలో ఉంటుందని చెప్పారు.

## బిసి సంక్షేమంలో పదోన్నతులు

# 13 మంది జిల్లా అధికారులకు ఛాన్స్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వారిలో 13 మంది జిల్లా బీసీ సంక్షేమాధికారులకు ప్రమోషన్లు లభించాయి. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవన్నీ అడ్ హాక్ బేసిస్‌లో ఉంటాయని ప్రకటించారు. కాగా, జూన్ నెలాఖరున 13 మందికి ప్రమోషన్లు ఇచ్చేందు కు జిల్లా పదోన్నతుల కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. అయితే, ప్రమోషన్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు తాజాగా పదోన్నతుల కల్పిస్తూ కీలక నిర్ణయం తీసున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురు జిల్లా అధికారులు పదవీ విరమణ చేసే రోజునే పదోన్నతులు లభించాయి. మిగిలిన 11 మందికి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని మల్టీజోన్ పరిధి 1లో ఆరుగురు, మల్టీ జోన్ పరిధి 2లో ఐదుగురికి ప్రమోషన్లు లభించాయి. ఈ పదోన్నతులు పొందిన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికార్లలో భూపాలపల్లి జిల్లా అధికారి ఇందిర, సిరిసిల్ల జిల్లా అధికారి సంపూర్ణ, సిద్దిపేట్ జిల్లా అధికారి సయ్యద్ రఫీక్, బిసి కమిషన్‌లో పనిచేస్తున్న అధికారి సునీత, కొత్తగూడెంజిల్లా అధికారి విజయ లక్ష్మి, కామారెడ్డి జిల్లా అధికారి కె.జైరాజు, వనపర్తి జిల్లా అధికారి ముజాహిద్ ఖాన్, సూర్యాపేట్ జిల్లా అధికారి నర్సింహులు, గద్వాల జిల్లా అధికారి అక్బర్ పాషా, వికారాబాద్ జిల్లా అధికారి మాధవ్‌రెడ్డి, జనగామ జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి లక్ష్మి నరసింహారావుకు పోస్టింగులు ఇచ్చారు.

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తి చేయాలి

## వ్యవసాయ మంత్రి తుమ్మల



**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని నర్మెట్టలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తి చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అలాగే కల్లూరుగూడం, బీచుపల్లిలో జరుగుతున్న ఆయిల్ పామ్ మిల్లుల నిర్మాణ పనులను వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తి చేయాలన్నారు. హైదరాబాద్ సచివాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ అనుకున్న స్థాయిలో జరగకపోవడం పట్ల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలలో పురోగతి కొంతమేర ఉందని, ముఖ్యంగా భువనగిరి, నారాయణపేట, గద్వాల, జనగామ, సిద్దిపేట జిల్లాలలో చాలా తక్కువ స్థాయిలో ప్లాంటేషన్ జరిగిందని వాటిని త్వరితగతిన చేయాలన్నారు. ఈ ఏడాది లోగా అన్ని కంపెనీలు కలిపి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 1.25 లక్షల ఎకరాలలో ప్లాంటేషన్ పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే భవిష్యత్తులో ప్రతి జిల్లాలో కనీసం 1 లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలు సాగులో ఉండేలా ప్రణాళిక చేసుకోవాలని స్పష్టం చేశారు. కూలీల ఖర్చు తగ్గించుకోవడానికి ఫర్టిగేషన్ పద్ధతిలో ఎరువుల యాజమాన్యం చేసుకోవడంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నర్సరీ స్థాయిలోనే కల్లింగ్ మొక్కలను నిర్మూలించాలని ఆయిల్ పామ్ మొక్కలకు కొరత లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ గెలలను కోసేందుకు రైతులకు మలేషియా ఫైబర్ స్టిక్స్‌ను అమ్మకాలకు మరియు కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా గడ్డిని తొలగించే యంత్రాలు (స్లాషర్స్), ఆయిల్ పామ్ కోత అనంతరం వచ్చే ఆకుల వ్యర్థాలను పొడిగా చేసే యంత్రాలు (ష్రెడ్డర్స్) అద్దెకు ఇచ్చేట్టు రైతులకు అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. గత 10సంవత్సరాలుగా జరిగిన ఖర్చులపై ఆడిట్ నిర్వహించి, ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి,హార్టికల్చర్ సంచాలకులు యాస్మిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# 25 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే..

## రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన

## తెలంగాణా కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ



శనివారం జరిగన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, పల్లెరవికుమార్‌గౌడ్, ఐలి వెంకన్నగౌడ్, బాలరాజుగౌడ్ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో గౌడ్‌లకు ఇచ్చిన హామీ లను నెరవేర్చాలని జీవో 93 సవరించి వైన్స్‌లల్లో 15 శాతం ఉన్న రిజర్వేషన్లు 25శాతానికి పెంచాల్సిందేనని లేకుంటే ఈనెల 25నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ హెచ్చరించింది. ఈమేరకు శనివారం హైదరాబాద్ సోమజిగూడా ప్రెస్ క్లబ్ లో తెలంగాణా గౌడ కల్లుగీత వృత్తి దారుల సంఘం అధ్యక్షుడు ఐలి వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజు గౌడ్‌తో పాటురాష్ట్రంలోని వివిధ సంఘాల నాయకులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎన్నో హామీలిచ్చారని జీవోల ద్వారా అయ్యే పనులు కూడా రేవంత్ ప్రభుత్వం చేయడం లేదన్నారు. 21 నెలల కాంగ్రెస్ పాలనలో గీత కార్మికులు చాలా మంది ప్రమాదశావత్తు మరణించారని పన్నెండు కోట్ల రూపాయల మేర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాల్సి ఉన్నా చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఈసందర్భంగా ఉమ్మడి కార్యాచరను శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఈనెల 25న ట్యాంక్‌బండ్ వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి వనతిపత్రం ఇవ్వడం జరుగుతుందని ఆతర్వాత 30న నదనం, ఖిలాషాపూర్‌లకు వందకార్ల ర్యాలీతో వెళ్తామన్నారు. ఆతర్వాత ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడి, జిల్లా ల్లో గౌడ్‌సంఘాల సభలు నిర్వహించి అనంతరం ఇందిరాపార్కు వద్ద గౌడమహా ధర్నా, ఆతర్వాత 5లక్షల మందితో పరేడ్‌గ్రౌండ్‌లో గౌడ ఆత్మ గౌరవ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కలకలం

# విభేదాలతో పిల్లల మీద ప్రయోగాలు చేస్తే కఠిన చర్యలు

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### తాగునీటిలో మోనో కలపడంతోనే విద్యార్థులకు అస్వస్థత

### ఉపాధ్యాయుడు రాజేందర్‌తో పాటు వేణు, సూర్య ప్రకాష్, వంట మనిషి రాజేశ్వరి సస్పెన్షన్

### వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శిస్తున్న అధికారులు తదితరులు

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** విభేదాలతో పిల్లల మీద ప్రయోగాలు చేస్తే కఠిన చర్యలతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో శుక్రవారం కలుషిత మంచినీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఘటనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో జరుగుతున్న అనేక విషయాలను వెల్లడించారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రాజేందర్ మంచినీటిలో మోనో పురుగుల మందు కలపడంతో విద్యార్థులు ఆ నీటిని తాగి అస్వస్థతకు గురయ్యామని తెలిపారు. ఉపాధ్యాయులు తమను నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇష్టం వచ్చినట్లు కొడుతున్నారని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు మధ్య తరచూ జరుగుతున్న గొడవలే దీనికి కారణమని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాల సైన్స్ టీచర్ రాజేందర్ మంచినీటి ట్యాంకులో మోనో పురుగుల మందు కలిపి అనుమానం రాకుండా చేసేందుకు అనంతరం దాన్ని విద్యార్థుల దుప్పట్లపై చల్లాడని తెలిపారు. చూసిన విద్యార్థులను బెదిరించి ఈ విషయం బయటికి చెప్తే కొడతానని హెచ్చరించాడని తెలిపారు. రాజేందర్ ఎవరికి అనుమానం రాకుండా అస్వస్థత గురైన విద్యార్థులతో పాటు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చేరి వైద్య సేవలు పొందుతున్నాడని తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులను, వంట మనిషిని సస్పెండ్ చేయడంతో పాటు చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు సత్యనారాయణ రావు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మంచినీటిలో పురుగుల మందు కలిపిన ఉపాధ్యాయుడు రాజేందర్‌తో పాటు వేణు, సూర్య ప్రకాష్, వంట మనిషి రాజేశ్వరిని తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఉద్యోగం నుండి తొలగించడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థులను పరామర్శిం చారు. 24 గంటలు నిరంతరాయ వైద్య సేవలు అందించాలని, వైద్యుల పర్యవేక్షణ ఉండాలని ఎమ్మెల్యే వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ్మ, డీఈఓ రాజేందర్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త లబ్ధిదారులకు సన్నబియ్యం

## 19,7621.368 మె.టన్నుల కేటాయింపు

**హైదరాబాద్,ఆగస్టు 23,ప్రభాతవార్త:** కొత్తగా రేషన్ కార్డులు పొందినవారు, పాత కార్డుల్లో నూతనంగా పేర్లు నమోదైన వారందరికీ సెప్టెంబరు రేషన్ బియ్యం పంపిణీకి రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ యంత్రాంగం సన్నద్ధం అవుతోంది.రాష్ట్రంలోని లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందించడానికి 19,7621.368 మె.ట బియ్యం మండల స్టాక్ పాయింట్లకు చేర్చారు.జూన్ నెలలో మూడు నెలల రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఒకే సారి పంపిణీ చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 4,92,395 కొత్త రేషన్‌కార్డులు జారీ చేశారు.15లక్షలకు పైగా కొత్తగా కుటుంబంలో పెరిగిన లబ్ధిదారులను పాతకార్డుల్లో చేర్చినారు. రాష్ట్రంలో పెరిగిన ఆహార భద్రత కార్డుల్లోని సభ్యుల సంఖ్యకనుగుణంగా సన్నబియ్యం పంపిణీ చేయాల్సి ఉండటంతో ఆ మేరకు పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుత రేషన్‌కార్డులకు అనుగుణంగా, మండలస్థాయి గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యానికితోడు అదనంగా కావాల్సిన బియ్యం సరఫరా జరుగుతోంది. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన కోటాకు సంబంధించిన డైనమిక్ కీ రిజిస్టర్ను విడుదల చేశారు. జనవరి నుంచి కొత్తకార్డులు, సభ్యుల చేర్పులు ప్రారంభమైనప్పటికీ జూన్ నెల తదుపరి కొత్తగా కార్డులు తీసుకున్నవారు, యూనిట్లలో లబ్ధిదారులు మూడు నెలల బియ్యాన్ని పొందలేకపోయారు ఈ వ్యవధిలో పెరిగిన కార్డులకను గుణంగా బియ్యం కోటాను పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నంచి పదేళ్ళుగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డుల జారీ తెర తీసింది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు,పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయం ఉన్న వారే అర్హులుగా నిర్ణయించింది.ఈ మేరకు అన్నింటినీ పరిశీలించి కార్డులు మంజూరు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా డీలర్లకు ఈనెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బియ్యం చేరిన తర్వాత వచ్చేనెల మొదటి వారంలో పంపిణీ ప్రారంభమవుతుంది. మెదక్ జిల్లాలో కొత్తకార్డులు 15,863 కాగా కొత్తగా పాతకార్డులో చేరిన కుటుంబసభ్యులు 33,354 మంది. వీరికి 327.210 మె.ట బియ్యం అందించాల్సిఉంటుంది.మొత్తం కార్డులు 2,32,579 ఉండగా, 7,65,244సభ్యులు ఉన్నారు.వీరికి 4,850.008 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని మెదక్ అధికారులు గుర్తించారు. కామారెడ్డి జిల్లాలో జిల్లా వ్యాప్తంగా 26,521 కొత్త కార్డులు పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 4,66,552 రేషన్ కార్డులున్నాయి.రాష్ట్రరాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో లక్ష కుటుంబాలకు కొత్తగా లబ్ధి కలగబోతున్నది. నగరంలో 60లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు.ఆదిలాబాద్ జిల్లాలో కొత్తకార్డు దారులకు వచ్చే నెలనుంచి 255మె.ట బియ్యంఅదనంగా కేటాయించాలని నిర్ణయించారు. ఖమ్మంజిల్లాలో 4,11,143 కార్డులు గతంలో ఉండగాకొత్తగా 4527588 పెరిగింది. బియ్యం కోటా 7,273.164 మె.ట నుంచి 8145.723 మె.ట బియ్యం కోటాను పెంచారు. కొత్తగా872.559 మె.టబియ్యం కోటా అదనంగా విడుదలచేశారు. ఇలా ప్రతి జిల్లాలో మదింపు చేసి కొత్తగా అదనపు స్టాక్ విడుదలచేశారు. మండల స్థాయిలో పేర్ల నమోదు, తొలగించే ప్రక్రియలో రెవెన్యూ అధికారులు తమ చుట్టూ తిప్పుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## బ్లేడ్‌లను మింగిన ఆటో డ్రైవర్

# ప్రాణాలు కాపాడిన గాంధీ వైద్యులు

**సికింద్రాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** మౌలాలికి చెందిన ఆటోడ్రైవర్ రియాజుద్దీన్ మానసిక స్థితి సరిగా లేక మింగిన బ్లేడ్‌లను గాంధీ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న రియాజుద్దీన్ ఈ నెల 16న మింగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రియాజుద్దీన్ ను పరీక్షించిన జనరల్ సర్జరీ విభాగం వైద్యులు ఆహారం ఇవ్వకుండా కేవలం మందులు ఫ్లూయిడ్స్ ఇస్తూ వచ్చారు. ముందుగా ఎండోస్కోపీ ద్వారా బ్లేడ్లను బయటకు తీయాలనుకున్నా, వాటిని తొలగించే క్రమంలో కడుపులో అన్నవాహిక, జీర్ణాశయం, పేగులకు గాయాలయ్యే ప్రమాదం ఉండే వీలుందని భావించిన వైద్యులు అబ్జర్వేషన్లో ఉంచి వైద్యం చేశారు. అయితే అదృష్టశాత్తు జీర్ణాశయంలో ఎటువంటి గాయాలు కాలేదు. చివరికి మలద్వారం ద్వారా రియాజుద్దీన్ మిగిన 7 బ్లేడ్లు పడిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో క్లిష్టమైన ఈ సమస్యకు అరుదైన వైద్యం అందించి రోగి ప్రాణాలను కాపాడిన వైద్యులు అభినందనలు అందుకున్నారు.

# 24, 25 తేదీల్లో దోస్త్ ఇంట్రా కాలేజ్ ఫేజ్-2

## 26న సీట్ల కేటాయింపు,దోస్త్ కన్వీనర్ చైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 23:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఇంట్రా కాలేజ్ ఫేజ్-2కి అవకాశం కల్పించారు. ఈ నెల 24, 25 తేదీల్లో విద్యార్థులకి ఇంట్రా కాలేజ్ ఫేజ్-2 ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించినట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జులై 9, 10తేదిల్లో ఇంట్రా కాలేజ్ ఫేజ్-1కి అవకాశం కల్పించగా.. జులై 11న సీట్ల కేటాయింపు చేశారు. ఇప్పుడు దోస్త్ స్పెషల్ ఫేజ్ ముగిసిన తరువాత ఇప్పుడు ఇంట్రా కాలేజ్ ఫేజ్-2కి అవకాశం కల్పించారు. ఇప్పటివరకు మొదటి, రెండు, మూడు విడతలతో పాటు స్పెషల్ ఫేజ్‌లోనూ కాలేజీల్లో చేరిన విద్యార్థులు ఇంట్రా కాలేజ్ ఫేజ్-2లో ఆప్షన్లు ఇవ్వడానికి అర్హులని పేర్కొన్నారు.

# పంట రుణాల్లో నాబార్డు కోత

## లక్ష్యాలకే కేటాయింపులు పరిమితం

## సాగు పెరుగుతున్నా మంజూరు అంతంతే

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** పంట రుణాల విషయంలో జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ఎంచుకున్న లక్ష్యాలు క్షేత్ర స్థాయిలో అందుకోవడం లేదు. ఇదే సమయంలో రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు కొన్నేళ్లుగా గణనీయంగా పెరుగుతుండగా, అందుకు అనుగుణంగా రైతుకు ఇచ్చే రుణాల విషయంలో మాత్రం బ్యాంకులు లక్ష్యాలకు దూరంగానే ఉంటున్నాయి. 2025-26 సంవత్సరానికిగాను తెలంగాణలో 3.86 లక్షల కోట్ల రూపాయలను రుణాలుగా ఇవ్వగలనే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఇందులో కేవలం పంటలకు సంబంధించి పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ నిమిత్తం 87,149 కోట్ల రూపాయలను మాత్రమే కేటయింపులు జరిపింది. ఈ మొత్తం 2024-25లో పెట్టుకున్న రూ.90,794 కోట్ల లక్ష్యం కంటే 3,645 కోట్ల రూపాయలు తక్కువ కావడం విశేషం. ఇక పంటలకు సంబంధించి ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్‌కు 2024-25 లక్ష్యాని కన్నా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3,645 కోట్ల రూపాయలను తక్కువగా రుణఅంచనాగా కేటాయింపులు జరిపినట్లు వెల్లడించినప్పటికీ నాబార్డ్ అంతకుముందు మూడేళ్ల కూడా పంటలకు ఇచ్చే రుణాల విషయంలో లక్ష్యాలను చేరుకోలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 73,437 కోట్ల రూపాయల మేర రుణ లక్ష్యం విధించుకోగా 64,939 కోట్ల రూపాయల చొప్పున మాత్రమే రుణాలను మంజూరు చేశాయి. అంటే 8,500 కోట్ల రూపాయలు తక్కువ ఇచ్చింది. అలాగే 2024-25లో 90,794 కోట్ల రూపాయల లక్ష్యంగా పెట్టుకోగా, ఇందులో 70శాతం మాత్రమే రుణాలు మంజూరయ్యాయి. 2021-22లో పంట రుణాల కింద 59,440 కోట్ల రూపాయలు లక్ష్యంగా నిర్ణయించుకొని కేవలం 42,854 కోట్లు రూపాయలను మాత్రమే మంజూరు చేసింది. 2022-23లో 67,764 కోట్ల రూపాయల లక్ష్యాలకు గాను 59,060 కోట్ల రూపాయలు వరకే పంపిణీ చేసింది.

# రాష్ట్రాభివృద్ధిలో బిజెపి ఎంపిల సహకారం ఎప్పుడూ ఉంటుంది

## మంత్రి పొంగులేటితో బిజెపి ఎంపి ఈటల రాజేందర్ సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భారతీయ జనతా పార్టీ ఎంపిల సహకారం ఎప్పటికీ ఉంటుందని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. యూరియా కొరతపై రాజకీయం చేయకుండా రైతులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు. అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలన్నింటిని రెండు నెలల్లో పరిష్కరించాలన్నారు. శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఎంపి ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పలు వినతి పత్రాలు మంత్రికి అందజేశారు. ఈ సమావేశం అనంతరం సచివాలయ మీడియాపాయింట్‌లో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు విసిరి వేసినట్టు ఎక్కడో దూరంగా ఉన్నాయని, కేటాయింపులు సరిగాజరగలేదన్నారు. కరెంటు సౌకర్యం, రోడ్ల సౌకర్యం, డ్రైనేజీలు, లిఫ్టు సరిగా లేవని, ఈ సమస్యలు పరిష్కారం కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాస ఉండటం కష్టంగా ఉందన్నారు. రెండునెలల్లో పరిష్కారం చూపించాలని కోరడం జరిగిందన్నారు. దీనికి మంత్రి సుముకత వ్యక్తం చేశారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉంది అనేది మన ప్రధాని నరేంద్ర మోడీ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతమన్నారు.

# మరోసారి అధికారం కోసం ఓట్లను తగ్గించారు

## పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు



ఓటు బచావో ర్యాలీ నిర్వహించి అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న వి.హనుమంతరావు, చిత్రంలో డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** దేశంలో మరోసారి అధికారంలోకి రావాలనే కుట్రలో భాగంగా 65 లక్షల ఓట్లను తగ్గించారని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు.నేడు ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు, అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ సి.రోహిన్‌రెడ్డితో కలిసి శనివారం నగరంలో ఓటు బచావో ర్యాలీ నిర్వహించారు.అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా నుండి పటేల్‌నగర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం జరిగిన సభలో విహెచ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ మూడుసార్లు ప్రధాని కాగా మరో మారు ప్రధాని కావాలని దొంగ ఓట్లకు తెరతీశారని ఆరోపించారు. నరేంద్ర మోడీ మరోసారి పీఎం కావడం కాదు, ప్రజల మద్దతుతో ప్రజల ఓటు వేసుకోవడం గొప్పతనమన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని కావడానికి కేవలం 25 సీట్లు మాత్రమే తక్కువగా ఉందన్నారు.నేడు దేశంలో మోడీ, అమిత్ షా కలిసి 65 లక్షల ఓట్లను తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారికి పాదయాత్ర చేపట్టి ప్రజల మన్ననలు పొందిన గొప్ప నాయకుడని కొనియాడారు. న్యాయం కోసం పోరాడితే రాహుల్ గాంధీని అరెస్టు చేస్తామని బెదిరించడం సరికాదని హెచ్చరించారు. దేశంలో ఇప్పటికైనా దొంగ ఓట్లను గుర్తించి నిజమైన నాయకుడిని గెలిపిస్తే బాగుపడుతుందని వీహెచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపీసీసీ ఉపాధ్యక్షులు ముజాహిద్ ఖాన్ అప్సర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్,శంభుల శ్రీకాంత్‌గౌడ్,పులి జగన్, దిండి రాంబాబు, గరిగంటి రమేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు?: కోలేటి దామోదర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** యూరియా కోసం రైతులు మళ్లీ రోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితి కల్పించడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు అంటూ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఎద్దేవా చేశారు. కెసిఆర్ ప్రభుత్వంలో యూరియాకు ఈ గోస లేదని, కాంగ్రెస్ వచ్చాక నీళ్లు లేవు, యూరియా లేదు అంటూ రైతులు వాపోతున్నారని శనివారం ఓ ప్రకటనలోతెలిపారు. వర్షాలు మొదలైనప్పటికీ ఇంతవరకు యూరియా అందుబాటులో లేకపోవడంతో ఎరువుల దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న రైతుల ఆగ్రహం నానాటి పెరుగుతూనే ఉందని తెలిపారు. ఓటిపి విధానంతీసివేయాలనిడిమాండ్ చేస్తున్నప్పటికీ ఓటిపి పేరిట రైతులనువేదిస్తున్న అసమర్థప్రభుత్వమని ఆయన ధ్వజమెత్తారు.

# గణేశ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

## సెప్టెంబర్ 6న నిమజ్జనం

## భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి



**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** భాగ్యనగర్ గణేష్‌ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశీధర్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఉపాధ్యక్షులు వైకుంఠం గోవింద్ రాఠి, కార్యదర్శి మహేందర్, కోశాధికారి శ్రీరామ్మోతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్లో ఈ సారి 46వ సామూహిక గణేశ్ ఉత్సవాలు జరుగుతున్నాయని, సుమారు 1.40లక్షల గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల నుంచి నిమజ్జనం వరకు గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 18 ప్రభుత్వ విభాగాలను సమన్వయ పరుస్తూ నిర్వహిస్తున్నామని తెలిపారు. భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని మండపాల నిర్వాహకులను సూచించామని, స్వదేశీ ఉత్పత్తులను వాడాలని అవగాహన కల్పిస్తా మన్నారు. సెప్టెంబర్ 6న నిమజ్జనం నిర్వహిం చాలని నిర్ణయిం చామని, 303 కిలోమీటర్ల పరిధిలో శోభాయాత్ర జరుగుతుం దన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు 160 గణేష్ యాక్షన్ టీమ్లను సిద్ధం చేశామని తెలిపారు.

# నవంబర్ 7న మాలల రణభేరి సభ: జి.చెన్నయ్య

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు గైడ్‌లైన్ పాటించకుండా రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాలల గొంతుకోసిదని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య విమర్శించారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ నవంబర్2లోగా రోస్టర్ పాయింట్లను సవరించి ప్రభుత్వం మాలలకు న్యాయంచేయకపోతే నవంబర్ 7న లక్షలాదిమందితో మాలల రణభేరి సభను నిర్వహించి హైదరాబాద్‌ను స్థంబింపజేస్తామని చెన్నయ్య హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బైండ్ల శ్రీనివాస్, సరళ, లలిత, సుధాకర్, రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శనివారం సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మిని ఓదార్చుతున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, డాక్టర్ కె నారాయణ, అజీజ్ పాషా

# జిఓ 28ని రద్దు చేయాలి

## సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 23:** తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం తెచ్చిన జివో 28ని రద్దు చేయాలని తెలంగాణ సిపిఎస్ యూనియన్ డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎస్ రద్దు కోసం శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్టు సిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జివో 28 ను రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాఠశాలల్లో, కార్యాలయాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్రానికి ప్రభుత్వ ఉద్యోగుల నుండి దాదాపు 17 వేల కోట్ల రూపాయలు ఎన్‌పిఎస్ ట్రస్ట్ వద్ద ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లోనే మేనిఫెస్టోలోను సిపిఎస్‌ను రద్దు పరచి పాత పెన్షన్‌ను పునరుద్ధరింప చేస్తున్నారు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గత కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పునరుద్ధరిచాయని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ పునరుద్ధరణ చర్యలు చేపట్టవలసిందిగా ప్రజా ప్రభుత్వానికి స్థితప్రజ్ఞ విజ్ఞప్తి చేశారు.

# మహారాష్ట్రలో పనికివెళ్తున్న వ్యక్తిపై కుక్కల మూకుమ్మడి దాడి

## కాన్పూర్‌లో యువతిపై కుక్కల దాడి, చెంపకు, ముక్కుకు 17 కుట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** దేశంలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయి. పనికి వెళ్తున్న ఒక వ్యక్తిపై ఏడు వీధి కుక్కలు ఒక్కసారిగా దాడికి తెగబడగా, అతడు చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలతో బయటపడ్డాడు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన మహారాష్ట్రలోని పింప్రి-చించ్‌వాడ్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. ఓ వ్యక్తి నిర్మానుష్యంగా ఉన్న వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా, ఏడు కుక్కల గుంపు ఒక్కసారిగా అతడిపై దూసుకొచ్చింది. వెంటనే తేరుకున్న ఆ వ్యక్తి, పక్కనే ఉన్న ఓ బైక్‌ను వాటికి అడ్డుగా పెట్టి తనను తాను కాపాడుకునే ప్రయత్నం చేశాడు. కుక్కలు వెనక్కి తగ్గకపోవడంతో, బైక్‌ను వాటిపైకి తోశాడు. అతడి అరుపులు విన్న స్థానికులు ఇళ్లలో నుంచి బయటకు రావడంతో కుక్కలు అక్కడి నుంచి పారిపోయాయి. అయితే, కాసేపటికే అవి మళ్లీ తిరిగి రావడంతో, ఈసారి బాధితుడు చేతికి దొరికిన ఓ చెక్క దుంగతో వాటిని తరిమికొట్టాడు. ఈ దాడిలో అతడికి ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన స్థానిక ప్రజలు, తమ ప్రాంతంలో వీధి కుక్కల బెడదను అరికట్టాలని మున్సిపల్ కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లోని శ్యామ్ నగర్‌లో ఈ నెల 20న కాలేజీకి వెళ్తున్న కుక్కల దాడి ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అలెన్ హౌస్ రుమా కాలేజీలో బీబీఏ చివరి సంవత్సరం చదువుతున్న వైష్ణవి సాహు (21) అనే విద్యార్థిని కాలేజీ ముగిశాక ఇంటికి బయలుదేరింది. ఆ సమయంలో శ్యామ్ నగర్ ప్రాంతంలో కొన్ని వీధికుక్కలు, కోతులు ఒకదానితో ఒకటి పోట్లాడుకుంటున్నాయి. ఈ గొడవ మధ్యలో ఉన్నట్టుండి మూడు కుక్కలు ఒక్కసారిగా వైష్ణవిపై దాడికి తెగబడ్డాయి. ఆమెను కిందపడేసి ముఖం, శరీరంపై తీవ్రంగా గాయపరిచాయి. ఈ దాడిలో వైష్ణవి కుడి చెంప రెండుగా చీలిపోగా, ముక్కుపైనా, ఇతర శరీర భాగాలపైనా తీవ్రమైన గాయాలయ్యాయి. ఆమె తప్పించుకుని పరుగెత్తేందుకు ప్రయత్నించినా, కుక్కలు వదలకుండా మళ్లీ రోడ్డుపైకి లాగి దాడి చేశాయి. ఆమె కేకలు విన్న స్థానికులు కర్రలతో పరుగెత్తుకొచ్చి కుక్కలను తరిమికొట్టారు. అప్పటికే తీవ్ర రక్తస్రావంతో ఉన్న వైష్ణవిని కుటుంబ సభ్యులు హుటాహుటిన కాన్షీరామ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమె చెంపకు, ముక్కుకు కలిపి మొత్తం 17 కుట్లు వేశారు. ప్రస్తుతం వైష్ణవి నోరు కదపలేని, ఆహారం తినలేని స్థితిలో ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితురాలి కుటుంబం, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేసింది.

# నిధుల్లో న్యాయబద్ధమైన వాటా ఇవ్వడం లేదు

## కేంద్ర సర్కారుపై తమిళనాడు సిఎం స్టాలిన్ ధ్వజం

**చెన్నై, ఆగస్టు 23:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మరోసారి కేంద్రం సర్కారుపై, అధికార బిజెపిపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పాలనను చిక్కుల్లోకి నెడుతోందని, నిధుల్లో న్యాయబద్ధమైన వాటాను ఇచ్చేందుకు నిరాకరిస్తోందని ఆరోపించారు. తమిళనాడులోని రాజకీయాలన్నీ సామాజిక న్యాయానికి సంబంధించిన రాజకీయాలని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడు అనేక రంగాల్లో ముందుందని అన్నారు. కేంద్రరాష్ట్ర సంబంధాలపై కలైవనర్ అరంగంలో శనివారం నిర్వహించిన జాతీయ సెమినార్‌లో స్టాలిన్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై తొలి జాతీయ సదస్సును తమిళనాడులో తాను ప్రారంభించడం సంతోషంగా ఉందని సిఎం స్టాలిన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అత్యధికంగా జిఎస్‌టి ఆదాయం అందిస్తున్న రాష్ట్రాల్లో తమిళనాడు ఒకటని చెప్పారు. అయినప్పటికీ కేంద్రం సంకుచిత రాజకీయ ఉద్దేశాలతో తమిళనాడుకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నిధుల వాటాను ఇచ్చేందుకు నిరాకరిస్తోందన్నారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, పంజాబ్, కేరళ రాష్ట్రాలు బిజెపి పాలనలో లేకపోవడంతో కేంద్రం పలు సమస్యలు, ఇబ్బందులు సృష్టిస్తోందని విమర్శించారు.

# అమెరికాలో టూరిస్టు బస్సు బోల్తా: ఐదుగురు దుర్మరణం

**న్యూయార్క్, ఆగస్టు 23:** అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నయాగరా జలపాతం అందాలను చూసి, న్యూయార్క్‌కు తిరిగి వెళ్తున్న టూరిస్టు బస్సు పెంబ్రోక్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఐదుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపుతప్పి బోల్తా పడిందని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో 1 నుంచి 74 యేళ్ల మధ్య వయస్కులు ఉన్నారని, వారందరిని ఎయిర్ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించామని చెప్పారు. మృతుల్లో చిన్నారులు ఎవరూ లేరని తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 54 మంది ఉన్నారని, మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని ఆండ్రే రే అనే పోలీసు అధికారి వెల్లడించారు. పర్యాటకుల్లో అత్యధికులు భారత్, చైనా, ఫిలిప్పీన్స్‌కు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో న్యూయార్క్ హైవేపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇదొక విషాద ఘటన అని న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ పేర్కొన్నారు. తమ యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రమాదానికి సంబంధించి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# బాల్యం నుండే భావి ఛాంపియన్లను గుర్తించాలి

## జాతీయ క్రీడా ఉత్సవాలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

## నేటి నుంచి తొమ్మిది రోజులపాటు జాతీయ క్రీడా దినోత్సవాలు



శనివారం గచ్చిబౌలి స్టేడియంలో మాట్లాడుతున్న క్రీడాశాఖమంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** బాల్యం నుంచే పిల్లల్లో క్రీడాప్రతిభను గుర్తించేందుకు తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖమంత్రి వాటికి శ్రీహరి అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తొమ్మిది రోజులపాటు జరిగే జాతీయ క్రీడ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సాహించాలని, కుటుంబాలకు పరిమితం చేయకుండా క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత తొలుత తల్లిదండ్రుల దేనని అన్నారు. క్రీడల్లో పట్ల శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడల్లో విజయాలు సాధించడమే కాకుండా ఆత్మస్థైర్య పెంపొందిస్తుం దన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దేశంలో ఏ రాష్ట్రము నిర్వహించనంత ఘనంగా జాతీయ క్రీడ ఉత్సవాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తొమ్మిది రోజుల పాటు వివిధ వర్గాలను క్రీడల్లో భాగస్వామ్యం చేసే విధంగా అన్ని వయసుల వారికి వినూత్న కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికే కాకుండా జిల్లా కేంద్రాల్లో వివిధ విద్యాసంస్థల్లో ఈ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, అనిత, కాలేరు సురేష్, అడ్మినిస్ట్రేటర్ మధు ఫ్యూచర్ ఒలంపియన్ నిర్వాహకులు శివప్రసాద్ పాల్గొన్నారు.

# పాస్ బుక్కులు,చెప్పులు క్యూలైన్లలో పెట్టడం అబద్ధమా?

## సిఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** ఒకవైపు యూరియా కొరతతో రాష్ట్ర రైతాంగం అల్లకల్లోలం అవుతుంటే అధికార పక్షం దాన్ని ప్రతిపక్షాల దుష్ప్రచారంగా చెప్పడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్లుందని మండిపడ్డారు. కుండపోత వానలో తడుస్తూ రైతులు గంటల కొద్దీ నిలబడటం అబద్ధమా అని మండిపడ్డారు.ఆధార్ కార్డులు, పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో పెట్టడం అబద్ధమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. యూరియా బస్తాల కోసం రైతన్నలు అధికారుల కాళ్ళు పట్టుకొని వేడుకున్నది అబద్ధమా? దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా అడిగితే పోలీసు లాఠీలతో కొట్టించింది అబద్ధమా? కాంగ్రెస్ ఎంపీల యూరియా పోరాటం ఫలించిందని చెప్పుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి సిగ్గనిపిస్తలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేతగాని తనం వల్లనే కదా ఈరోజు రైతులకు ఇన్ని కష్టాలు వచ్చిందని తెలిపారు. ఈ ముఖ్యమంత్రికి ముందు చూపు లేకపోవడం వల్లనే కదా రైతులు కన్నీళ్లు పెట్టాల్సి వస్తున్నదని మండిపడ్డారు. తులం బంగారం ఇస్తామంటూ ప్రగల్బాలు పలికిన రేవంత్ రెడ్డి, బంగారం మాట దేవుడెరుగు యూరియానే బంగారంగా మార్చిండని హరీశ్‌రావు విమర్శించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులైపారిస్తున్న రేవంత్ రెడ్డి, యూరియా బస్తాలను అందుబాటులో ఉంచడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మండిపడ్డారు. బూటకపు వాగ్దానాలు చేసినంత సులువు కాదు, పరిపాలన చేయడం అంటే అని ఎద్దేవా చేశారు. నమ్మి నయవంచన చేసినంత సులువు కాదు, కేసీఆర్ అందించిన రైతు సంక్షేమాన్ని కొనసాగించడం అంటే అని పేర్కొన్నారు. నాటి రోజులు తెస్తామని పదే పదే చెప్పే రేవంత్ రెడ్డి..అన్నమాట నిలుపుకుంటున్నడని.. మల్లా కాంగ్రెస్ దుర్మార్గ పాలన నాటి పాత రోజులను తీసుకొచ్చిండని మండిపడ్డారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఏనాడూ యూరియా కొరత రాలేదని హరీశ్‌రావు అన్నారు. ఏనాడూ రోడ్డెక్కాల్సిన దుస్థితి రాలేదని గుర్తుచేశారు. యూరియా కొరతకు కారణమైన వారే ఈరోజు యూరియా పేరు చెప్పి రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వంలో ఉన్నాం, బాధ్యతగా ఉండాలనే సోయి కూడా లేకుండా ప్రతి వైఫల్యాన్ని బీఆర్ఎస్, కేసీఆర్ పై వేస్తూ రంకెలేయడం తప్ప 22 పాలనలో ఒరగబెట్టిందేమిటి అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే, ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చేతగాని తనం వల్లనే రాష్ట్రానికి ఎరువుల కొరత వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. ఈరోజు యావత్ రైతాంగాన్ని యూరియా కోసం నడి రోడ్డుపై నిలబెట్టిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది సాగు నీళ్లు ఇవ్వడంలో ఫెయిల్, పంట కొనుగోళ్లలో ఫెయిల్, 500 బోనస్ ఇవ్వడంలో ఫెయిల్, రైతు భరోసా ఇవ్వడంలో ఫెయిల్, రైతు రుణమాఫీలో ఫెయిల్, చివరకు యూరియా సరఫరా చేయడంలో ఫెయిల్ అని విమర్శించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ కెప్టెన్ల నియామకం

## గ్రూపుల వారీగా సపరేట్‌గా కెప్టెన్లు

## స్పోర్ట్స్ కెప్టెన్‌ను నియమించాలని నిర్ణయం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 23:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఇకపై ప్రత్యేకంగా కెప్టెన్లను నియమించాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఇప్పటికే ప్రభుత్వం నుంచి అనుమతి కూడా వచ్చినట్టు అధికారులు తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో సుమారు 26,120 వరకు ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో ప్రత్యేకంగా స్కూల్ కెప్టెన్ పేరుతోగానీ స్కూల్ పీపుల్స్ లీడర్(ఎస్‌పిఎల్) పేరుతోగానీ వారిని నియమించే అవకాశం ఉంది. స్కూల్ కెప్టెన్ కాకుండా మరో నలుగురిని గ్రూప్ కెప్టెన్స్‌గా నియమించనున్నారు. వారు కాకుండా ప్రత్యేకంగా స్పోర్ట్స్ కెప్టెన్‌ను నియమించనున్నారు. ఇలా నియమించిన వారికి ప్రత్యేకంగా వారి వారి విధులు, బాధ్యతలను రూపొందించనున్నారు. స్కూల్ కెప్టెన్, ఎస్‌పిఎల్ మొత్తం విద్యార్థులకి రిప్రజెంటేటీవ్‌గా ఉంటాడు. విద్యార్థులకి సంబంధించిన అన్ని సమస్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర ఉండనుంది. అలాగే ఆగస్టు-15, జనవరి-26 వంటి జాతీయ దినోత్సవాల నిర్వహణను వారే దగ్గరుండి నిర్వహించేలాగా చూడనున్నారు. విద్యార్థుల సమస్యలపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఆదర్శ పాఠశాల కమిటీలు సైతం స్కూల్ కెప్టెన్‌కి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. వారు కాకుండా నలుగురిని గ్రూప్ కెప్టెన్లుగా నియమించనున్నారు. ఆ నలుగురు నాలుగు విభాగాలకు కెప్టెన్లుగా కొనసాగుతారు. ఇక ప్రత్యేకంగా స్పోర్ట్స్ కెప్టెన్‌ను నియమించనున్నారు. ఇతను పాఠశాలలో స్పోర్ట్స్ పిరియడ్ నిర్వహణ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాల నుంచి వెళ్లేవారు.. వారికి శిక్షణ ఇప్పించడంతోపాటు.. ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఆయా క్రీడల్లో శిక్షణను ఇప్పించడంలో స్పోర్ట్స్ కెప్టెన్ బాధ్యత తీసుకుంటాడు. స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, గ్రూప్ కెప్టెన్లు, స్పోర్ట్స్ కెప్టెన్ల నియామకం చేపట్టడానికి పాఠశాల విద్య శాఖ అధికారులు ప్రభుత్వ అనుమతి కోరగా.. అందుకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ స్కూల్ కెప్టెన్, గ్రూప్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్‌ల నియామకం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఈ ఏడాది ప్రారంభిస్తే వచ్చే ఏడాది నుంచి పాఠశాల ప్రారంభం నుంచే వీరిని నియమించే అవకాశం ఉంది.

# గేట్‌వే ఆఫ్ తెలంగాణ ప్రాజెక్టులకు భారీ వరద

## కృష్ణపై జూరాల, గోదావరిపై ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేత

**హైదరాబాద్ ఆగస్టు 23,ప్రభాతవార్త:** తెలంగాణకు కృష్ణా,గోదావరి నదులపై గేట్‌వేఆఫ్ తెలంగాణ ప్రాజెక్టులుగా పేరున్న ఇందిరా ప్రియదర్శిని జూరాల, శ్రీరామరామసాగర్ ప్రాజెక్టులకు కర్ణాటక, మహారాష్ట్రలో గత వారం రోజులుగా భారీ వర్షాలు కురువడంతో కృష్ణా,గోదావరి నదులు పెద్ద ఎత్తున వరద పోటెత్తుతున్నాయి. కృష్ణా నది పై ఉన్న ఇందిరా ప్రియదర్శిని జూరాల డ్యామ్ కు మరోసారి భారీ వరద వచ్చి చేరుతోంది. ఇప్పటికే ఈ సీజన్ లో 10 సార్లకు పైగా గేట్లను ఎత్తిన అధికారులు,భారీ వరద పోటెత్తడంతో అప్రమత్తం అయ్యారు. డ్యామ్ 37 గేట్లను ఎత్తిన అధికారులు ఎగువ నుంచి వచ్చిన వరదను వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 3,77,00 క్యూసెక్కుల వరద వస్తుండగా,37 గేట్లు, అన్ని కాలువలు, విద్యుత్ కేంద్రాల ద్వారా దిగువకు 3,69,874 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి మరోసారి వరద పోటెత్తగా అధికారులు 8 గేట్లను ఎత్తారు. ఈ క్రమంలో శ్రీశైలానికి పర్యాటకుల తాకిడి పెరిగిపోయింది. అలాగే సాగర్, టైల్ పాండ్, పులిచింతల, కృష్ణా బ్యారేజీ గేట్లను సైతం ఎత్తిపట్టిన అధికారులు వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు నేరుగా సముద్రంలోకి పరుగులు తీస్తుంది.శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుకు శనివారం రాత్రి ఎనిమిదిన్నరకు వరద ప్రవాహం 75000 క్యూసెక్కుల వస్తున్నది. తొలిసారి ఎస్సారెస్పీ గేట్లు ఆగస్టు 20 తొలిసారి 39 గేట్లు ఎత్తారు వరద తగ్గడంతో అధికారులు శుక్రవారం జలాశయం గేట్లు మూసివేశారు. మళ్లీ ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో అర్ధరాత్రి 16 గేట్లను ఎత్తి 73,812 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం రాత్రి ఎనిమిదిన్నరకు ఎనిమిది గేట్లు మాత్రమే ఎత్తి ఉంచారు దీంతో పాలకడలిని తలపించేలావరద నీరంతా దిగువకు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

ప్రస్తుతం ప్రాజెక్టుకు ఇన్లో 78 వేల క్యూసెక్కులు కాగా కాకతీయ కాల్వ ద్వారా 3500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1500 క్యూసెక్కులు, ఇందిరమ్మ కాల్వ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.7 అడుగులుగా ఉంది.

# జలమండలిలో ఏఐ సాంకేతికపరిజ్ఞానం

## ఇంకుడు గుంతల ప్రాముఖ్యం స్థానికులకు వివరించిన అశోక్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, అధునాతన సాంకేతికత వినియోగంలో దేశంలో ఇతర బోర్డుల కంటే ఉన్నతంగా ఉన్న జలమండలి.. ఇప్పుడు వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి ఏఐ సహాయంతో ముందుకు వెళ్తుంది. జలమండలి గత సంవత్సర కాలంలో మెట్రో కస్టమర్ కేర్(ఎంసిసి)లో నమోదు అయినా ఫిర్యాదులను ఏఐ ద్వారా కొన్ని రోజులుగా ఐటి విభాగపు అధికారులు విశ్లేషిస్తున్నారు. ఏయే ప్రాంతాలతో పాటు అత్యధికంగా ట్యాంకర్‌లను బుక్ చేసిన వినియోగదారుల వివరాలను సైతం, ఏఐ సాంకేతికతతో విశ్లేషించారు. కాగా గత యేడాది సెప్టెంబరు 1 నుంచి ఇప్పటివరకు 6 లక్షల 50 వేలకు పైగా వివిధ సమస్యలపై ఫిర్యాదులు జలమండలి కస్టమర్ కేర్‌కు అందగా, 12 లక్షలపైగా వాటర్ ట్యాంకర్ లను వినియోగదారులు బుక్ చేసుకున్నారు.ఈ ప్రాంతంలో గత వేసవిలో అత్యధిక ట్యాంకర్ బుకింగ్స్ నమోదు అయినట్టు ఏఐ సాంకేతికత ద్వారా గుర్తించారు.

# సిరిసిల్ల నేతన్నలకు అండగా నిలవండి

## రూ.101.77 కోట్ల విద్యుత్ సిబ్సడీని వెంటనే విడుదల చేయండి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కేటీఆర్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు23:** సిరిసిల్లలోని పవర్ లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పవర్ లూమ్ కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ.101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు.

# 'నాన్నే అమ్మను నిలువునా తగలబెట్టారు'

## మృతురాలు నిక్కి కొడుకు విడియో సాక్ష్యంతో మలుపు తిరిగిన కేసు

**లక్నో, ఆగస్టు 23:** ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలోని సిర్సా గ్రామంలో జరిగిన ఒక దారుణ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కట్నం కోసం వేధించి నిక్కి అనే మహిళను ఆమె అత్తింటివారు తీవ్రంగా కొట్టి, ఆ తర్వాత సజీవదహనం చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ అమానుష చర్యలో ఆమె భర్త విపిన్, అతని కుటుంబసభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన ఒక విడియోలో నిక్కి కొడుకు 'నాన్న నా అమ్మని తగలబెట్టారు' అని చెప్పడం ఈ కేసులో ఒక కీలక మలుపుగా మారింది.

**అసలేం జరిగిందంటే?**

నిక్కికి 2016 డిసెంబర్‌లో సిర్సా గ్రామానికి చెందిన విపిన్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో నిక్కి కుటుంబం వారికి స్కార్పియో కారుతోపాటు భారీగా కట్నం ఇచ్చింది. అయితే, పెళ్లయిన తర్వాత కూడా అత్తింటివారు రూ. 35 లక్షలు అదనంగా తీసుకురావాలని వేధించడం మొదలు పెట్టారు. నిక్కి తల్లిదండ్రులు వారి డిమాండ్ మేరకు మరో కారును కూడా ఇచ్చినా, వేధింపులు మాత్రం ఆగలేదు. నిక్కి అక్క కంచన్‌కు కూడా అదే కుటుంబంలోని వ్యక్తితో వివాహం జరిగింది. కంచన్ చెప్పిన దాని ప్రకారం.. నిందితులు నిక్కిని దారుణంగా కొట్టారు, గొంతుపై దాడి చేశారు. ఆమె స్పృహ కోల్పోగానే, ఆమెపై మండే పదార్థం పోసి నిప్పంటించారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు

## విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 23:** తెలంగాణ రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్‌ఆర్‌ఎస్) హాజరును ప్రారంభించారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఎఫ్‌ఆర్‌ఎస్‌ను ప్రారంభించినట్టు ఇంటర్ విద్య డైరక్టర్ కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌తో డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ దిశగా ఒక కీలకమైన అడుగు వేయడంతో పాటు విద్యాసంస్థల్లో పారదర్శకతను నిర్ధారించే ప్రయత్నం జరిగిందన్నారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో ఎఫ్‌ఆర్‌ఎస్‌అమలుతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ మెరుగైన పాలనకుతీసుకువెళ్ళే పరివర్తనాత్మకమైన చర్య అన్నారు. 1,64,621 మంది విద్యార్థులలో ఇప్పటివరకు 63,587 మంది విద్యార్థుల నమోదును పూర్తి చేశామని, మిగిలిన నమోదు పనులు సోమవారం నాటికి పూర్తవుతాయని తెలిపారు.



# సైబర్ భద్రత, పరిశోధన, అభివృద్ధి కోసం ఐఎస్‌బితో టిజిసిఎస్‌బి ఒప్పందం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** సైబర్ భద్రత, పరిశోధన, అభివృద్ధి విషయంలో మరింత మెరుగైన ఫలితాల కోసం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఇండియన్ స్కూల్ బిజినెస్ (ఐఎస్‌బి) డేటా సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకుడి జిపి జితేందర్, టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ ఐఎస్‌బి అధికారులు శనివారం పరస్పరం సంతకాలు చేసుకుని పత్రాలు మార్చుకున్నారు. క మాండ్ కంట్రోల్‌లోని టిజిసిఎస్‌బి కార్యాలయంలో ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డిజిపి జితేందర్ మాట్లాడుతూ సైబర్ నేరాలలో ఆర్థికంగా జరిగే నేరాలు ఎక్కువగా వుంటున్నాయని, వీటిని కనీస స్థాయికి తెచ్చేందు కు ఐఎస్‌బితో జరిగిన ఒప్పందం మేలు చేస్తుందని అన్నారు. ఇందు కోసం సైబర్ భద్రత, పరిశోధన, టెక్నాలజి ఆధారిత సాధనాలు, విధాన ఫ్రేమ్‌వర్క్‌ల రూపకల్పనలో రెండు విభాగాలు కలిసి పనిచేస్తాయని ఆయన తెలిపారు. దీంతో పాటు డిజిటల్ మోసాల నివారణ, సైబర్ నేరాల ప్రాసిక్యూషన్, బలమైన నియంత్రణ పద్ధతుల కోసం విధానాలను రూపొందిస్తా మని ఆయన తెలిపారు. ఆర్థిక నేరాల విషయంలో మ్యూల్ ఖాతాల నెట్ వర్కులు, డిజిటల్ మనీలాండరింగ్, డీఫ్‌ఫేక్‌లు, ఆర్థిక అక్రమాలపైనా దృష్టి సారిస్తామని డిజిపి అన్నారు. ఎఐ ఆధారిత రిస్క్ మోడల్స్‌తో పాటు వాటి నివారణ, డిజిటల్ లావాదేవీల్లో మ్యూల్ ఖాతాలను గుర్తించి ముం దస్తు చర్యలు చేబట్టడం, నాలేడ్జి షేరింగ్‌తో పాటు సామర్థ్య అభివృద్ధి పరిశోధన ఫలితాలు, ప్రచురణచ కేస్ స్టడీస్, భాగస్వాముల అభిప్రాయాలు,న్యాయ అమలును బలోపేతం చేస్తా మని డిజిపి జితేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్‌తో పాటు ఐఎస్‌బి తరపున మనీష్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు.


# మేఘాలయలో డోనర్ ప్రాజెక్టుల పురోగతి భేష్

## మేఘాలయ గవర్నర్ విజయకుమార్‌తో కేంద్రమంత్రి బండి సంజయ్ మర్యాదపూర్వక భేటి

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డోనర్ (డెవలెప్ మెంట్ ఆఫ్ నార్త్ ఈస్టర్న్ రీజియన్) ప్రాజెక్టుల పురోగతి భేష్ అని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. ముఖ్యంగా ఆకాంక్షిత జిల్లాలు, బ్లాక్‌లలో (ఆస్పిరేషన్ డిస్ట్రిక్ట్స్) కేంద్ర సంక్షేమ పథకాలు విజయవంతంగా ప్రజలకు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మేఘాలయ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం ఉదయం రాజ్ భవన్‌లో గవర్నర్ విజయ్ కుమార్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం షిల్లాంగ్‌లో పలుఅభివృద్ధి కార్యక్రమాలపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు .ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసి ఇప్పటిదాకా రెండు లక్షల కోట్ల రూపాయల నిధులను వెచ్చించిందని ఆయన వివరించారు.

# 'సల్వా జుడుం'పై తీర్పు నాది కాదు.. సుప్రీంకోర్టుది

## అమిత్‌షా ఆరోపణలకు జవాబిచ్చిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** దేశ ప్రజాస్వామ్యంలో లోటు కనిపిస్తోందని, రాజ్యాంగం కూడా సవాళ్లు ఎదుర్కొంటోందని ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సల్వా జుడుం తీర్పుపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ అది తాను ఇచ్చినది కాదని, సుప్రీంకోర్టు తీర్పు అని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఎంపిక చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి కులగణన అవసరమని అభిప్రాయపడ్డారు. కేంద్ర హోంమంత్రితో ఈ విషయంపై నేరుగా చర్చకు దిగాలని అనుకోవడం లేదు. గతంలో ఆ తీర్పు నేనే రాశాను. కానీ అది నా తీర్పు కాదు.. సుప్రీంకోర్టు ఇచ్చింది. 40 పేజీల ఆ తీర్పును అమిత్ షా చదవాలని ఆశిస్తున్నా. ఒకవేళ అది చదివి ఉంటే ఆవ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదు. ఇదే నేను చెప్పదలచుకున్నా. ఇంతటితో ఈ చర్చను ఆపేద్దాం అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కుల గణనపై మాట్లాడుతూ సామాజిక ఆర్థిక విధానాల రూపకల్పన కోసం దీనిని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఏకగ్రీవంగా ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నా. ఇది 64శాతం ప్రజల ప్రాతినిధ్యాన్ని సూచిస్తోంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక అనేది ఇద్దరి అభ్యర్థుల మధ్య పోటీకాదు, రెండుభావిజాలాల మధ్య పోటీ. ప్రజాస్వామ్యం అంటే పరస్పర చర్చ మాత్రమే. వ్యక్తులు, వారి ఆలోచనల మధ్య సంఘర్షణ కాదు. జాతీయ అంశాలపై గతంలో అధికార, విపక్ష పార్టీలు సమన్వయం చేసుకునేవి. దురదృష్టవశాత్తు ఇప్పుడది కనిపించడంలేదు. పార్లమెంట్ కార్యకలాపాలకు సభ్యులు అప్పుడప్పుడు అంతరాయం కలిగించడం కూడా ఒక విధమైన నిరసన మాత్రమే. అయితే ప్రజాస్వామ్య ప్రక్రియలో అది అంతర్భాగంగా మారకూడదు. ఒకప్పుడు లోటు ఆర్థిక వ్యవస్థ గురించి చర్చ జరిగేది. కానీఇప్పుడు మాత్రం ప్రజాస్వామ్యంలో లోటు గురించి మాట్లాడుకుంటున్నాం. భారత్ ప్రజాస్వామ్య దేశం కాదని అనడం లేదు. ఇప్పటికీ మనది రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యమే. అయితే ప్రస్తుతం అది ఒత్తిడికి గురవుతోందని భావిస్తున్నా అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

# అర్చకులు, ఇఒలకు పదోన్నతులు

## యేళ్లుగా పెండింగ్లో ఉన్నసమస్యకు మంత్రి కొండా సురేఖ కృషితో పరిష్కారం

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** దేవాదాయ శాఖలో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆలయాల అర్చకులు, ఈఓలకు మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవతో దేవాదాయ శాఖ పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు శనివారం సచివాలయంలో మంత్రి సురేఖ పదోన్నతి పొందిన అర్చకులు, ఈఓలకు ఆర్డర్ కాపీలను అందజేశారు. జిఓ ఎంఎస్.నెం.261 ప్రకారం14 వేదపరాయణం చేసేవారికి గ్రేడ్ 3 నుంచి 2కి, గ్రేడ్ 2 నుంచి 1, 2పోస్టులు మొత్తం 16 మంది అభ్యర్థులను ఎంపికచేశారు. దేవాదాయ శాఖలోని ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పదవీ వీరమణ చేసిన అర్చక, ఇతర ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.4.00 లక్షల నుంచి రూ.8.00లక్షలకు పెంచడానికి, హోసింగ్ లోన్ రూ.10లక్షల వరకు బ్యాంకు వడ్డీ, ఇతర సౌకర్యాలు అర్చక సంక్షేమ నిధి ద్వారా లబ్ధి చేకూర్చేందుకు మంత్రి సురేఖ ప్రత్యేకంగా కృషి చేశారు. 10 ఆలయాల అభివృద్ధికి చర్యలు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం బంగారు గోపురం మొదలు కొని దేవాదాయశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మంత్రి సురేఖ ఎండోమెంట్ డైరెక్టర్ వెంకటరావును అడిగి తెలుసుకున్నారు.

ఆట

## అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్‌లో
# కార్తీక్, రవీనా, తేజస్‌కు స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** జాతీయ అంతర్‌రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మూడో రోజున కేరళకు చెందిన కార్తీక్ ఉన్నికృష్ణన్ పురుషుల ట్రిపుల్ జంప్‌లో సీజన్‌లో అత్యుత్తమంగా 16.44 మీటర్ల జంప్‌తో అబ్దుల్లా అబూబకర్, జాతీయ రికార్డు హోల్డర్ ప్రవీణ్ చిత్రవేల్‌లను అధిగమించి స్వర్ణం సాధించాడు. అబూబకర్ 16.37 మీటర్లతో రెండవ స్థానంలో రజతం, చిత్రవేల్ 16.35 మీటర్లతో కాంస్యంతో సరిపెట్టుకున్నారు. కార్తీక్ ఇటీవల భువనేశ్వర్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య ఈవెంట్‌లో రజతం గెలుచుకోవడమే కాకుండా జాతీయ పోటీలో తన ఫామ్‌ను కొనసాగించాడు. అలాగే రేస్‌వాకింగ్‌లో కేరళకు చెందిన 20 ఏళ్ల బిలిన్ జార్జ్ పురుషుల 20 కి.మీ ఈవెంట్‌ను 1:29:35.12 సమయంలో గెలుచుకున్నాడు. మహిళల 20 కి.మీ. ఈవెంట్‌లో రవీనా 1:35:13.49 సమయంతో మీట్ రికార్డును బద్దలు కొట్టింది. మహారాష్ట్రకు చెందిన తేజస్ షిర్సే తన అద్భుతమైన పరుగును కొనసాగించి, పురుషుల 110 మీటర్ల హార్డిల్స్‌ను 13.60 సెకన్ల సమయంతో ముగింపు రేఖను దాటి, సీనియర్ జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మోమిత మోండల్ 13.22 సెకన్లలో వ్యక్తిగత అత్యుత్తమ స్కోరు నమోదు చేసి మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో స్వర్ణం సాధించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్ పాల్ 15:00.83 సెకన్లలో పురుషుల 5000 మీటర్ల టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. కర్ణాటక మిక్స్‌డ్ 4+400 మీటర్ల రిలేలో స్వర్ణం సాధించింది.

## ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో
# పురుషుల టీమ్‌కు వరల్డ్ టైటిల్స్
### రెండు స్వర్ణాలతో భారత్ అద్భుత ప్రదర్శన



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్-2025లో భారత పురుషుల కాంపౌండ్ జట్లు రెండు స్వర్ణాలు గెలుచుకున్నాయి. భారత కాంపౌండ్ అండర్ 18, అండర్ 21 జట్లు ప్రపంచ టైటిళ్లను గెలుచుకున్నాయి. కెనడాలోని విన్నిపెగ్‌లో శనివారం జరిగిన వరల్డ్ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో భారత కాంపౌండ్ పురుషుల అండర్ 21 జట్టు తమ తొలి జూనియర్ ప్రపంచ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్వర్ణ పతక పోటీలో ఇరు జట్లు 233 పాయింట్లతో సమంగా నిలిచిన తర్వాత, కుశాల్ దలాల్, మిహిర్ అపార్ మరియు గణేష్ మణి రత్నంలతో కూడిన భారత త్రయం షూటాఫ్‌లో జర్మనీని ఓడించింది. మరో విభాగంలో భారత ఆర్చర్లు మోహిత్ డాగర్, యోగేష్ జోషి మరియు దేవాన్ష్ సింగ్‌లతో కూడిన కాంపౌండ్ పురుషుల అండర్ 18 జట్టు ఫైనల్‌లో యుఎస్‌ఎను 224-222 తేడాతో ఓడించి క్యాడెట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. మరోవైపు గాథా ఖడ్కే, జియానా కుమార్, శార్వరి షెండేలతో కూడిన భారత మహిళల అండర్ 18 రికర్వ్ జట్టు కాంస్య పతక పోరులో యుఎస్ఎ పై 6-0 తేడాతో విజయం సాధించి క్యాడెట్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# అర్జున్, ఎలావెనిల్ జోడీకి స్వర్ణం
### భారత్ ఖాతాలో 21 స్వర్ణ, 8 రజత, 10 కాంస్యాలు

**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ షూటర్స్ అద్భుతమైన ప్రదర్శన చేశారు. శనివారం కజకిస్తాన్‌లోని షిమ్కెంట్‌లో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్ బాబుటా-ఎలావెనిల్ వలరివన్ బంగారు పతకాన్ని సాధించారు. ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో ఈ భారత జంట చైనాకు చెందిన డింగ్కే లు-జిన్లు పెంగ్ లను 17-11 తేడాతో ఓడించింది. ప్రారంభ రౌండ్లలో వెనుకబడినా తర్వాత మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ప్రారంభంలో 9.5, 10.1 స్కోర్‌లతో భారత్ ద్వయం ఉన్నా, తదుపరి దశలలో పుంజుకుని ఖచ్చితమైన షూటింగ్‌లో దోషరహిత ప్రదర్శనను ప్రదర్శించి విజయాన్ని సాధించారు.



అంతకు ముందు జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో విజయం సాధించిన తర్వాత, ఎలావెనిల్ ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆమెకు ఇది రెండవ బంగారు పతకం. ఆ పోటీలో, ఆమె 253.6 పాయింట్లు సాధించి, చైనాకు చెందిన పెంగ్ జిన్లు (253.0) మరియు కొరియాకు చెందిన క్వాన్ యుంజి (231.2) లను తృటిలో ఓడించి, మొదటిసారి ఖండాంతర ఛాంపియన్‌గా నిలిచింది. టోక్యో 2020 మరియు పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ఎలావెనిల్, ఒత్తిడిలో కూడా తన ప్రతిభను ప్రదర్శించి, ఆసియాలో అగ్రశ్రేణి షూటర్లలో ఒకరిగా తన హోదాను సుస్థిరం చేసుకుంది. ఇక ప్రస్తుత షిమ్కెంట్‌లో జరిగిన ఈవెంట్లఓ భారత్ ఆధిపత్యం ఎలావెనిల్-బాబుటాకే పరిమితం కాలేదు. ఛాంపియన్‌షిప్‌లో ముందుగా, అర్జున్ బాబుటా, రుద్రాంక్ష్ పాటిల్, కిరణ్ జాదవ్‌లతో కూడిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లలో భారత్ బలాన్ని ప్రదర్శించి స్వర్ణాన్ని గెలుచుకుంది. ఇదే సమయంలో మహిళల జట్టు పోటీలో ఎలావెనిల్ మెహులి ఘోష్-అనన్య నాయుడులతో జతకట్టి తృటిలో రజత పతకాన్ని కోల్పోయి, కాంస్యాన్ని గెలుచుకుంది, మెహులి ఘోష్ మహిళల వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్‌లో కూడా పోటీపడి ప్రశంసనీయమైన నాల్గవ స్థానంలో నిలిచింది.

కాగా చివరి లెక్కింపు ప్రకారం భారత్ 21 స్వర్ణాలు, 8 రజతాలు, 10 కాంస్య పతకాలతో పతకాల పట్టికలో సునాయాసంగా అగ్రస్థానంలో ఉంది. చైనా తొమ్మిది స్వర్ణాలు మరియు మొత్తం 19 పతకాలతో రెండవ స్థానంలో ఉంది.



# వన్డే కెప్టెన్సీకి పోటీ
### రోహిత్ ప్లేస్‌లో గిల్, శ్రేయస్

**న్యూఢిల్లీ:** వన్డేల్లో టీమిండియా కెప్టెన్సీ మార్పుపై బీసీసీఐ దృష్టిసారించింది. ప్రస్తుతం వన్డే కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ స్థానంలో వేరొకరిని నియమించే యత్నాలు జరుగుతున్నాయి. ఈ రేస్‌లో టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్‌తో పాటు, శ్రేయస్ అయ్యర్ మధ్యే పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ రేసులో శ్రేయస్ వెనుకబడి ఉన్నట్లు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు వెల్లడిస్తున్నాయి. వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఆసియాకప్ 2025 కోసం భారత జట్టును ఇటీవల ఎంపిక చేశారు. ఆ జట్టు ఎంపిక తరువాత టీమ్‌ఇండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గురించే చర్చ నడుస్తోంది. దేశవాళీతో పాటు ఐపీఎల్‌లో రాణించి మంచి ఫాలో ఉన్నప్పటికి కూడా శ్రేయస్‌కు ఆసియా కప్ టీమ్‌లో చోటు దొరకలేదు. ఇక ఇదే సమయంలో వన్డేల్లో శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ వయసు 38 సంవత్సరాలు. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి రిటైర్ అయ్యాడు. 2027 వన్డే ప్రపంచ కప్ నాటికి అతనికి 40 సంవత్సరాలు నిండుతాయి. ఇటువంటి పరిస్థితిలో వన్డే ప్రపంచ కప్ కోసం భారత్ క్రికెట్ బోర్డు ఒక యువ ఆటగాడికి కమాండ్‌ను అప్పగించే ఆలోచన చేస్తోంది. రోహిత్ స్థానానికి సంబంధించిన రేసులో శుభమాన్, శ్రేయస్ మధ్యే పోటీ నెలకొంది. గత వన్డే ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలలో అయ్యర్ అద్భుతంగా రాణించాడు. అయినప్పటికీ, కెప్టెన్సీ రేసులో అతను చాలా వెనుకబడి ఉన్నాడని భావిస్తున్నారు. ప్రస్తుతం గిల్‌కు టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించారు. అంతే కాకుండా అతను ఆసియా కప్‌కు పోటీ పడే టీ20కి కూడా వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యాడు. అతను ఇప్పటికే వన్డేలకూ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ నేపథ్యంలో గిల్ మూడు ఫార్మాట్లలోనూ జట్టుకు కెప్టెన్‌గా మారే అవకాశం ఎక్కువగా ఉంది. వన్డే కెప్టెన్సీకి కూడా ప్రస్తుత భారత టెస్ట్ కెప్టెన్ గిల్ సహజ ఎంపిక అని నివేదికలు వెల్లడిస్తున్నాయి. వన్డే క్రికెట్‌లో అతని సగటు 59. అయితే గిల్‌కు అయ్యర్ కంటే తక్కువ అనుభవం ఉంది. అలాగే ఐపీఎల్‌లో చాలా కాలం కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం శ్రేయస్‌కు ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో పాటు పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్స్‌కు తీసుకెళ్లాడు. కానీ అనుభవంలో గిల్ అతని కంటే చాలా వెనుకబడి ఉన్నాడు. రోహిత్ శర్మ తర్వాత బీసీసీఐ వన్డేల్లో ఎవరిని కెప్టెన్‌గా చేస్తుందో ఇప్పుడు చూడాలి.

# మహిళల టెస్ట్: 254 ఆధిక్యంలో భారత్

**న్యూఢిల్లీ:** ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఒక రోజు ఆట మిగిలి ఉండగా, భారత్ జట్టు ఆస్ట్రేలియా జట్టుపై భారీ ఆధిక్యాన్ని సాధించింది. బ్రిస్బేన్ అలన్ బోర్డర్ ఫీల్డ్‌లో నాలుగు రోజుల ఆటలో శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఆస్ట్రేలియా 254 పరుగుల ఆధిక్యాన్ని పెంచుకుంది. రాఘవ్వీ బిస్ట్ 86, షఫాలీ వర్మ 52 పరుగులతో కీలక పాత్ర పోషించారు. జోషిత వీజే (9 నాటౌట్), టైటాస్ సాధు (2 నాటౌట్) క్రీజులో ఉండగా, ఇండియా 73 ఓవర్లలో 260/8తో రోజు ముగిసే సమయానికి స్కోరు చేసింది. అంతకుముందు, ఆస్ట్రేలియా 76.2 ఓవర్లలో 305 పరుగులకు ఆలౌటైంది, సీమ్ బౌలింగ. ఆల్ రౌండర్ సియానా జింజర్ పోరాడి 300 పరుగులు సాధించాడు. అయితే ఈ మ్యాచ్ డ్రా అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఆస్ట్రేలియా 158/5 వద్ద 24 పరుగులతో నాటౌట్‌గా తిరిగి ఆట ప్రారంభించిన సియానా, నికోల్ ఫాల్టమ్ (54) తో కలిసి 102 పరుగుల భాగస్వామ్యంతో ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. జోషిత చేతిలో నికోల్ అవుట్ అయిన తర్వాత, సియానా మైట్లాన్ బ్రౌన్ (22) తో కలిసి మరో 44 పరుగులు జోడించి, తన 138 బంతుల్లో




12 ఫోర్లతో కూడిన ఏకైక సిక్స్‌తో సెంచరీని నమోదు చేసింది. 103 పరుగుల వద్ద సైమా ఠాకూర్ బౌలింగ్ లో క్యాచ్ ఇచ్చి ఔటైన చివరి బ్యాట్స్‌మెన్ ఆమె. ఆ తర్వాత ఆతిథ్య జట్టు ఇండియా ఎ తొలి ఇన్నింగ్స్ లో 299 పరుగుల కంటే కేవలం ఆరు పరుగులు ముందు నిలిచింది. సియానా కూడా బంతితో తొలి ప్రభావం చూపింది, ఓపెనర్ నందిని కశ్యప్‌ను 12 పరుగులకే ఎల్బీడబ్ల్యూగా ట్రాప్ చేసి ఆస్ట్రేలియాకు తొలి బ్రేక్‌త్రూ అందించింది. కానీ షఫాలి 58 బంతుల్లో 52 పరుగులు చేసి, రెండు సిక్సర్లు కొట్టి, అమీ ఎడ్గార్‌కు బౌలింగ్ వేసింది. ఆమె ధరా గుజ్జర్ (20)ను కూడా అవుట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 93 పరుగులు చేసిన రాఘవ్వీ 119 బంతుల్లో 86 పరుగులు చేసి 13 బౌండరీలు బాది ఇండియా ఆధిక్యాన్ని 200 దాటించింది. రోజు చివరిలో ఎడ్గార్ బౌలింగ్‌లో ఆమె అవుట్ కావడంతో పర్యాటక జట్టు ఎనిమిది పరుగులు చేసింది. సంక్షిప్త స్కోర్లు: భారత్ 73 ఓవర్లలో 299, 260/8 (రాఘవి బిస్త్ 86, షఫాలీ వర్మ 52; అమీ ఎడ్గర్ 453, జార్జియా ప్రెస్‌విడ్జ్ 242), ఆస్ట్రేలియా 76.2 ఓవర్లలో 305. (సియాన్నా జింజర్ థాక్యుమ్ 103, నిమాకోలే 103 331, రాధా యాదవ్ 268) భారత్ ఆధిక్యం 254 పరుగులు.




# ప్రభుత్వ బ్యాంకుల్లో కొత్త స్కీమ్‌లు!


**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** కొంత కాలంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)రెపో రేట్లను తగ్గిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బ్యాంకులు లోన్,ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను క్రమక్రమంగా తగ్గుతున్నాయి. ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులు రెగ్యులర్ డిపాజిట్లతో పోలిస్తే అధిక వడ్డీ అందిస్తూ ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్ని ప్రారంభిస్తున్నాయి. ఎస్బీఐ సహా ఇతర ప్రభుత్వ బ్యాంకులు చాలానే ఉన్నాయి. కేవలం 444 రోజుల వ్యవధితో ప్రత్యేక డిపాజిట్ పథకాల్ని ఏర్పాటుచేస్తున్నాయి. ఎస్బీఐ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 444 రోజుల వ్యవధితో అమృత్ వృష్టి పథకం ఇటీవల ప్రారంభం కాగా...రూ. లక్ష పొదుపుతో సాధారణ ప్రజలకు 6.60 శాతం (రూ. 8,288), సీనియర్ సిటిజెన్లకు 7.10 శాతం (రూ. 8,931) వడ్డీ అందిస్తోంది. ఇక్కడ రూ. రూ. 1,08,288 వస్తుంది. సీనియర్ సిటిజెన్లకు రూ. 8,931 వడ్డీ వస్తుంది. సూపర్ సీనియర్ సిటిజెన్లకు 7.20 శాతం చొప్పున రూ. 9061 వడ్డీ అందుతుంది.ఇక బ్యాంక్ ఆఫ్ బరోడాలో బీఓబీ స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ స్కీమ్‌తో ఎస్బీఐ మాదిరిగానే వడ్డీ రేట్లు ఉన్నాయి. రిటర్న్లు కూడా అలాగే ఉంటాయని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.అదేవిధంగా ఇండియన్ బ్యాంకులో ఇండ్ సెక్యూర్ ప్రొడక్ట్ ఎఫ్‌డీ స్కీమ్ తీసుకొచ్చింది. సాధారణ ప్రజలకు అత్యధికంగా 6.70 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.20 శాతం, సూపర్ సీనియర్ సిటిజెన్లకు 7.45 శాతం వడ్డీ అందిస్తోంది. ఇక్కడ రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి మెచ్యూరిటీకి వరుసగా రూ. 8418, రూ. 9061, రూ. 9,387 గా ఉంది.ఐడీబీఐ బ్యాంక్ ఈ బ్యాంకు ఉత్సవ్ ఎఫ్‌డీ స్పెషల్ డిపాజిట్ స్కీమ్‌తో సాధారణ ప్రజలకు, సీనియర్ సిటిజెన్లకు ఇండియన్ బ్యాంకు మాదిరిగానే వడ్డీ రేట్లు ఉన్నాయి. రిటర్న్లు అలాగే ఉంటాయి. సూపర్ సీనియర్ సిటిజెన్లకు మాత్రం 7.35 శాతం వడ్డీ రేటుతో రూ. 9257గా ఉన్నాయి.

# ఎయిర్‌టెల్ ఆరు నెలలు ఉచితం!




**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ మరోసారి ఆఫర్లను ప్రకటించింది, రీఛార్జ్‌తో కాల్స్, డేటాతో పాటుగా అదనపు బెనిఫిట్స్ కల్పిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. యాపిల్ భాగస్వామ్య ప్రయోజనాన్ని ఇప్పుడు ప్రీపెయిడ్ కస్టమర్లకు సైతం ఉంటుంది. పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు అందించే ఈ బెనిఫిట్స్ ప్రీపెయిడ్ కస్టమర్లు ఉచితంగా పొందవచ్చు. ఐదు నెలల ఫ్రీ ట్రయల్ పూర్తయిన తర్వాత మీరు డీయాక్టివేట్ చేసుకోవాలి. లేదంటే నెలకు రూ. 119 చొప్పు ఆటోరెన్యూవల్ అవుతుందని వెల్లడించింది. యాపిల్ మ్యూజిక్ వ్యక్తిగత ప్లాన్‌కు ధర ఒక నెలకు రూ. 99 ఉండగా.. ఫ్యామిలీ ప్లాన్ అయితే రూ. 149, స్టూడెంట్స్ ప్లాన్ రూ. 59గా నిర్ణయించారు. ఎయిర్‌టెల్ కొత్త ఆఫర్ ద్వారా ప్రీపెయిడ్ యూజర్లు ఆరు నెలల వరకు ఉచితంగా పొందవచ్చు. దీంతో సుమారు రూ. 600 వరకు ఆదా చేసిన వారు అవుతారు. యాపిల్ ప్రీమియం మ్యూజిక్ క్లెయిమ్ చేసుకుంటే యాడ్‌ఫ్రీ మ్యూజిక్, ప్రత్యేక ప్లేలిస్టులు,ఆఫ్‌లైన్ డౌన్ లోడ్స్, హైక్వాలిటీ సౌండ్స్ వంటి ప్రయోజనాలు పొందవచ్చు.సుమారు రూ. 17000 విలువైన పర్లెక్సిటీ ఏఐ ఏడాది ఉచితం ఉంది.అలాగే యాపిల్ టీవీ ప్లస్, రూ. 279 ప్రీపెయిడ్ ప్లాన్‌తో ద్వారా నెట్ ఫ్లిక్స్ బేసిక్, జీ5, ఎక్స్‌ట్రీమ్ ప్లే ప్రీమియం, డిస్నీ+ హాట్‌స్టార్, వంటివి నెల రోజులు ఉచితంగా ఉన్నాయి.

## మారుత్ నిఘా డ్రోన్‌కు డిజిసిఎ సర్టిఫికేట్




**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** హైదరా బాద్‌కు చెందిన మారుత్ డ్రోన్స్ సంస్థ రూపొం దించిన నిఘా డ్రోన్లు అయిన 'దస్సెస్వి ఫ్ట్56కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) సర్టిఫికేట్ లభించింది. నిఘా, హై-ప్రెసిషన్ మాపింగ్, ఫీల్డ్ ట్రెనింగ్ అవసరాలకు ఈ క్వాడ్‌కాప్టర్-క్లాస్ రోటోక్రాఫ్ట్ ఉపయోగపడుతుందని కంపెనీ వెల్లడించింది.

ఎఫ్‌పిఎ కెమెరా, 24ఎంపి మ్యాపింగ్ కెమెరా, 4కే సర్వేలెన్స్ కెమెరా, థర్మల్ ఇమెజింగ్ పరికరాలతో పాటు పలు పేలోడ్ కాన్ఫిగరేషన్లతో అభివృద్ధి చేసినట్లు వివరించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు వీలుగా ఉంటుందని సీఈవో, సహ వ్యవస్థాపకుడు ప్రేమ్‌కుమార్ విస్లావత్ తెలిపారు

# ఆన్‌లైన్ మనీగేమ్‌లు నిలిపివేత

**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** బెట్టింగ్‌యాప్‌లతో ఎందరో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రమాదకరమైన ఆన్‌లైన్ గేమింగ్‌ల నిషేదం ఎట్టకేలకు చట్టబద్దత ఏర్పడింది. పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదించడంతో చట్టం అమలుపై ఏ క్లాజులు ముందుగా ఉంటాయనేది కేంద్ర ఐటీ కార్యదర్శి ఎస్.కృష్ణన్ వివరించారు. ప్రతిపాదత నిబంధనలపై ఐటీశాఖ నిర్వర్తిస్తుందని, ఇస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమ్స్ ప్రోత్సాహం, నియంత్రణ విషయంలో వ్యవస్థ ఏర్పాటుకానుంది. అదేవిధంగా ప్రమోషన్, రెగ్యులేజేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్-2025లో పేర్కొన్న



నియంత్ర సంస్థ ఉంటుందన్నారు. ఈ చట్టంతో దేశంలో అన్నిరకాల ఆన్‌లైన్ మనీగేమ్స్‌పై నిషేదం విధించగా, ఇప్పటికే సంస్థలు రియల్ మనీగేమ్‌లను నిలిపివేశాయి. ఇస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమింగ్‌ను ప్రోత్సాహించాడానికి ఈ బిల్లును తీసుకవచ్చారు. సొంతంగా నిలబడగలిగే చట్టం కాదిదన్నారు. బిల్లులోని ఇతర సెక్షన్లకు ముందే నిషేదాన్ని అమలులోకి తీసుకవచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు. దీనికి సంబంధించిన నిర్దిష్ట నిబంధనలే లేవని వెల్లడించారు.

**అమల్లోకి రాగానే 'నజార్హా పతనం..**

నజారా టెక్నాలజీస్ షేర్ల పతనం కొనసాగుతుంది. గత మూడు రోజుల్లో 17.52శాతం విలువను కోల్పోయ్యాయి. అసోసియేట్ సంస్థ మూన్‌షైన్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న 'పోకర్‌బాజ్షీ తన రియల్ మనీ ఆన్‌లైన్ గేమ్స్ నిషేదం కారణం. ప్రమోషన్, రెగ్యులేజేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్-2025తో కార్యాకలాపాలను ఆపేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది, అయితే నజారాకు ఈ కంపెనీలో 46.07శాతం వాటా ఉంది.



# టోల్‌ప్లాజా ఆపరేటర్లకు ఎన్‌హెచ్‌ఎఐ పరిహారం

**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** జాతీయ రహదారుల టోల్‌ప్లాజా ఆపరేటర్లకు భారత జాతీయ రహదారుల ప్రాదికర సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) మూడు నెలల పరిహారం అందించనుంది. ప్రైవేటు వాణిజ్యేతర వాహనాలకు ఆగస్టు 15నుంచి అమల్లోకి వచ్చిన ఫాస్టాగ్ వార్షికపాస్ నేపథ్యంలో వినియోగదారు ఫీజుల వసూళ్లలో వచ్చిన అంతరాయాన్ని భర్తిచేయనుంది. అయితే సింగిల్ పరిహార వ్యవస్థ తీసుకరావాలని నిర్ణయించినట్లు సర్క్యూలర్‌లో వెల్లడించింది. 2024-25 ఏడాదిలో టోల్‌ద్వారా రూ.72,931 కోట్లను ఎన్‌హెచ్ఐఏ వసూలు చేసింది. ఈ మెకానిజం ప్రస్తుత కాంటాక్ట్ ఒప్పందాలతో పాటు, వచ్చే మూడు నెలల్లో ఆహ్వానించే బిడ్‌లకు వర్తిస్తుంది. తర్వాత ప్రతి టోల్‌ప్లాజా వద్ద వార్షిక పాస్ వినియోగంతో గణాంకాలను తెలుపనున్నట్లు స్పష్టం చేసింది. రూ.3వేలు ఒకేసారి ఫీజు కడితే జాతీయ రహదారులపై 200 టోల్‌ప్లాజాల పరిధిలో ఒక్కోదానికి రూ.15 మాత్రమే అవుతుందని వివరించింది.

# 20 యేళ్లకు పైబడిన వాహనాలక్కు ఆర్సీ రుసుం పెంపు


**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** ఇరవై ఏళ్లకు పైబడిన వాహనాలపై ఆర్‌సి రెన్యూవల్ రుసుంను ప్రభుత్వం పెంచింది. ఇప్పటి వరకు మోటర్ వాహనాల నిబంధనల్లో 81 ప్రకారం కొత్తగా 4సి క్లాజ్‌ను చేర్చి వాటికి అవకాశం కల్పించింది. దీనిపై జిఎస్‌టి అదనంగా ఉంటుందని ఉత్తర్వులో పేర్కొంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ విడుదల



చేసిన నోటిఫికేషన్ ప్రకారం 20ఏళ్లకు పైబడిన మోటర్ వాహనాలకు రెన్యూవల్ ఫీజ్‌ను రూ.2వేలు, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.5వేలు పెంచారు. దిగుమతి చేసుకున్న బైక్, త్రిచక్ర వాహనాలకు రూ.20వేలు కాగా నాలుగు, ఆపై చక్రాల వాహనాలకు 80వేలుగా నిర్ధారించినట్లు వివరించింది.

# వచ్చే యేడాదిలో ఎలక్ట్రిక్ 'రాయల్ ఎన్‌ఫీల్డ్

వాణిజ్యం



**హైదరాబాద్,ఆగస్టు23, ప్రభాతవార్త:** రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ మరో విద్యుత్తు బైక్ మార్కెట్లోకి తీసుకవస్తుంది. వచ్చే ఏడాదిలో ఆ అనుబంధ సంస్థ ఫ్లయింగ్ ఫ్లీ విడుదల చేయనుంది. ఈ మేరకు ఫ్లయింగ్ ఫ్లీ సి6 మోడల్‌ను హైదరాబాద్‌లో ప్రదర్శన ఏర్పాటు చేసింది. నగరాల్లో సులభంగా నడిపేందుకు వీలుగా, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఆధారిత ఆవిష్కరణలతో రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఉపయోగించిన ఫ్లయింగ్ ఫ్లీ మోటర్ సైకిల్ నుంచి స్ఫూర్తి పొంది ఏర్పాటు చేసినట్లు వివరించారు. దాదాపు 200మందికి పైగా ఇంజనీర్లు రూపకల్పనకు శ్రమించారన్నారు.40కి పైగా పేటేంట్ దరఖాస్తులు చేసినట్లు చెప్పారు. ఒకే సీటుతో 19 అంగుళాల అలాయ్‌వీల్స్‌తో రానుంది. స్మార్ట్‌ఫోన్‌తో కనెక్ట్ అయ్యే 3.5అంగుళాల టచ్‌స్క్రీన్ టీఎఫ్‌టి ఇనుస్ట్రుమెంట్ క్లసర్ ఉందని పేర్కొన్నారు. గూగూల్‌మ్యాప్స్‌తో పాటు అన్ని అప్లికేషన్లు ఉన్నాయు. రిమోట్‌లాక్, అన్‌లాక్, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్‌చార్జర్, ఐదురకాల రైడింగ్ పద్దతులు తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒక చార్జింగ్‌తో కిలోమీటర్ల దూరమనేది త్వరలో చెప్తామని, సుమారు 100, 150 కిలోమీటర్ల సామార్థ్యమే ఉంటుందని ప్రతినిధులు వివరించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.